


హెర్క్యులిస్

సైకిల్ కంటె ఎక్కువైనది
జీవితకాలపు నేస్తము.

జ్ఞాపకం చేసుకోటానికి అభిమానపాత్రమైన క్షణము హెర్క్యులిస్‌కే కాదు దాని స్వంత దారునికి కూడా వివాహపు పదియవ వార్షికోత్సవము!

మీరు హెర్క్యులిస్‌ను కొంటే, అది మీ జీవితపు భాగ స్వామి అగును. సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ మీ జీవితములో పరిస్థితులు మారుతాయి .... ఉద్యోగంలో ప్రవృద్ధులు లభిస్తాయి. మీ పిల్లలు పెరిగి పెద్దవారౌతారు. పెండ్లి చేసికొని వేరొకచోట కాపురం పెడతారు. కాని మీ హెర్క్యులిస్ ఎప్పుడూ మీ దగ్గరే ఉంటుంది. ఎప్పుడూ మంచి పరిస్థితులలోనే ఉంటుంది.

టి ఐ సైకిల్స్ ఆఫ ఇండియా,
అంబత్తూరు—మద్రాసు 53

ప్రొప్రయిటర్లు · ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్; మద్రాసు

JWT TIC/18/2000

తొలిమాట

మే నెల "జ్యోతి"లో ఒక పొరపాటు జరిగినందుకు చింతిస్తున్నాము. మేము ప్రచురించిన "జాతక చక్రాలు" అనే కథ "చివరకు మిగిలింది" అనే పేరుతో వేరొక పత్రికలో కూడా ప్రచురితమైంది. రెండింటి రచయిత (కలం పేర్లు మారినా) ఒకరే. ఈ పొరపాటుకు బాధ్యత మాదే. దీన్ని మా దృష్టికి తెస్తూ లేఖలు వ్రాసిన అసంఖ్యాక పాఠక మహాశయులకు మా కృతజ్ఞత.

• • •

"జాతస్య మరణం ధ్రువమ్" అన్నారుగాని, అసలు చావేలేని జీవి ఏదైనా లోకంలో వున్నదా? ఈ ప్రశ్నకు సమాధానంగా డాక్టర్ మహీధర నళినీమోహన్ వ్రాసిన వ్యాసాన్ని ఈ సంచికలో (77వ పేజీ) ప్రచురించాము. పాఠకులకు ఆసక్తికరం కాగల వీరి "పాప్యులర్ సైన్స్" వ్యాసాలు జ్యోతిలో వరసగా ప్రచురించగలమని ఆశిస్తున్నాము.

• • •

దేశంలో కొన్ని కొన్ని సమస్యలకు అతి శాస్త్రీయంగా సూచించబడుతున్న కొన్ని కొన్ని పరిష్కార మార్గాలు ఒక్కొక్కసారి ఎంతైనా హాస్యాస్పదంగా తయారవుతున్నాయి. ఈ ధోరణిపై సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారు వ్రాసిన వ్యంగ్య రచన (25వ పేజీ) పాఠకులను అలరించగలదని మా నమ్మిక.

వె. వి. రాఘవయ్య

జ్యోతి మేనేజింగ్ ఎడిటర్



మహాబల సంపన్నుడు
వస్తున్నాడు!!
అగ్నిబరాటా
కెమెరా: వరదరాజన్
కో డైరెక్టర్స్: K.V.R. ఆచార్య-శోభనాద్రిరావు
కో ప్రొడ్యూసర్: B.V.శ్రీనివాస్
నిర్మాత దర్శకుడు: B.విఠలాచార్య
పూర్ణా రిలీజ్

సుచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట పోస్టు
విజయవాడ—2.

విడిప్రతి వెల
75 పైసలు

ఏడాది చందా
9 రూపాయలు

సంపుటి 4
జూన్ 1966
సంచిక 6

మేనేజింగ్ ఎడిటర్
వి. వి. రాఘవయ్య

ముఖచిత్రం :

ఆత్మా ఆర్ట్స్ వారి
"చిలకా గోరింక"లో దృశ్యాలు


రెమి
పౌడర్
Remy

రాజకీయాలు

జనరల్ ఎన్నికలు ఇంకా దూరంలోనే వున్నాయి. ఇంకా తొమ్మిది నెలల వ్యవధి వుంది. ఈ నవ మాసాలు గడిచాక, ఆంధ్ర రాజకీయాలు ఏ రూపం దాలుస్తాయో ఇప్పుడే చెప్పడం కష్టంగాని, ఈ లోగా మటుకు మంచి రసకందాయంలో పడ్డాయి.

కాంగ్రెసును ఏ విధంగానైనా సరే ఈసారి తమస్థానంలో కూర్చోబెట్టాలని ప్రతిపక్షాలన్నీ తలపోస్తున్నాయి. శ్రీ తెన్నేటి విశ్వనాథం ఇతర ప్రతిపక్షాల నాయకులతో మంతనాలు ప్రారంభించారు. ఒక కనీసపు కార్యక్రమాన్ని రూపొందించుకుని, కాంగ్రెసుతో పోటీ చేయాలని ఆయన సూచన చేశారు. అయితే, ఇది సాధ్యమయ్యేపని కాదని ఆయనకు, ఇతరులకు కూడా తెలిసినదే. కనీసపు కార్యక్రమానికి కూడా వీలు కానంతగా విభేదాలున్న ప్రతిపక్షాలు - ప్రజాపార్టీ, స్వతంత్రపార్టీ, సోషలిస్టులు, జనసంఘ్, కమ్యూనిస్టు ఉభయ వర్గాలు, నేషనల్ డెమొక్రాట్లు, రిపబ్లికన్లు ఇంకా ఏవేవో చిల్లర మల్లర పార్టీలు — ఇవన్నీ ఐక్యం కావడమనేది దాదాపుగ జరగనిపనే. అందుచేత అధమ పక్షం ఎన్నికల సర్దుబాట్లు అయినా చేసుకోవాలనే ఆలోచన జరుగుతున్నది. ఇది ముందుముందు ఏ రూపం ధరిస్తుందో చూడాలి.

ఈలోగా కాంగ్రెసులోనే రకరకాల ముఠాలు బయలుదేరాయి. ఎన్ని ప్రతిపక్షాలున్నాయో అన్ని ముఠాలు కాంగ్రెస్‌లో వున్నట్టు కనబడుతుంది. స్థూలంగా రెండు గ్రూపులు-ఒకటి సంజీవరెడ్డి గారిది, ఇంకొకటి సంజీవయ్య గారి—కనిపిస్తున్నాయి, మళ్ళీ ఒక్కొక్క దానిలో స్వల్ప భేదాలతో, వ్యక్తిగత విధేయతలతో సబ్ గ్రూపులున్నాయి ఇవన్నీ బయటినుంచి చూసేవారికి అయోమయంగా, గందరగోళంగా వుంటాయి. కేవలం పదవీకాంక్ష, వ్యక్తిగత స్వార్థాలు తప్ప ఈ గ్రూపులకు వేరే ఆధారమేమీ కనబడదు.

ఈ నాయకులకు ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఆంధ్రప్రదేశ్‌పై, ఇక్కడి ప్రజల బాగోగులపై, కష్టసుఖాలపై ఎక్కడలేని శ్రద్ధ పుట్టుకొస్తున్నది. దాదాపు ప్రతినెల రాష్ట్రంలో పర్యటన కార్యక్రమాలు వేసుకోవడం, వూరూరూ వెళ్ళడం, వూరేగడం, సభలు జరపడం, సన్మానాలు చేయించుకోవడం పరిపాటి అయింది. కాంగ్రెస్ ఐకమత్యంగా

వుండాలని ఉపన్యాసం ప్రారంభించడం, అవతలి గ్రూపు నాయకుణ్ణి దుమ్మెత్తి పోయడంతో ముగించడం ఇదీ జరుగుతున్నది. తమలో తమకు విభేదాలున్నాయన్న సంగతి వీరు కప్పిపుచ్చడానికి కూడా ప్రయత్నించక పోవడం మరీ విడ్డూరం బహిరంగ సభలలో కూడా ధారాళంగా బజాయించి తిట్టుకోవడం చాలా జుగుప్సాకరంగా తయారైంది.

ఇదంతా చూస్తుంటే, వచ్చే ఎన్నికలలో కాంగ్రెసు ఏ పాటి బలంతో గెలుస్తుంది అనే సందేహం కలక్క మానదు. ఒకవేళ కాంగ్రెసు బలం తగ్గితే, అది ప్రతిపక్షాల బలం పెరగడం వల్లకాక, కాంగ్రెసు వాదులే తమ వేలితో తమ కన్ను పొడుచుకోవడం వల్లనే జరుగుతుందనడంలో అనుమానం లేదు.

కేంద్ర నాయకత్వం

కాంగ్రెసు పరిస్థితి కొన్నిటిలో మినహా—అన్ని రాష్ట్రాలలోనూ ఇలాగే వుంది. ఆ మాటకొస్తే ఆంధ్ర ప్రదేశ్‌లోనే కొంత నయం. కేరళ, ఒరిస్సా, బెంగాల్, యు. పి., పంజాబ్, రాజస్థాన్‌లలో కాంగ్రెసు దారుణమైన అంతర్విభేదాలతో బలహీన పడిపోతున్నది. ఎన్నికలు వస్తున్నకొద్దీ ముఠాల తగవులు ఎక్కువై పోతున్నాయేగాని తగ్గడం లేదు.

ఏ విభేదాలున్నా ఇంతవరకు రాష్ట్రాలలోనే వుండేవి. కేంద్రం వరకు అవి పాకేవికావు. నెహ్రూ ఉన్నన్నినాళ్ళు అంతే. శాస్త్రిగారి హయాంలో కూడా అంతే కాని పార్టీ నాయకత్వానికి శ్రీమతి ఇందిరాగాంధి ఎన్నికైనప్పటినుంచి విభేదాలు వివాదాలు కేంద్రాన్ని కూడా ముసరడం మొదలెట్టాయి. ఇందుకు శ్రీమతి గాంధి కారకురాలని కాదు. ఆమె అతి, మిత, మధ్యవాద వర్గాలన్నిటికి దూరంగానే వుంటున్నది. రకరకాల వాద భేదాల మధ్య తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొనడానికి, దేశానికి ఏది ప్రయోజనకరమో దాన్ని ధైర్యంగా, ఎవరేమనుకున్నా సరే, అనుసరించడానికి ఆమె ప్రయత్నిస్తున్నది. బహుశా ఆమె ప్రదర్శిస్తున్న ఈ స్వాతంత్ర్య వ్యక్తిత్వమే చాల మందికి గిట్టనిది. మొత్తంపై ఆమె నాయకత్వం కాంగ్రెసులో అతివాదులకు గాని, మితవాదులకు గాని ఎవరికి సరిపడడం లేదు. రెండు వేపుల నుంచి ఆమెకు సవాలు వస్తున్నది.

సిద్ధాంతాలు, విధానాల ముసుగులో ఈ ముఠావిభేదాలు బయటపడుతున్నాయి, ఉదాహరణకు ఈ మధ్య ఎరువుల ఉత్పత్తి రంగానికి, ఇండో-అమెరికన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషనుకు సంబంధించిన ప్రభుత్వ విధానాలపై వచ్చిన విమర్శలనే చూడవచ్చు.

ఈ విమర్శలు ఇటు మితవాదుల



గాంధీజీకి ముందు భారత స్వాతంత్ర్యోద్యమపు అతిరథ మహారథులలో ఒకరైన గోపాలకృష్ణగోఖలే శతజయంతి మే 9వ తేదీన జరిగింది.

నుంచి అటు అతివాదులనుంచి కూడా రావడం గమనించదగింది.

ఎరువుల విధానం

దేశాన్ని పట్టి పీడిస్తున్న ఆహార సమస్యా పరిష్కారానికి ప్రభుత్వం ఒక కొత్త అధికోత్పత్తి వ్యూహాన్ని రూపొందించింది. ప్రస్తుతం నీటి పారుదల పుష్కలంగా వున్న సాగు భూమిలోనే రాలుబడిని గరిష్ఠ స్థాయికి తీసుకుపోవడం ఈ వ్యూహం ఆశయం. ఆహారరంగంలో స్వయం సమృద్ధిని సాధించిన దేశాలన్నీ ఈ పద్ధతిని అనుసరించే అభివృద్ధి చెందాయి. రాలుబడి ఎక్కువ కావడానికి రసాయనికపు ఎరువులు విరివిగా వాడాలి. దేశంలో ఉత్పత్తి చేస్తున్న ఎరువులుగాని, దిగుమతి చేసుకుంటున్నవిగాని మనకు చాలడంలేదు. కొత్తగా ఎరువుల కర్మాగారాలను విదేశ సహాయంతో నెలకొల్పుకుంటేగాని ఈ సమస్య తీరదు.

ఈ ఉద్దేశతోనే దేశంలో ఎరువుల ఫ్యాక్టరీలు స్థాపించడానికి ముందుకువచ్చే విదేశాల ప్రయివేటు కంపెనీలకు ఆకర్షణీయంగా కొన్ని సదుపాయాలు కలిగించడానికి ఇండియా ప్రభుత్వం నిశ్చయించింది. కొత్తగా కొన్నేళ్ళవరకు ఎరువుల ధరలపై కంట్రోలును తొలగించడం వీటిలో ఒకటి ఇంతకంటె ముఖ్యమైనది విదేశీ కంపెనీలకు మెజారిటీ వాటా ఇవ్వడం, ఫ్యాక్టరీల యాజమాన్యాన్ని వాటికి కొన్నేళ్ళవరకు అప్పగించడం విదేశీ ప్రయివేటు పెట్టుబడిని మన ఎరువుల ఉత్పత్తి రంగానికి ఆకర్షించడానికి ఇంతకంటే మనం చేయగలిగిందేమీ లేదు. అయితే ఇదే అందరి విమర్శలకు బాగా గురి అయింది.

దేశాన్ని అమెరికన్ కంపెనీలకు అమ్మివేస్తున్నారని గోల ప్రారంభమైంది. ఇది మన పారిశ్రామిక విధానానికి విరుద్ధమైనదని, ప్రధానమైన పరిశ్రమలన్నీ ప్రభుత్వరంగంలోనే వుండాలన్న మన సోషలిస్టు పద్ధతికి ఇది గొడ్డలిపెట్టు అని విమర్శ బయలుదేరింది.

— సువర్ణ.

దేశం అనతికాలంలో అపార సమృద్ధిని సాధించడానికి ఎరువులు అవసరమైనప్పుడు వాటిని ఏదో విధంగా సంపాదించుకునే మార్గం చూడాలిగాని, తిండి సమస్యకు, సిద్ధాంతాలకు ముడి పెట్టడం మంచిదా ? సోషలిజం తిండి పెట్టేదిగా వుండాలిగా, సిద్ధాంతాలతో కడుపు నిండుతుందా ? అసలా వుంచి విదేశీ పెట్టుబడిదారులకు కొన్ని కొన్ని అవసరమైన సందర్భాలలో మెజారిటీ వాటాలివ్వడమనేది నెహ్రూ కాలం నుంచి వున్నదేగాని కొత్త విధానం కాదు ఎరువుల రంగంలో అనుసరించదలచిన ఈ పద్ధతి మిగతా పరిశ్రమలకు వర్తించబోదు. మదను ఎరువు కర్మాగారాన్ని ఉదాహరణగా తీసుకుంటే, ఇటీవల జరిగిన ఒడంబడిక గడువు పదేళ్ళు పూర్తి అయ్యే లోపల మనం విదేశీ వాటాలను కొని వేయగలితే దాని యాజమాన్యం మనకే సంక్రమిస్తుంది ఇదే విధంగా ఎక్కడికక్కడ మనకు వివో రక్షణలు, హామీలు మిగుల్చుకుంటూనే, విదేశీ కంపెనీలకు కొన్ని సదుపాయాలిచ్చి ఎరువుల పరిశ్రమను విస్తరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఈ ప్రయత్నాన్ని వమ్ము చేసి దానికి అదేదో ఘోరమైన ప్రమాదంగా దేశాన్ని అమ్మివేయడంగా కొన్ని ప్రతిపక్షాలేమి కాంగ్రెసులో కొన్ని వర్గాలేమి చిత్రించడం అర్థంలేని పని.

ఫౌండేషన్ సమస్య

ప్రధాని ఇందిరాగాంధి నాయకత్వంపై ప్రయోగింపబడుతున్న మరొక అస్త్రం ఇండో - అమెరికన్ ఫౌండేషన్ ప్రతిపాదన ఇండియాలో తనకు మిగిలిపోయిన పి. ఎల్ 480 ద్రవ్య నిధులను ఇండియాలోనే సద్వినియోగం చేయడానికి గాను ప్రెసిడెంట్ జాన్సన్ ఈ ఫౌండేషన్ను ప్రతిపాదించారు. ఈ ఫౌండేషన్ ఇండియా, అమెరికాల సమష్టి అధ్వర్యంలో వుంటుంది. ఇండియాలో సాధారణ విద్యలు, సైన్సు, సాంకేతిక విద్యలను ఆధునిక పద్ధతులలో అభివృద్ధి చేయడానికి అమెరికా ఈ ఫౌండేషన్ ద్వారా ధనసహాయం చేస్తుంది. దీనితో భారతీయులతో, అమెరికన్ ప్రొఫెసర్లు కూడా మన విద్యారంగంలో ప్రవేశిస్తారన్నమాట నిజమేగాని, వారంతా అమెరికా గూఢచారులుగా పని చేస్తారని, ఇండియాలో విద్యావిధానమంతా అమెరికా చెప్పు చేతలలో వుండి పోతుందని, మన విద్యార్థులు అమెరికాకు మానసదాసులై పోతారని విమర్శించడం మరీ అతిగా, నిర్హేతుకంగా కనిపిస్తుంది. విద్యపై మనం ఏట ఖర్చు చేస్తున్న ధనంలో చాలా స్వల్పమైన వంతు మాత్రమే ఈ ఫౌండేషన్ ద్వారా జరుగుతుంది. దాని విద్యావిధానం మన చట్టాలకు, రాజ్యాంగానికి, అదుపుకు లోబడే వుంటుంది, కాగా

దీన్ని ప్రస్తుతపు ప్రభుత్వ నాయకత్వాన్ని ఏదో విధంగా ఇరకున పెట్టడానికే విమర్శకులు వినియోగించుకుంటున్నారు.

అణ్వస్త్ర విధానం

చైనా మూడవ అణ్వస్త్రాన్ని పరీక్షించింది ఇది హైడ్రోజన్ బాంబు కావచ్చునని వార్తలు తెలుపుతున్నాయి. ఇదే నిజమైతే, చైనా పాశ్చాత్య దేశాలూహిస్తున్న దానికంటె త్వరలోనే పెద్ద అణ్వస్త్ర రాజ్యంగా, ఆసియా దేశాలకు ఒక పెద్ద బెడదగా తయారు కావడంలో సందేహం లేదు.


చైనాకు పోటీగా ఇండియా కూడా అణ్వస్త్రాలు తయారు చేయాలన్న వాదం అంతకంతకు బలపడుతున్నది. ప్రతిపక్షాలలో కమ్యూనిస్టులు, కాంగ్రెసులో అతివాదులు మినహా మిగతా వారంతా అణ్వస్త్రాలు తయారు చేయాలని, లేకపోతే చైనా నుంచి ఏనాటికైనా మనకు ముప్పు తప్పదని వాదిస్తున్నారు ప్రభుత్వం మాత్రం అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే తప్ప అస్త్రాల నిమిత్తం వినియోగించబోనని చెబుతున్నది మనం అణ్వస్త్రాలు తయారు చేస్తే ప్రపంచంలో ఇక ఎన్నటికీ అణ్వస్త్ర నిషేధం, నిరాయుధీకరణ సాధ్యం కాదని ఇప్పటి వరకు ఆగిన మరకొన్ని దేశాలు కూడా అణ్వస్త్ర రంగంలో పోటీకి దిగుతాయని ప్రభుత్వం వాదన. అంతేకాదు మరొక ముఖ్యమైన వాదన : మన ఆర్థిక వ్యవస్థ అణ్వస్త్రాల తయారీకి అనుకూలంగా లేదు. ఒక్క యాటం బాంబును తయారు చేయడానికి యాభై అరవై లక్షల రూపాయలకు పైనే అవుతుంది. ఒకటి, రెండూ తయారుచేస్తే చాలదు. పెద్దఎత్తున ఉత్పత్తి చెయ్యాలి. ఆ తర్వాత వాటిని ప్రయోగించడానికి "లాంగ్ రేంజ్" రాకెట్లు తయారుచెయ్యాలి లేదా దానికి వీలైన బాంబర్ విమానాలను తయారు చేయాలి ఇదంతా అమితమైన ఖర్చుతో కూడినపని. అణ్వస్త్రాలను తయారు చేయగల సాంకేతిక ప్రజ్ఞ మనకున్నా వాటిపై ఇంత భారీ ఖర్చు చేస్తే మన ఇతర ఆర్థికాభివృద్ధి కృషి అంతా దెబ్బతిని పోతుంది ఒక వంక మన ధనమంతా యాటంబాంబులకోసం ఖర్చు పెడుతూ, మరో వంక ఆహారంకోసం, ఇతర పారిశ్రామిక, నిత్యావసర వస్తువుల కోసం దేహి అని ఇతరులను యాచించడం చాలా అసందర్భంగా కనబడక మానదు. మనం "యాటమిక్ క్లబ్బు"లోకి చేరడానికి నిశ్చయిస్తే ఇప్పుడు మనకు లభిస్తున్న విదేశీ సహాయం కూడా దక్కదు. చైనాను చూసి మనం ఈ సాహసానికి ఉద్యమిస్తే దేశం అన్నివిధాలా భ్రష్టుపట్టి పోతుంది. ఇదీ ప్రభుత్వవాదం.

ఈ వాదన కాదనడానికి వీలు



ఈ నెల మొదటి బహుమతి పొందిన

ఆర్. పి. వర్ధని



రెండవ బహుమతి పొందిన

యం. సాయోజిరావు

లేదు. అయితే ఈ విధాన్ని భారత ప్రభుత్వం ఎన్నాళ్ళు కొనసాగించ గలదు? ఈ బికం ఎన్నాళ్ళు సడలకుండా వుండగలదు?

స్వర్గీయ ప్రధాని శాస్త్రి కూడా మన అణుశక్తి విధానం ఎల్లకాలానికి మారబోదని హామీ ఇవ్వలేనన్నారు. మొన్న పార్లమెంటులో ప్రధాని ఇందిరాగాంధి మన విధానం మన రక్షణావసరాలను బట్టి వుంటుందన్నారు. చైనా సంగతి సరే యుద్ధంలో ప్రయోగానికి కాకపోయినా, తమకుకూడా అణ్వస్త్రం తయారు చెయ్యడం చేతనౌనని చూపించుకోవడం కోసం ఇండోనీసియా యాటంబాంబును పేలుస్తుందనుకోండి అరబ్ రిపబ్లిక్ కూడా తయారు చెయ్యవచ్చు ఇజ్రాయెల్ ఒకటున్నది పోతే పాకిస్తాన్‌లో కూడా ఈ విషయమై గుసగుసలు వినిపిస్తున్నాయి. [illegible] మిగతా దేశాలు తమకు స్తోమత వున్నా లేకపోయినా అణ్వస్త్ర రంగంలోకి దిగుతాయనుకోండి అప్పటికీ మనం మన విధానాన్నే పట్టుకుని వ్రేళ్ళాడ్డానికి వీలవుతుందా? మనం ఒక్కర యాటంబాంబుని తయారు చేయనంత మాత్రాన ప్రపంచ శాంతి సురక్షితంగా వుంటుందా? మన పరిస్థితి బలహీనమైపోదా? మనకంటె చిన్న దేశాలు మనకంటె బలమైన రాజకీయ పరిస్థితిలో వుండవా?

అందుచేత ప్రపంచమంతా ఒక దారిని పోతున్న సూచనలు కనబడుతున్నప్పుడు, మనం మాత్రం ఎంతకాలం ఉన్నచోటే వుండిపోగలం? ఎంతకాలం ఒత్తిడిని నిగ్రహించగలం? అదేదో ముందుగానే గ్రహించి జాగ్రత్త పడడం మంచిది.

☐☐☐

స్వయంవరం

సుబ్బారావు ఇంట్లో అడుగు పెట్టాడప్పుడే. వంటింట్లో సామాన్లు సర్దుతున్న కాంతమ్మ సుబ్బారావును చూసి, గబ గబా వచ్చి –

'ఏమండీ! వెళ్ళినపని ఏమయింది? కాయా? పండా?' అని ఆత్రుతగా అడిగింది కాంతమ్మ.

సుబ్బారావు చిరాగ్గా 'నే చెబితే విన్నావా? వాళ్ళకి సంబంధం అక్కర్లేదట' అన్నాడు. కాసేపాగి సుబ్బారావే అన్నాడు 'మా చెల్లెలు కొడుకు రామానికి, మన కాంతను చేసుకోమంటాను. ఏమంటావ్? ఆస్తి లేక పోతేనేం? నిక్షేపంలాంటి సంబంధం. కుర్రాడు బి. యే. చదువుతున్నాడు. అందగాడు' నీ అభిప్రాయం ఏమిటన్నట్లు కాంతంవైపు సాలోచనగా చూశాడు సుబ్బారావు.

సుబ్బారావు మాటలు విన్న కాంతమ్మ మూతి మూడు వంకర్లు తిప్పి 'మీ చెల్లెలూ సరే, మీరూ సరే. చదివాట్టు అబ్బాయి సతుకు. మా అన్నయ్య కొడుకు వెంకట్రావుకిస్తే పోలా? వాడు చదువుకోక పోతేనేం? బోలెడంత ఆస్తి. కాలు మీద కాలేసుకుని తిన్నా తరగదు. ఒక్కడే కొడుకాయె? కాపోతే కాస్త కట్నం ఎక్కువ అడుగుతారు. మనకి మాత్రం కాంత ఒక్కతేగా? వాళ్ళడిగిన దబ్బిస్తే సరి' అని ఓ లెక్చరు దంచింది.

సుబ్బారావు 'ఏమైనా సరే మీ అన్నయ్యకొడుక్కి కాంతనివ్వను.' నొక్కి చెప్పాడు. 'ఎందుకివ్వరో, ఎట్లాయివ్వరో చూస్తా!' సవాల్ చేసింది కాంతమ్మ. వాళ్ళకిట్లా భేదాభిప్రాయం రావటం ఇవ్వాళ కొత్తేమీ కాదు. కాంత పెద్దదైననప్పటినుంచీ కాంతమ్మ వాళ్ళన్నయ్య కొడుక్కివ్వాలని, సుబ్బారావు వాళ్ళ చెల్లెలు కొడుక్కివ్వాలని పట్టుదలలు పోతున్నారు.

ఇది జరిగిన తరువాత కాంతమ్మ ఏదో ఒకటి తెల్చుకోవాలని నిశ్చయించుకొంది. పక్కంటి వాళ్ళబ్బాయి రాముచేత వాళ్ళన్నయ్యకు ఓ పుత్తరం వ్రాయించింది– వెంకట్రావును చూడాలని వున్నది. కనుక ఇక్కడికి పంపిస్తే కొద్ది రోజులుండి వెళతాడు – అని. అసలు కాంతమ్మ ఎత్తువేరు. వెంకట్రావునిక్కడికి రప్పించి, కాంత వెంకట్రావు ఒకరి నొకరు ప్రేమించుకునేట్టు చేస్తే సుబ్బారావింకేంచేయగలడు? తనమాట నెగ్గితీరుతుంది.

సుబ్బారావు మాత్రం తక్కువ తిన్నాడా? భార్యకి తెలీకుండా, రామాన్ని సెలవుల కొకసారి రమ్మని కార్డు వ్రాశాడు.

మొదటి బహుమతి రూ. 50

ఆర్. పి. వర్ధని
(బి. ఏ. రెండవ సంవత్సరం, గవర్నమెంట్ కాలేజీ ఫర్ విమెన్, గుంటూరు)

అనుకున్న ప్రకారం రామం, వెంకట్రావు లోపటి రెండు రోజుల తేడాలో సుబ్బారా వింటికి వచ్చారు. కాంతమ్మ కాంతను వెంకట్రావు దగ్గరికి కాఫీ టిఫిన్ యిచ్చి రమ్మని పంపించేది. ఇంతలో సుబ్బారావు కూతుర్ని పిలిచి బాకి నీళ్ళు తోడమని, తుడుచుకోవటానికి టవల్ ఇవ్వమని పురమాయించేవాడు. కాంతపని ఇర కాటంగా వుండేది. ఎవరికివ్వాలో, ఎవరి కివ్వకూడదో నిశ్చయించుకో లేక "నా కిద్దరు బావ లుండటం ఎంత ప్రమాదం వచ్చింది. నన్ను గండం నుంచి తప్పించమని భగ వంతుణ్ణి రోజూ ప్రార్థించేది రామాని కేదన్నా అందిస్తే కాంత మ్మకు కోపం, వెంకట్రావు కేదన్నా అందిస్తే సుబ్బారావుకు కోపం. అమ్మా నాన్నల మధ్య నలిగి పోయిందా అమ్మాయి.

ఏదేమైనా రామం, వెంకట్రావుల పని హాయిగా వుంది. అంతేగాక వాళ్ళిద్దరూ అతి సన్నిహితులుగా తయారయ్యారు.

వారం రోజుల్లో విసిగెత్తిన రామం, వెంకట్రావులు ఒకేసారి వెళ్ళిపోవడానికి నిశ్చయించు కొన్నారు. కాంతమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకొని కాంత నెట్లాగైనా చేసు కోమని, వెళ్ళగానే ఏ సంగతి వ్రాయవలసిందిగా మరీ మరీ చెప్పింది.

సుబ్బారావు తిప్పలుపడి దబ్బే ట్లాగో ఒక చోట అప్పు తీసుకొని బట్టలు పెట్టాడిద్దరికి. రామానికి పెట్టి వెంకట్రావుకు పెట్టకపోతే బావుండదు కనుక విధిలేక పెట్టాడన్న మాట. సుబ్బారావు రామం రేపు వెడతా డనగా బజారంతా తిప్పి కాంతను పెళ్ళిచేసుకోమని, అందువలన తమ బాంధవ్యం గట్టిపడటమే కాక తన్ను గట్టెక్కించిన వాడవుతాడు గనుక కాంతనే నిశ్చయించుకోమని హిత బోధ చేసి పంపించాడు.

భార్యా భర్తలిద్దరూ ఉత్తరాల కోసం ఎదురు చూడసాగారు. వారం రోజులయినా ఎవరి దగ్గర నుంచి వుత్తరం రాలేదు. ఆరోజు సుబ్బా రావు వంట్లో బాగుండక ఆఫీసుకి సెలవు పెట్టాడు. ఇంతలో 'పోస్టు మాన్ వచ్చి రెండు కవర్లిచ్చి పోయాడు ఇంట్లో వున్న కాంతమ్మ కూడా భర్తదగ్గరకొచ్చింది ఆత్రంగా. ఒక కవరు చింపి సుబ్బారావు సంతో షంగా కాంతమ్మవైపుచూశాడు. అది వెంకట్రావు పెళ్ళిశుభలేఖ. ఎవరో పెద్ద వ్యాపారస్థుడి కూతురితో నిశ్చ యించారు. కనక పెళ్ళికిపదిరోజులు ముందుగా రమ్మని ఒక వుత్తరం. రెండోకవరు చింపాడు సుబ్బారావు "చి॥ రామంని, చి॥సౌ॥ సరోజకిచ్చి చేయ నిశ్చయించారు గాన,....." తెల్లబోవటం సుబ్బారావంతు అయిందీ మాటు.

□□□

పక్క సెక్షన్‌లో గలభాగా ఉంది. ఇంకా ఆఫీసరు రాలేదు హెడ్ క్లర్కు కూడా—చిన్నవాడే కాబట్టి మిగతా గుమాస్తాలతో చనువుగా ఉంటాడు—వాళ్ళతో చేరినట్లున్నాడు. కాసేపుంటే సద్దుమణిగి పోతుందిలే అనుకున్నాను కాని ఓ పది నిమిషాలయింతర్వాత కూడా ఇంకా అలాగే ఉంది. ఇక ఉండబట్టలేక వెళ్ళాను.

మూర్తి, శర్మా, అంజనేయులూ, సుబ్రహ్మణ్యం, వెంకటస్వామీ కలిసి హెడ్‌క్లర్కు సత్యనారాయణచుట్టూ చేరారు. వాళ్ళ మధ్య చేరి ఓ నిమిషం సొద ఆలకిస్తే సంగతి తెలిసింది. కొత్తగా పెళ్ళయిన శేఖర్ భార్య గురించి ఈ గోలంతా. అసలు ఎట్లా మొదలయిందంటే ఎవరూ చెప్పలేదు. ఆఫీసులో పనిచేసే ఓ తోటి స్నేహితుడి భార్య పేరు గురించి ఇంత గొడవెందుకంటారేమో. వాళ్ళు ఆవిడ పేరు గురించి పందాలు కూడా వేసుకుంటున్నారు.

శర్మ అన్నాడు: 'శేఖర్ భార్య పేరు పార్వతి.'

'కాదు. గిరిజ' - అంజనేయులు ఉవాచ.

'కాదు భవాని' మూర్తి అనటం.

'కాదు. అదేమిటో తమాషా అయిన పేరు ... అ .. అపర్ణ' అన్నాడు సుబ్రహ్మణ్యం.

శివా భవానీ రుద్రాణీ....

'అదీకాదు. కనకదుర్గ అని నాకు చెప్పాడు'—వెంకటస్వామి మరి నాకేమో లలిత అని చెప్పినట్టు జ్ఞాపకం. నేనామాట పైకనలేదు.

'శేఖరం భార్యపేరు భవాని. ఎంతెంత పందెం?' అన్నాడు మూర్తి.

'భవాని కాదు—పార్వతి. అయిదు రూపాయలు పందెం' అన్నాడుశర్మ.

'ఏమిటోయ్! అంత ధీమా'

'కాదురా. నేనో రోజు వాళ్ళింటికి వెళ్ళితే అన్నయ్యగారూ అంటూ మర్యాద చేసింది. చాలా సేపు వాళ్ళింట్లో కూర్చున్నాను. ఓ యాభైసార్లన్నా ఆవిడ పేరు శేఖరం నోటవిని ఉంటాను' అన్నాడు శర్మ.

'ఓయబ్బ! నేనూ వెళ్ళాను ఓ రోజు. మా చెల్లెలు తీసుకెళ్ళమంటే. మా చెలెలు పేరూ, ఆవిడ పేరూ గిరిజే ఇద్దరూ క్లాసుమేట్లుట. వాళ్ళ కాలేజీ సంగతులు కొన్ని

రెండవ బహుమతి రూ. 25

పి. ఎస్. రామకృష్ణ
(ఎమ్. టెక్, సెకండియర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బొంబాయి)

"చెప్పిం దొవిడ" అన్నాడు అంజనేయులు.

హెడ్‌క్లార్కు సత్యనారాయణ కలగ చేసుకున్నాడు. "బాబూ ఇంత గోల ఎందుకు? అతని పెళ్ళి శుభలేఖ ఇక్కడే డ్రాయర్లో ఉండి ఉండాలి. చూద్దాం. నా మటుకు నాకు ఉమ సుందరి అని చెప్పినట్లు జ్ఞాపకం అంటూ డ్రాయర్లో వెతకసాగాడు. జనం కాస్త సద్దుమణి గారు శుభలేఖకోసం ఆత్రుతగా చూస్తున్నారు.

"ఆ! ఇదిగో కవరు" అంటూ సత్యనారాయణ కవరులోంచి శుభలేఖ తీసి బల్లమీద పెడుతుంటే టేబుల్ చుట్టూ ఉన్న మూకంతా ఒక్కుమ్మడిగా ముందుకు ఒరిగారు. శర్మ చేయి తగిలి ఇంక్ పాట్ బోర్లా పడింది సరిగ్గా శుభలేఖ నిండా ఇంకు పడింది ఒకటి ఇంకులో ఏమీ అక్షరాలు కనపడటంలేదు. వధువు పేరు పూర్తిగా కనపడకుండా పోయింది.

"ఓరి! శర్మ! ఎంత అప్రాచ్యపు పని చేశావురా" అని అందరూ అతన్ని కోప్పడ్డారు

ఉన్నట్టుండి స్వామికి ఒక బ్రెయిన్ వేవ్ వచ్చింది. మేడమీద సెక్షను కెళ్ళి శేఖర్ ఉంటే పిల్చుకు రాకూడదా అని.

మూర్తి గబగబా పైకెళ్ళాడు, ఇప్పుడే లాక్కొస్తానంటూ.

అంజనేయులుకి అనుమానం వచ్చింది. వీడు అక్కడికెళ్ళి గూడు పుఠాణీ చెయ్యడు కదా అని.

ఇంతలో ఆఫీసరు వొస్తున్నట్టు ప్యూను అభినయించాడు. ఎక్కడి వాళ్ళక్కడ సద్దుకున్నారు. ఎవళ్ళ సీట్లలో వాళ్ళు కూర్చున్నారే కాని మనసంతా పైకి వెళ్ళిన మూర్తిమీదే వుంది

అయిదు నిమిషాలలో మూర్తి తిరిగి వొచ్చాడు. ఆఫీసరు వొచ్చినట్టు గ్రహించి తన సీట్లో వెళ్ళి కూర్చున్నాడు. ఒక చిన్న కాగితం మీద ఏదో రాసి, ప్యూను కిచ్చి, అందరికీ సర్క్యులేట్ చెయ్యమని చెప్పాడు.

బోడి సస్పెన్సు! దగ్గర కొచ్చి చెప్పకూడదూ అనుకున్నారందరూ.


ఆ కాగితం ముందు సత్యనారాయణ దగ్గరకెళ్ళి, తర్వాత శర్మ, మూర్తి చూసింతర్వాత, సుబ్రహ్మణ్యం దగ్గరికివొచ్చి అటు తర్వాత వెంకటస్వామీ, అంజనేయులూ అయింతర్వాత నా దగ్గరి కొచ్చింది. అంతసేపూ వాళ్ళందరి ముఖ కవళికలూ కనిపెడుతున్నాను నేను. చూసిన వాళ్ళంతా పెదవి విరుస్తున్నారే కాని తనదే రైటయిందన్న భావం ఒక్కడి మొహంలోనూ కనబడలేదు. మరి అందరిదీ తప్పయితే నాదే గా రైటు! ధీమాగా కాగితం తీసుకుని చూశాను. శేఖర్ రెండు రోజులు సెలవు పెట్టాడట. ఆదివారం కలిసి వొచ్చేటట్టు సోమవారంగాని రాడుట. సమస్యా పరిష్కారం సోమవారానికి వాయిదా పడింది.

సోమవారంనాడు అందరూ ఆఫీసు టైముకు కాస్తముందే వచ్చి కూర్చున్నారు. శేఖర్ మటుకు రాలేదు. మూర్తి మళ్ళా పై సెక్షనుకు వెళ్ళి కనుక్కొచ్చాడు-ఇంకో రోజు సెలవు పొడిగించాడేమోనని, కాదుట. కొద్దిగా ఆలస్యంగా వొస్తానని ఫోను చేసి పర్మిషన్ తీసుకున్నాడుట. అందరి మనస్సులూ కుదుట బడ్డాయి.

మెల్లిగా ఓ గంట ఆలస్యంగా శేఖర్ రానే వచ్చాడు. సత్యనారాయణ పిలిచి చెప్పాడు అంతా. 'అందువల్ల అడుగుతున్నాను. నీ భార్య పేరు ఏమిటి' అని. శేఖర్ నవ్వుతూ అన్నాడు. 'అబ్బో! చాలా పెదకథ ఉంది. మధ్యాహ్నం లంచ్ టైములో చెప్తాను. ఏమనుకోకండి' అని. అలా అన్నాడని సత్యనారాయణ సర్క్యులేట్ చేసిన చీటి ద్వారా మాకు తెలిసింది. మళ్ళా సస్పెన్స్. సరే మధ్యాహ్నం లంచ్ టైములో అందరమూ కాంటీన్లో చేరాము వెళుతుండగా నేను నెమ్మదిగా అడిగాను. 'ఏరా! లలితేనా?' అని. నువ్వు మూడొంతులు కరెక్టు అన్నాడు. ఏమిటో నా కర్థం కాలేదు.

అందరూ కూర్చున్న తర్వాత ఇలా అన్నాడు 'ఇప్పుడు ఇక్కడ ఉన్న ఏడుగురూ ఏడు పేర్లు చెప్పారు. నిజానికి అవన్నీ రైటే. అసలు మా ఆవిడకు వాళ్ళ తలిదండ్రులు పెట్టిన పేరు గిరిజాసుందరి. కొత్తలో నేనా పేరుతోనే పిలిచేవాణ్ణి ఈ మధ్య లలితా సహస్రనామ స్తోత్రం చదువుతుంటే, పార్వతికి ఎన్నిపేర్లు ఉన్నాయో తెలిసింది. అప్పట్నుంచీ ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క పేరుతో పిలిచేవాణ్ణి. అందుకనే మీ కందరికీ పరిచయం చేసినప్పుడు తలో పేరూ నోటికొచ్చింది. అయితే ఇలా కూడబలుక్కుని నా రహస్యం కనుక్కుంటారనుకోలేదు'.

□□□



"అంతా కులాసాయేనా?"

ఉదయం తొమ్మిది గంటలైంది. రోడ్లన్నీ రద్దీగా వున్నాయి. సుధారాణి చేతిలో పుస్తకం పట్టుకొని నెమ్మదిగా నడుస్తూంది. రోడ్డు వైపుగా ఎడమ ప్రక్కనున్న ఇంటి లోనికెళ్ళి 'అంతా కులాసాయేనా?' అంది.

'ఆ, ఆ' లోపలినుండి జవాబు వినిపించింది. గోడమీద పెన్సిల్‌తో గుండ్రంగా గీచి, తారీకు వేసి సంతకం పెట్టింది మలేరియా డిపార్టుమెంటమ్మాయి సుధారాణి.

వంట ఇంటి తలుపులు చటుక్కున తెరుచుకొన్నాయి. ఇంటావిడ కళ్ళు గోడమీద పడ్డాయి. 'ఆ ఆ, అదేం పని, అయ్. వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి సున్నాలు రంగులు వేయించాను. గోడంతా పాడుచేస్తావా? ఏం పోయేకాలం? దొరక్క దొరక్క మా గోడే దొరికిందా? ఇదివరకు గోడమీద గీచింది నువ్వేనా? కనపడకుండా చక్కాపోయావ్? ఈసారి గోడమీద పొయ్యేశావంటే జాగ్రత్త' అని హెచ్చరిక చేసింది.

'అదికాదండీ...'

'పో అవతలకు. తగుదునమ్మాయని నీబోటి అడకూతురు ఉద్యోగం వెలగబెట్టగానే సరా? వెళ్ళు వెళ్ళు, బుద్ధిగా ఉండు' అని తలుపు ఫెళ్ళున మూసివేసింది. సుధారాణికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

అందరాడ పిల్లల్లాగా ఆమె ఉద్యోగం చేస్తోంది. కాని ఆఫీసుల్లో అమ్మాయిలకున్న గౌరవం మలేరియా డిపార్ట్‌మెంట్ లేడీస్‌కి లేదు. ఎవరేమనుకున్నా పరవాలేదు. తన ఉద్యోగధర్మం, ఇంటింటికెళ్ళాలి. ఏమైనా అంటే విని ఊరుకోవాలి అనుకుంది. తనలో తనే ధైర్యం చెప్పుకుంది.

ఆమె వెనక ఎవరో నలుగురు కొంటె కుర్రాళ్లు నడుస్తున్నారు. అందులో వొకడు 'హల్లో ఎన్నాళ్ళకెన్నాళ్ళకు' అన్నాడు. తన స్నేహితుడిని అడిగినట్టుగా.

'ఈవూరు వచ్చి రెండురోజులైంది. ఏదో బిజీగా ఉండి రాలేకపోయానురా, సారీ'

'అన్నట్టు నీ పేరు మరచిపోయానురా, సుధాకర్ గదూ' అన్నాడు వెక్కిరింపుగా.

'అవును, అంతా సుధా అంటారు'

రెండవ బహుమతి రూ. 25

యం. సాయోజీరావు
సెకండ్ బి. యస్ సి. ఆంధ్రా లయోలా కాలేజీ, విజయవాడ.

'సుధా! మనది ఏ డిపార్టుమెంటు ?'

'కెమిస్ట్రియా.'

సుధారాణి ఈ మాటలన్నీ విని కోపంగా చూసింది ఆ కొంటె కుర్రాడి వైపు.

'సారీ. వస్తానురా బై బై' అని చేతులు త్రిప్పుకొంటూ వెళ్ళిపోయాడు.

● ● ●

'బాబాయి! పిన్నమ్ముందా' లోపల అడుగుపెడుతూ అడిగింది సుధారాణి –

'ఎవరు ? ఓహో నువ్వా, రామ్మా, రా, సుధమ్మా. ఒసేయ్ నిన్నే మీ అమ్మాయి వచ్చింది. రావేరా' అన్నారు అవధానిగారు.

'వచ్చే. వచ్చు కాలింపు అయిపో. వచ్చింది. ఒక్క పావుగంట చాలు, అమ్మాయిని కూర్చోబెట్టండి' అని లోపలనుండి జవాబు స్పష్టంగా వినిపించింది.

'అంతా కులాసాయేనా ? బాబాయ్.'

'దేవుని దయవల్ల చల్లగా ఉన్నాం తల్లీ' అన్నారు యథాప్రకారంగా గోడమీద గీచి సంతకం పెట్టింది. 'పిన్నమ్మా, లోపల ఏం కూరలు చేస్తున్నా'వని ఆమె లోపలకు పోబోయింది. ఇంతలో అవధానులుగారు 'అమ్మాయి సుధా; లోపలకు పోబోకు. మీ పిన్నమ్మ మడితో ఉంది' అన్నారు.

మనసు చివుక్కుమంది. ఇంకా ఎక్కువసేపున్నా గౌరవంగా వుండదని మనసులో తలచి 'వస్తాను



బాబాయ్ పిన్నమ్మతో చెప్పు' అని గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయింది.

'ఏమండీ! అమ్మాయ్ ఏది?'

'లేదు వెళ్ళిపోయింది. ఆఫీస్ పనిమీదొచ్చింది. ఆగమంటే ఆగలేదు.'

• • •

మధ్యాహ్నం సుధారాణి నవల చదువుతున్నది. ప్రక్కింటి అనసూయమ్మగారు ఏదో మాట్లాడుతోంది తల్లితో. సుధారాణి చెవి ఒగ్గి మాటలు వింటోంది.

'ఒదినా అమ్మాయికి సంబంధం కుదిరిందా?'

'లేదు.'

'ఈడొచ్చిన పిల్లకు మంచి సంబంధం చూసి ముడిపెడ్తే బాగుంటుంది. ఎందుకొచ్చిన ఉద్యోగాలు, ఏం సుఖం? పాపం. సుధమ్మను చూస్తే జాలేస్తుంది. ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం' అంది ఆవిడ.

'అమ్మాయికప్పుడే పెళ్ళి చేయ'మని ఖచ్చితంగా అమ్మ గొంతు వినిపించింది.

'ఏమనుకోకండి ఒదినగారూ! సుధమ్మ మన పిల్లేగాయని అన్నాను' అంటూ ఆవిడ వెళ్ళిపోయింది.

ఇంతలో సుధ లేచి 'అమ్మా! ఏమిటి అత్తయ్యంటుంది?'

'ఏం లేదు.'

'అంతా విన్నానులే. నన్నెందుకంతా విమర్శిస్తారు. మొన్న సినిమాకు వెళ్ళితే అక్కడ కూడా అంతా మలేరియా డిపార్టుమెంటని వెక్కిరించారు. రోడ్డుమీద ఇహ చెప్పక్కర్లేదు. మొన్న పిన్నమ్మింటికి వెళ్ళితే బాబాయి నన్ను లోనికి వెళ్ళనివ్వలేదు. ఏమయినా సరే నేనుద్యోగం చేయలేను. ఉద్యోగానికి రాజీనామా చేస్తా'నంది రోషంగా.

అటుగా వస్తున్న అన్నయ్య ఆమాటలు విని, 'చెల్లెమ్మా! నీయిష్టం లేని పని ఎప్పుడూ చేయద్దు' అన్నాడు. అన్నయ్య మాటలు ఆమెకెంతో ధైర్యాన్నిచ్చాయి.

అది వర్షాకాలం జూన్ నెల. ఉద్యోగానికి రాజీనామా యిచ్చి కాలేజీలో చేరింది సుధారాణి. ఇంటింటికి తిరిగి అందరారోగ్యం విచారించటం కంటె కాలేజీలో చదవటం సంతోషంగా ఉంది. అలా వారం రోజులు గడచినవి. కాలేజీ తెరచి. సుధారాణి కాలేజీనుంచి ఇంటికి బయలుదేరింది. హాల్లో 'అంతా కులాసాయేనా?' అన్న మాటలు వినిపించినాయి. సుధారాణి వెనుతిరిగి చూచింది. నలుగురు కుర్రాళ్ళు పకపకానవ్వుతున్నారు.

తను ఉద్యోగం మానివేసినా 'అంతా కులాసాయేనా' అన్న మాటలు మాత్రం పోలేదు.

□□□

పాతసమస్యల కొత్త పరిష్కారాలు

"ఏమండోయ్. ఇంకా యీ వేషం లోనే వున్నారేం? తొందరగా తయారవండి" అని గావుకేక పెట్టి చిందులు తొక్కడం ప్రారంభించాడు శ్రీకంఠయ్య.

బనియను కూడా తీసేసి, పంచె బొడ్డు కిందకి జార్చి బొజ్జకి గాలి తగిలినూ హాయి ననుభవించాలని ప్రయత్నిస్తున్న సమయంలో, సంగీతంలో అపస్వరంలా, ప్రత్యక్షమయాడు శ్రీకంఠయ్య.

"ఎక్కడికండీ."

"రామాయణమంతా విని రాముడికి సీతఏమవుతుందని అడిగినట్లుంది. ఎక్కడికంటా రేమిటి? పదండి ముందు" శ్రీకంఠయ్యతో వొచ్చిన తగాదాయే ఇది. కచ్చల్లో కందులు వేసేస్తాడు అసలు సంగతి తేల్చకుండా. కాఫీ తాగడానికి కూడా సావకాశం లేదన్నాడు. ఒక్క సెకండన్నా అటూ ఇటూ కాకుండా సరిగ్గా ఆరు గంటలకే ఆరోగ్య మంత్రిగారు సెమినారు ప్రారంభం చేస్తున్నారుట. అంతకి అయిదు నిమిషాలు ముందుగానే అందరూ కుర్చీల్లో కూర్చోవాలిట. దేశ విదేశాలనించి మహామహు లందరు పాల్గొనబోతున్న ఆ సెమినార్‌కి హాజరవకుండా వుండకూడదుట.


కారణం, గమ్యస్థానం పూర్తిగా తెలుసుకోకుండానే బయలుదేరాను. నిజానికి శ్రీకంఠయ్యకి కూడా గమ్యస్థానమే తెలుసు కాని, సెమినారెందుకో తెలియదని దారిలో తేలిపోయింది. వగర్చుకుంటూ హాలుకి చేరుకున్నాము. హాలు అలంకరణ బ్రహ్మాండంగా వుంది. జెండాలు, తోరణాలే కాకుండా గోడలనిండా తగిలించిన గ్రాఫులూ, నినాదాలూ కూడా హాలుని రంగులమయం చేశాయి. వేదిక మీద, నాయకుల కుర్చీల వెనక తెల్లటి తెర, దానిమీద కొట్టొచ్చినట్టు నల్లటి చిత్రం. మనకి చిరపరిచితమయిన జంతువు, ఎలక! ఈ సెమినారు ఎలకల సంహారానికి సమగ్ర పథకం ఆలోచించి, కార్యక్రమం నిర్ణయించేటందుకు

సోమంచి యజ్ఞన్న శాస్త్రి

ఏర్పాటయిందిట. భారత దేశానికి ఎలకల వల్ల కలుగుతున్న ముప్పు వివరించి, భారతీయులందరినీ అప మత్తులుగా చేసి, ఎలకల సంహారానికి నడుంకట్టించే నిమిత్త దేశ నిపుణులేకాక, విదేశీ నేతలు కూడా విచ్చేశారు. కేవలం రష్యా, ఇంగ్లండు, అమెరికా వంటి ప్రముఖ దేశాల నుంచే కాక, కొత్తగా స్వాతంత్ర్యం సంపాదించుకున్న ఆఫ్రికా దేశాల నుంచీ, మధ్య, దూర ప్రాచ్యాల నుంచీ కూడా నిపుణులు హాజరయారు. ప్రపంచంలో, భారతదేశం ఎంత ప్రముఖ స్థానం, ఎంత కీలకపాత్ర వహిస్తోందో దీనివల్లే తేటతెల్లమవుతుంది. లేకపోతే, కేవలం ఎలకల్ని చంపించేందుకు ప్రపంచం నాలుగు మూలల్నించీ మనకి సలహాలివ్వడానికి మనుష్యులొస్తారా ?

పెద్దలంతా వొచ్చి వేదిక అలంకరించారు. అలవాటు ప్రకారం అరగంట ఆలస్యంగాగాని ఆరోగ్య మంత్రిగారు హాలుకి విచ్చేయలేదు. నిజానికి వారు సమయానికే వొచ్చినా, కార్యకర్తలతో అల్పాహారం విందారగించి, ఫొటోలు దిగడంలో కాలాతీత మయిందిట, వారు యాథాలాభంగా క్షమాపణ చెప్పి తమ గంభీరోపన్యాసంలో, దేశంలో ఎలకలు సంవత్సరానికి ఏ విధంగా వృద్ధి చెందుతున్నాయో, దీనివల్ల ఎంతపంట నష్టమవుతోందో, దానివల్ల ఎంతమంది తిండి లేకుండా పోతున్నారో దానివల్ల ఎంత రాజకీయ అల్లకల్లోలం పెరుగుతోందో, వివరించి చెప్పారు

దేశంలో నూట ఎనభై కోట్ల ఏడు వేల మూడువందల అరవై రెండు ఎలకలున్నాయట. అవి తినేసే గింజల పరిమాణాలు కూడా టన్నులలో ప్రారంభించి గ్రాముల దాకా చెప్పారు. ఆ అంకెలు వింటే కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎంతమంది రిసెర్చి విద్యార్థులు, ఎంత కృషిచేస్తే యీ వివరాలు లభించాయా అని ఆశ్చర్యంతో బుర్రకూడా తిరిగిపోయింది. దేశంలో నిజానికి ఎన్ని ఎలుకలున్నాయో ఆరా తియ్యడానికి అమెరికానించి ఒక నిపుణుల సంఘం తమ స్వంత ఖర్చులతో దేశమంతా పర్యటించి, ఆరు వారాలు అహోరాత్రాలుకష్టపడిందిట. అమెరికన్లకి రిసర్చి అంటే చాలా ప్రీతి. ఆ మధ్యని ఎక్కడో చదివాను, ఒకాయన ఐస్‌క్రీమును గురించి రెండున్నర సంవత్సరాలు ఘోర రిసెర్చిచేసి డాక్టరేట్ బిరుదం సంపాదించుకున్నాడట. ఆయన పదిహేడు వేల మూడు వందల ఇరవై నాలుగు రకాల ఐస్‌క్రీములు పరిశోధించాడట. రకరకాల ఆకారాలు, రకరకాల రంగులలో వున్న ఐస్‌క్రీములు. ఇన్నీ రుచించి, రుచి చూసి, కనిపెట్టిన సిద్ధాంతం, ఐస్‌క్రీములో తీపితనం వేసిన పంచదార పరిమాణాన్ననుసరించే హెచ్చి



వృద్ధులు పొందుతుంది. తేట మాటల్లో సారాంశం చెప్పాలంటే, 'ఐస్‌క్రీములో పంచదార ఎక్కువ వేస్తే తీపి ఎక్కువగా వుంటుంది. తక్కువ పంచదార వేస్తే, తీపి తక్కువవుతుంది' ఇది నిరూపించడానికి ఆయన కేవలం అంకెల పట్టీలే కాక, రంగుల గ్రాఫులూ, వారు తిన్న కొన్ని ముఖ్య ఐస్‌క్రీముల ఫొటోలు కూడా తగిలించారు పి. హెచ్. డి. వూరికే లభిస్తుందా?

ఇంతకీ చెప్పవొచ్చేదేమిటంటే, ఆ దేశంనించి వొచ్చిన రిసెర్చి బృందమే మన దేశంలో వున్న ఎలకల అంచనా తయారు చేసింది. కనక, మనం ఆ సంఖ్యని అనుమానించ కూడదు. మనం తినవలసిన ఆహారం ఇన్ని ఎలకలు తినేస్తున్నాయే అని గుండెలు బాదుకోవాలి. ప్రమాదం గుర్తించి వాటి సంహారానికీ, వాటి సంఖ్యా విరోధానికీ పూనుకోవాలి. వీటికి మార్గాలు అన్వేషించడం యీ సెమినారుకి మరో ప్రధాన ఆశయం.

ఎలకల్ని వేటాడి, పట్టి చంపడానికి ప్రతి రాష్ట్రంలోనూ స్పెషలు సిబ్బందిని, జీవులతోసహా,



యూనిట్లు కొనండి

పెట్టుబడి

భద్రమైనది

నమ్మకమైనది

యూనిట్లలో పెట్టుబడి పెట్టండి. మీకు మంచి ఆదాయం వస్తుంది. నష్టాలు కలిగే ప్రమాదం తక్కువ (గత సంవత్సరం నూటికి 6.1 రేటు చొప్పున ఆదాయం పంచి పెట్టడం జరిగింది)

- యూనిట్లు భద్రమైనవేగాక మీ సేవింగ్సు పెరగడానికి తోడ్పడతాయి.
- కొన్ని ఇతర పెట్టుబడులవలెగాక, యూనిట్ల వల్ల మీకు పన్ను రియాయతీలు ఇవ్వబడుతాయి.
- మీకు డబ్బు అవసరమైనప్పుడు యూనిట్లను సులభంగా నగదుగా మార్చుకోవచ్చు.

యూనిట్లలో ఇప్పుడే పెట్టుబడి పెట్టండి! ఈ సంవత్సరం ఇంకా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి!

ప్రధాన బ్యాంకుల అన్ని శాఖలలోనూ మీరు యూనిట్లు కొనవచ్చు.

అడ్రసు మార్పు

యూనిట్ హోల్డర్లు తమ అడ్రసులో ఏదైనా మార్పు వున్నట్లయితే, ఆ విషయాన్ని 1960 జూన్ 30 వ తేదీలోగా బొంబాయిలోని యూనిట్ ట్రస్టు యొక్క ప్రధాన కార్యాలయానికి తెలియజేయవలసిందిగా కోరబడుతున్నారు. ఈ విధంగా చేసినట్లయితే వారి సరియైన అడ్రసులు ఆదాయపు పంపిణీ వారంట్లు పంపడానికి వీలు కలుగుతుంది.

యూనిట్ ట్రస్టులో పెట్టుబడి పెట్టండి—ఇది ఉత్తమమైన పెట్టుబడి

యూనిట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

బొంబాయి లైఫ్ బిల్డింగ్, 45, వీర్ నారిమన్ రోడ్డు, బొంబాయి-1.

[illegible] బిల్డింగ్, [illegible] రోడ్డు, జార్జ్ టౌన్, మద్రాసు-1

8, క్లైవ్ [illegible], కలకత్తా-1



నియమించాలని సూచన చేసి వుంటారని మీరు తేలికగా వూహించుకోవచ్చును. ఈ సిబ్బందే కాక, ఎలకల వెంటబడి, ఎలా తేలికగా పట్టుకోవచ్చునో, కరిచేలాగ నోటి దగ్గర చెయ్యి పెట్టకుండా తోక ఎలా పట్టుకుని, గిరగిర తిప్పి, నేలకి వేసికొట్టి దానిని చంపవచ్చునో, జనసామాన్యానికి తర్ఫీదు ఇచ్చేటందుకు వరో స్పెషలు సిబ్బందిని నియమించాలన్న మరో సూచన కూడా అంగీకార ముద్ర సంపాదించుకుంది. ఎలక మన మహాశత్రువు. ఈ మహాశత్రువుతో పోరాడి ఘన విజయం సంపాదిస్తే గాని మనకి విమోచనం లేదు ఏ యుద్ధమూ కేవలం జవాన్లే సాధించలేరు. పౌరులందరూ కూడా పాల్గొని, దీన్ని ప్రజాయుద్ధం చేసి, ఆధునిక మారణ సామగ్రి మొదలు పురాతన హస్తలాఘవందాకా ఉపయోగించి, వాటిని రూపుమాపాలి అన్నది సెమినారు వ్యక్తీకరించిన సిద్ధాంతం.


సంహార విషయంలో కంటె విరోధన విషయంలో నిపుణులు కనిపెట్టిన కొత్త సిద్ధాంతాలూ, చేసిన సూచనలూ, చాలా ప్రజ్ఞావంతంగా, విప్లవాత్మకంగా వున్నాయనడానికి సందేహం లేదు. అక్కడ వివరించిన వైజ్ఞానిక విషయాలు కొన్ని నా మెదడు గ్రహించలేక పోయింది. అర్థమయిన, అథవా, అర్థమయిందనుకున్న రెండు విషయాల్ని గురించి చెబితే, విషయం ఎంత సూక్ష్మమో, ఎంత క్లిష్టమో, వైజ్ఞానిక ప్రగతి సాధించడానికి ఎంత అవకాశముందో మీరే గ్రహించగలరు.

ఒక నిపుణుడు కనిపెట్టిన విషయం: గ్రామాల్లో, పొలాల్లోనే వుండవలసిన కొన్ని రకాలయిన ఎలకలు, ఇప్పుడు బొంబాయివంటి నగరాల్లో వొచ్చిపడ్డాయి. దీనికి కారణాలు ఏమిటి? పంచవర్ష ప్రణాళికల్లో పరిశ్రమాభివృద్ధివల్ల, గ్రామాల్లోనించి ప్రజలు పట్టణాలకొచ్చి పడుతున్నారు. గ్రామాల్లో

ధాన్యం కూర్చే పంటలు తక్కు వయి, నగరాల్లో నిలవుంచే దిగుమతి ధాన్యాలు ఎక్కువ అవడమే దీనికి కారణమా, మరి యితర ముఖ్య కారణా లేమయినా వున్నాయా? గ్రామాల్లో వుండవలసిన ఎలకలు గ్రామాల్లోనే వుండేటట్టు కట్టడి చెయ్యడం ఎలాగ? ఇటువంటి పరిశోధన మన దేశంలో అత్యవసరం. లేకపోతే పిడుక్కి, బియ్యానికి ఒకే మంత్రం వల్లించినట్టు, గ్రామ ఎలకల నిరోధానికీ, పట్టణ ఎలకల సంహారానికీ ఒకే పరిష్కారం తయారుచేసే ప్రమాదముంది. దాని వల్ల ఫలితం లేకపోగా, కొన్ని రకాల ఎలకలు పేట్రేగిపోయి, మరీ విజృంభించవచ్చును. ఈ విషయాలన్నీ పరిశోధించడానికి గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ వెంటనే రిసెర్చి ప్రోజక్టులు ప్రారంభించాలి ఈ రిసెర్చికి కొంత సొమ్ము మద్ధతుగా ఇవ్వడానికి కొన్ని దేశాలు తయారుగా వున్నాయి.

ఇంతకంటె మరో గొప్ప విషయం చెప్పాడు ఒక శాస్త్రజ్ఞుడు. ఎలకలు వూరికె పుట్టుకొస్తూ వుంటే, ఎన్నని, ఎంతకని సంహరించడం! మన దేశం, పంచవర్ష ప్రణాళికల వల్ల సాధించిన ప్రగతి అంతా జనాభా వృద్ధిలోనే హరించుకుపోయినట్టు, ఎలకల్ని యథాప్రకారం ఉత్పత్తి చేసుకోనిస్తూ వుంటే, ఎంత మారణ సామగ్రి, ఎంత బలగమూ వాటి నిర్మూలనానికి చాలదు. కనుక వాటి పెరుగుదల కూడా నిరోధించాలి. నిజానికి సంహార యత్నాలకంటె నిరోధ ప్రణాళికలకే ఎక్కువ ప్రాముఖ్యమివ్వాలి. మనుష్యులే సంతాన నిరోధక కార్యక్రమాల్లో ఉత్సాహవంతంగా పాల్గొనడంలేదే, ఎలకలు మనమాట వింటాయా అని నిరుత్సాహ పడనక్కర్లేదు. ఎలకల ఉత్పత్తి శక్తి తగ్గించడానికి వారు కొన్ని ప్రయోగాలు చేశారుట. అవి సఫలీకృత మయాయుట. కనక ఎలకల యిష్టాయిష్టాలతో, వాటి సహకారంతో నిమిత్తం లేకుండా వాటి సంతాన నిరోధం అమలు జరపవచ్చును. సందేహానికి తావు లేకుండా, ఆ శాస్త్రజ్ఞుడు తన ప్రయోగాలన్నీ వివరించాడు. తిరుగులేకుండా సిద్ధాంతం ప్రతిపాదించాడు.

ఆయన చేసిన ప్రయోగం ముగ ఎలకల్ని, ఆడ ఎలకల్ని ఒక చోట పది రోజులు వుంచాడు. ఎన్ని ఎలక పిల్లలు పుట్టాయో లెక్కించాడు. మరో చోట అదే సంఖ్యలో ఆడ మగ ఎలకల్ని పెట్టి, ప్రతి పది నిమిషాలకీ, ఒక నిమిషం గట్టిగా గంట వాయించేవారు ఈ విధంగా ధ్వనిచే చెదరగొట్టబడిన ఎలకల




ఉత్పత్తి, నూటికి ముప్ఫయి శాతం తగ్గిపోయింది. ఎలకల కలయిక ఏమీ తగ్గలేదు. ఆడ ఎలక దృష్టిలో మొగ ఎలక, తన ఆకర్షణ పోగొట్టుకో లేదు. ఉత్పత్తి మాత్రం తగ్గింది. ఇదే గాక మరో గొప్ప విషయం కూడా తేలింది. గర్భవతులయిన ఎలకల సమీపంలో నలభై ఎనిమిది గంటలసేపు ఏకబిగిని గంట వాయిస్తే గర్భం పోతుంది, తల్లికి ఏమీ అపాయం కలగకుండా! గర్భం తాల్చిన ఎనిమిదో రోజునో, తప్పితే తొమ్మిదో రోజునో యీ గంట వాయింపు జరగాలి. తరవాత చేసినా ఫలితం లేదు. ముందు చేసినా ప్రయోజనం లేదు. కాని ఎనిమిది తొమ్మిదో రోజుల్లో నలభై ఎనిమిది గంటలు ఘంటానాదం చేస్తే, నూటికి ఎనభైనతులు ఉత్పత్తి తగ్గిపోతుంది. అమోఘమయిన ప్రయోగం, అద్భుతమైన ఫలితాలు.

కృత్రిమసాధనాలేమీ లేకుండా నే ఎలకల సంతాన నిరోధంలో చెప్పుకో దగిన ప్రగతి సాధించ వచ్చునని యీ ప్రయోగాలు నిరూపించాయి కనుక, ఎలుకలు ఎక్కువగా వుండేచోట గంటలు, డప్పులు వగైరాలు పట్టుకని పడేసి నిమిషాల కొక్కమాటు ఒక నిమిషం సేపు వాయిస్తే, ఎలకల ఉత్పత్తి తగ్గిపోతుంది. రెండో ప్రయోగ ప్రకారం కడుపుతో వున్న ఎలకల ఎనిమిదో రోజు కనిపెట్టి గంట వాయిస్తే, యీ ఉత్పత్తి మరీ తగ్గిపోతుంది. కనక క్రమేపీ, వాటంతట అవే నశించిపోయే అవకాశముంది. రెండవది కొంచెం కష్టమయినా మొదటిది చాలా తేలికేగా! సూక్ష్మంలో మోక్షం. పదిమంది పోగయి గంటలు కొట్టి డప్పు వాయించడం ఏ గ్రామానికి

కష్టంకాదు అయితే ఒక క్రమంలో వాయించడం మంచిది. అంకతవకగా వాయించి కేవలం గొడవ చేసేస్తే, ఎలుకలు ఆ సంగీత ధ్వనికి అలవాటు పడిపోయి, తమ ఉత్పత్తి యథాప్రకారం కొనసాగించే ప్రమాదం కొంత వుంది. ఈ ప్రమాదం ఎంతా? అని ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కనుక కొంత జాగర్తగా వుండాలని వారు హెచ్చరించారు. ఈ జాగర్త తీసుకోడం కూడా గ్రామీణులకేమీ కష్టంకానిపని. అహింసాయుత సిద్ధాంతానికి కట్టుబడిన మన దేశానికి ఇది నిజంగా చాలా ఉపయోగకరమైన పద్ధతి

ఎలుకల్ని చంపించడానికి ఇంత గొడవా? మంత్రులు రావాలా! సెమినార్లా! అన్న చులకన దృష్టితో కూర్చున్న నాకు ఎంత కనువిప్పు! ఎంత సూక్ష్మాతి సూక్ష్మ విషయాల మీద పరిశోధన జరుగుతోంది! సమస్యలు పాతవైనా, ఎన్ని కొత్త పరిష్కారాలు!

□□□





నాన్నపోయి ఆరేళ్ళయింది—

అమ్మపోయి నాలుగేళ్ళయింది—

అన్నయ్య పోయి ఏడాదయింది—

రమ నిన్న వెళ్ళిపోయింది — భర్తతో.

తానీనాడు ఒంటరిది.

నాన్న పోయిననాడు, అమ్మా, అన్నయ్యా తనను ఓదార్చారు. అమ్మ పోయిననాడు అన్నయ్య వున్నాడు తనకూ రమకూ ధైర్యం చెప్పటానికి. అన్నయ్య పోయిన నాడు రమ తనకు తోడుంది. ఇద్దరూ ఒకరి నొకరు ఓదార్చుకుంటూ రోజులు నెట్టుకొచ్చారు. వయస్సులో భేదం వున్నా, అక్కా చెల్లెళ్ళుగాకంటే ఆప్తమిత్రులుగా మసిలారు తనూ, రమా. చిన్నదైనా రమ తనకంటే ఎన్నో విషయాల్లో మెరుగు.

అలాంటి రమ కూడా వెళ్ళిపోయింది. అవును మరి! ఆడపిల్ల కన్నవారింట్లో ఎన్నాళ్ళుంటుంది? పెళ్ళయిన తొమ్మిది నెలల వరకూ యిక్కడే వుండనిచ్చాడు మరిది. ఉద్యోగం దొరికింది. కాపురం ఏర్పాటు చేసుకున్నాడు. రమను తీసుకు పోయాడు.

తానీ నాడు ఒంటరిది! కష్టం రానీ, సుఖంరానీ తనకు తను నిభాయించుకోవలసిందే. మనసులో మాటని చెప్పుకునే వ్యక్తి లేదు.

అరుణ హృదయం బరువెక్కింది. దీర్ఘంగా నిట్టూర్చి, జారిన పైటను సర్దుకుని మంచం మీద పైకి జరిగి కూర్చుంది. అప్రయత్నంగా ఆమె చూపులు అద్దం మీదకు మళ్ళినాయి. తన ప్రతిబింబం తనకే వెగటు కలిగించింది అరుణకు. అమ్మా, నాన్న తన కా పేరెలా పెట్టారో కాని, తనది సార్థక నామధేయం! అరుణట! అరుణ!' కాకుంటే శరీరమంతా - ఆపాదమస్తకం - ఏమిటీ ఎర్రదనం?— అసలిది ఎర్రదనమేనా - లేక తెలుపా? రెండూ కాదు!— 'అలినీలకుంతల —' అన్నారుగదా! ఆ జుట్టు చూడు - రమేష్ అన్నట్లు ఆంగ్లో ఇండియన్స్ 'హెయిర్!'

భగవాన్! నా కేనాటి శాపంయిది?'— అరుణ చేతులతో ముఖం కప్పుకుని రోదించ సాగింది. తన శరీరం సంగతి తలచుకునేసరికి అరుణ కళ్ళముందు ఆమె చిన్ననాటి సంఘటన లీలగా మెదిలింది. తన చిన్నతనంలో తమ వూళ్ళో ఎవడో కుర్రాడొకడు 'సరదా'కి గడ్డివామిని తగలబెడితే, యజమాని కోపంతో

పూగిపోతూ వాణ్ణి ఎత్తి అవామిలో విసిరేశాట్టు! పైగా కత్తిపుచ్చుకుని నుంచున్నాట్టు — ఎవరూ అతన్ని రక్షించేందుకు రాకుండా! ఆ కుర్రాణ్ణి బయటికి తీసి బ్రతికిస్తే, తనలా వుంటాడు కాబోలు! ఎవరైనా సరే తన వంక తదేకంగా, వింతగా చూస్తుంటే అరుణ కి సంఘటన వెంటనే స్ఫురిస్తూ ఉంటుంది.

"ఏనాడో చేసిన పాపఫలం!"— తన వేదాంతానికి తనకే నవ్వొచ్చింది. అవునుమరి! తను బియ్యే బియిడీ ప్యాసై టీచర్ గిరీ వెలగబెడ్తూ, ఎమ్మే డిగ్రీకోసం ప్రయత్నిస్తున్నదాయె!

"ఏమిటలా ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నావ్? అదీ సందె చీకట్లో!

అరుణ ఈ లోకంలో పడి తలెత్తి చూసింది. హాలు తలుపుల మీద రెండు చేతులూ ఆనించి గుమ్మం మధ్యగా నిలబడి ఉన్నాడు సారధి!

అరుణ తొట్రుపడుతూ లేచి లైటు వేసి "రండి, కూర్చోండి" అంటూ కుర్చీ చూపింది. తనూ కూర్చుంటూ.

సారధి కూర్చున్నాడు. అరుణ వంక వో క్షణం పరీక్షగా చూసి నవ్వుతూ అడిగాడు "ఏమిటలా ప్రాక్టికల్స్ చేసి అలసిపోయిన కాలేజీ అమ్మాయిలా వున్నావ్?"

సారధి చనువుకు ఆశ్చర్యపోలేదు అరుణ. నిన్న సాయంత్రం ఆమె కో టీచర్ రమేష్ తనను పరిచయం చేసిన పావుగంటకే సారధి ఏకవచన ప్రయోగం ఆరంభించాడు. అతని చనువుకు కోపమొచ్చినా ఏమీ అనలేక పోయిందితను కానీ, సారధి తనేదో గొప్ప తెలివిగా మాట్లాడుతున్నా ననుకుంటూ మాట్లాడే మాటల్ని మాత్రం తేలిగ్గా తీసుకోలేక పోయింది.

అరుణ ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ప్రశ్నించాడు సారధి. "అరుణా దేవి గారూ, ఏ లోకంలో వున్నారు?"

అరుణ అతనివైపు అదోలా చూసి "పెర్వర్టెడ్ జీనియస్" అంటే ఏమిటూ?" అని

సారధి ముఖం ముడుచుకోలేదు. గొలున నవ్వేసి అన్నాడు "నన్ను నువ్వేం అనుకుంటే ఏంగానీ, నీకు మాత్రం 'ఫిలాసఫీ' బాగా వంటపడ్తోంది— ఆ! అదిసరే! మీా దెల్లెలుతో మీరు వెళ్ళలేదేం? సెలవలే గదా"

అరుణ విసుగ్గా అంది "పానకంలో పుడకలా నేనెందుకూ?"

ఆ మెమాటలకు సారధినవ్వాడు. "అద్భుతం, బాగా చెప్పారు" అని విషయం మారుస్తూ "పోనీ పానకంలో మిరియంలా నాతో సినిమాకు రాకూడదూ?— హిచ్ కాక్ పిక్చర్ "మార్నీ" ఆడుతోంది. చాలా బాగుంటుంది."

సంభాషణ లోనే కాకుండా ప్రవ



ర్తనలోకూడా సారథి తనపై తీసుకుంటున్న చనువుకు అరుణ ఆశ్చర్యపోయింది. "సినిమాలకూ, షికార్లకూ తిరిగే అలవాటు నాకు లేదు" అని నిర్మొహమాటంగా చెప్దామనిపించింది కాని, సారథి చూపులోని ప్రాధేయత ఆమె నోటంట ఆమాటల్ని అననియ్యలేదు. ఒక్క క్షణం ఆలోచించి "సరే!" అంది.

సారథి కళ్ళు ఆనందంతో మెరిశాయి. అరుణ వంక తదేకంగా చూస్తూ వుండిపోయాడు.

ఊహాజగత్తులో విహరిస్తున్న సారథి అలంకరించుకొని సినిమాకు బయలుదేరిన అరుణను గమనించనే లేదు.

చేతనున్న తాళాన్ని ఆడిస్తూ "పోదామా?" అంది అరుణ. తొట్రుపాటుతో లేచాడు సారథి.

—సినిమానుండి యింటికి తిరిగి వచ్చిన అరుణ మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు బయలుదేరాయి. హాలులో సారథి ప్రవర్తనను తలచుకునే సరికి ఆమె కేవేవో మధుర భావాలు కలిగాయి. జీవితంలో ఇంతవరకూ ఏ పురుషుడూ, తనచే ఆకర్షింప బడటమలావుంచి, తనను నిలకడగా కొన్ని క్షణాలయినా చూసిన పాపాన పోలేదు.

అసలు, మగవాళ్ళు అనే ఏమిటి, ఆడవాళ్ళు మాత్రం ? — లేనే కో-లేడీ టీచర్స్ రాధారాణీ, మేరీ లే ఏనాడూ తనతో చనువుగా మాట్లాడి ఎరుగరు! అంతవరకెందుకూ? చివరకు గరల్స్ స్టూడెంట్స్‌కి కూడా తను క్లాసులో పాఠం చెబుతుంటే బాధాకరంగానే వుంటుంది.

దీనికంతకీ కారణం? — తన రూపం!

అలాంటిది యీనాడు — నిన్న పరిచయమైన సారథి తనకు దగ్గరవుతున్నాడు. అసలు సారథి ఎవరు? తనెవరు? తనకే ఏనాటి పరిచయస్తుడోనని రమేష్ సారథిని తనకు పరిచయం చేశాడు. కాకుంటే, అతనూ తమ జాతి (టీచర్) వాడేనట!

సారథి ప్రవర్తన, మాటల ధోరణి వలన తన కతనంటే సదభిప్రాయం కలుగక పోయినా, అతని మాటల్ని కాదనలేక పోతోంది. లేకుంటే హాల్లో తన భుజం మీద చేయివేసి, తను అతని వైపు తీక్షణంగా చూచినా, తన తప్పును సరిదిద్దుకోని సారథిని తనెందుకు ఉపేక్షించింది? ఏమైనా తన హృదయం సారథి వైపు మొగ్గుతోంది. దీనికి కారణం మనుష్యుల్లో తిరుగుతున్నా ఒంటరిదయి పోయిన యిన్నాళ్ళ తన దుర్భర జీవితమే మో?—

"నేను సారథిని ప్రేమిస్తున్నానా ?—"

ఈ భావన కలిగిన అరుణ పెదవులపై చిరునవ్వు విరిసింది. ప్రక్కకు తిరిగి లైటార్పి దిండులో తల దూర్చింది.

*　　*　　*

ఆ రోజు పెందలకడనే నిద్రలేచి యింటిపనులు పూర్తి చేసుకుంది అరుణ. తలంటిపోసుకుని కురులను ఆరబెట్టుకుంటోంది. పరీక్ష పేపర్లు దిద్దటానికి కూర్చుంది.

ఎండాకాలపు వాతావరణం చీదరగా వుంది. ఉదయం ఎనిమిది గంటలే అయినా పదిగంటలయినట్టుంది.

'హాల్లో, మిస్ అరుణా! బ్యూటీఫుల్!' అంటూ హుషారుగా ప్రవేశించాడు సారథి. అరుణ లేచి "రండి" అంటూ అతన్ని ఆహ్వానిస్తూ కుర్చీ చూపింది.

"నిన్ను చూస్తుంటే "కరుణశ్రీ" పద్యం గుర్తుకొస్తోంది అరుణా!" సారథి నవ్వుతూ కూర్చున్నాడు.

ఈ మాటలకు అరుణ సిగ్గుపడింది. "సైన్సు మాస్టారికి తెలుగు సాహిత్యం కూడా తెలుసే!" అంటూ కూర్చుంది.

సారథి హఠాత్తుగా ఆ సంభాషణ త్రుంచేస్తూ అడిగాడు "అన్నట్లు నీవు దిద్దుతున్న పేపర్లేమ్యాథ్సువి?"

అరుణ చెప్పింది.

సారథి 'ఓ హెలో' అంటూ తన కుర్చీని ఆమె ప్రక్కకు జరుపుకుని

టీ పాయ్ గాది పేపర్లను ఒంగి చూడ సాగాడు.

"ఏమిటంత ఆసక్తిగా చూస్తున్నారు?"

"అబ్బే! ఏం లేదు మీ 'వాల్యుయేషన్' ఎలా వుంటుందోనని..."

"మామూలే" అంటూ అరుణ పేపర్లను తన చేతిలోని అట్టమీద పెట్టేసి వెనక్కి జరిగి కూర్చుంది.

సారథి ఆమెవైపు పరీక్షగా చూశాడు. క్షణాల తర్వాత అన్నాడు "కానీ అరుణా! నీ పని కెందుకూ ఆటంకం?"

"ఫర్వాలేదు లెండి! తర్వాత చూస్తాను."

"నీ 'మెథడ్ ఆఫ్ వాల్యుయేషన్' చూడాలనే గదా అడుగుతున్నది! ఏం? నేను కూడా చూడటం ఇష్టంలేదా?"

సారథి మాటలకు "అహహా!... అదేం కాదు!" అని, బెరుగ్గా అతని వైపు చూస్తూ ప్యాడ్‌ను అందుకుంది అరుణ.

క్షణాలు నిముషాలై అరగంట గడిచింది. ఈ అరగంటసేపూ అరుణ దిద్దుతున్న ప్రతి పేపరుమీద, దాన్ని రాసిన విద్యార్థి మీద ఏవేవో వ్యాఖ్యానాలు చేస్తూనే వున్నాడు సారథి.

అరుణ అప్పుడే దిద్ది వదేసిన పేపరు తీసుకొని నిశితంగా చూడ సాగాడు సారథి. కొద్దిసేపు అలాగే చూసి వచ్చిన మార్కులన్నిటినీ కూడి, తనలో తను ఏదో గొణుక్కున్నాడు.

"ఏమిటంత పరీక్షగా చూస్తున్నారు?" అంది అరుణ

సారథి ఆ పేపరులో ఒకచోట వ్రేలుపెట్టి అరుణకు చూపిస్తూ అన్నాడు "చూడు! ఈ ప్రశ్నకు యింతకంటే నువ్వాశించే మంచి సమాధానం ఏమిటి?"

"ఏం మార్కులు తక్కువ వద్దాయంటారా?" తేలిగ్గా అడిగింది అరుణ.

"అవును. పేజీన్నరలో వున్న పాయింట్సన్నీ వివరిస్తూ వ్యాసం వ్రాస్తే పదిహేనుకి నువ్విచ్చే మార్కులు అయిదా? పైగా తప్పులు మాత్రం ఏమున్నాయనీ?" సన్నగా నవ్వుతూ అన్నాడు సారథి.

అరుణ కూడా నవ్వింది. ఆ పేపరు తీసుకుని చదువుతూ "అయితే ఎన్ని వెయ్యమంటారో కూడా చెప్పండి!"

"చూడండి" అంటూనే "నేనైతే కనీసం పది మార్కులన్నా వేస్తాను" అన్నాడు సారథి.

అరుణ లీలగా నవ్వుతూ తను వేసిన ఐదు అంకెకు మరో అయిదు చేర్చి, "చాలా?" అంటూ చిలిపిగా సారథి కళ్ళల్లోకి చూసింది.

"థాంక్యూ" అని "అదే చేత్తోనే ఆ పదో ప్రశ్న కూడా చూడు" అన్నాడు సారథి.

అరుణ పేజీలు తిరగేసి చదివిన



ఆంధ్రా
కాఫీ పొడి
ప్రధమశ్రేణి కాఫీవిత్తనములను నేర్పుతో
ఎన్నికచేసి, నైపుణ్యంతో గింజలను మిశ్రమపరచి,
అనుభవజ్ఞానముతో శాస్త్రీయముగా రోస్టుచేసి,
నాణ్యతను సంరక్షించు ప్యాకింగ్‌లో
తాజాగా మీకు మార్కెట్టులో దొరుకునట్లు
సరఫరా చేయబడుచున్నది.
ఆంధ్రాకాఫీ
ఉల్లాసప్రదమైనది!
G V RAO
ఆంధ్రా కాఫీ యిండస్ట్రీ
హెడ్డాఫీసు: బ్రాడీపేట 2 లైను, గుంటూరు-2.
బ్రాంచిలు: బ్రాడీపేట, పట్నంబజారు (గుంటూరు) బాపట్ల, నర్సరావుపేట, సత్తెనపల్లి, హైదరాబాదు, చీరాల,
తెనాలి..

తర్వాత 'దీనికెన్ని వెయ్యాలంటారూ?' అని అడిగింది.

సారథి మాట్లాడలేదు. అరుణే దాన్ని మరోసారి చదివి తను అంతకు ముందు వేసిన 'మూడు' అంకెను 'ఆరుగా' మార్చింది.

సారథి ఉత్సాహంగా చిటికేసి 'మా శావా మరి! అన్యాయంగా ఆ కుర్రాణ్ణి తప్పించేశావు! నే చూడకపోతే వాడి ఖర్మ అంతేగా?' అని అరుణవైపు చూసి నవ్వాడు.

అరుణ కూడా నవ్వుతూ 'పోనిలెండి! మీరు పుణ్యం కట్టుకున్నారుగా?' అంది.

'పోస్ట్' అన్న కేకతో వాళ్ళ ప్రసంగానికి అంతరాయం ఏర్పడింది. అరుణ తన చెల్లెలి వద్దనుండి వచ్చిన ఉత్తరాన్ని చదవటం అయిన తర్వాత సంభాషణ వేరే విషయాల మీదికి మళ్ళింది.

మరి కొంతసేపయిన తర్వాత అరుణ వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు సారథి.

* * *

సారథి ఆ వూరునుంచి వెళ్ళి వారంరోజులైంది. అతను వెళ్ళిపోయిన తర్వాత అరుణ మనస్సు మనసులో లేదు. ఆమె హృదయంలో అతని రూపు నిలిచిపోయింది. అతన్ని గురించిన తలపులతో వేగిపోయిందామె మనస్సు.

ఉదయం పది గంటలైంది. అన్యమనస్కంగా వరండాలో కూర్చుని ఏదో ఆలోచనలో మునిగి వున్న అరుణ 'పోస్ట్' అన్న కేకతో త్రుళ్ళిపడి లేచింది.

కవరందుకుని చింపి చూసింది. ఆమె కళ్ళు ఆనందంతో మెరిశాయి. పెదవులమీద చిరునవ్వు చిందులాడింది. మనస్సు పరవశించింది. హృదయం వుద్రేకంతో ముందుకురికింది—అది సారథి వ్రాసిన ఉత్తరం.

అరుణ చదువుకోసాగింది.

'మిస్ అరుణాదేవీ!—'

ఈ ఉత్తరాన్ని పూర్తిగా చదివి నువ్వు నన్నొక పచ్చి స్వార్థపరునిగా భావించవచ్చు. అలా భావించటంలో తప్పులేదు కూడా! నే నందుకు చింతించను. కారణం నిజంగా నేను స్వార్థపరుణ్ణే గనుక...'

అరుణ గుండెలు గుబగుబలాడినై, సారథి వ్రాస్తున్న దేమిటో అర్థం కాలేదు. హృదయాన్ని ఒక్క బట్టుకుని గబగబా చదివేసింది.

'నేను మీకు పరిచయం చేయబడినట్లు కోనసీమవాడినే కాదు. నా ఉద్యోగం మాష్టరుగిరీ కాదు. మాది గుంటూరుజిల్లాలో, నీకు పేపరు వచ్చాయే, ఆ వూరు. ఉద్యోగమంటావా? నిరుద్యోగం. కాకుంటే బి. ఏ. చదివాను కనుక ఈ వేళ కాకుంటే రేపో రోజైనా ఏదో ఉద్యోగం దొరక్కపోదు.

ఇక నా స్వార్థాన్ని గురించి. మావూరి పెద్దరైతు గారబ్బాయి పరీక్షల్లో ఇంగ్లీషు పేపరు సందేహా

స్పదంగా వ్రాశాడు. మిగిలినవి సాధ్యసవుతాడనే నమ్మకం, ధైర్యం వున్నాయి. ఇంగ్లీషు పేపర్లుమీ వూరు అరుణాదేవి అనే టీచరు (మీరు) కువచ్చినట్లు తెలుసుకొని తగినంత డబ్బిచ్చి పని పూర్తిచేసుకు రమ్మని నన్ను పంపారువాళ్ళు. నేనూ అనుమానంగానే వచ్చాను. కానీ, నిన్ను చూసినక్షణంలో నాలో అవేవో ఆలోచనలు బయలుదేరాయి. నీరూపంలోఉన్న వైచిత్రిని చూడగానే నీమనోగత భావాలెలావుంటాయో అని ఆలోచించాను. నా ఊహ నిజమయింది! నేను నీకు దగ్గరవుతుంటే నీవు మురిసిపోయావు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నా పని పూర్తి చేసుకున్నాను.

'నిన్ను మోసంచేసి నందుకు క్షమించు — అన్నట్టు!— 'రమేష్'కి కూడా నా అంతర్యంతెలీదు. అతన్ని దుయ్యపట్టకు — సారథి.'

ఉత్తరం చదవటం పూర్తిచేసిన అరుణ నిశ్చేష్టురాలైంది.

క్షణాల తర్వాత తనలో తను గొణుక్కుంది.

'అడవిలో పూసిన పిచ్చిపువ్వును నిత్యజీవితంలో ఎవరూ చూడరు, ముట్టరు, కానీ వైద్యుడు మాత్రం తన అవసరానికి ఔషధంగా వాడుకుంటాడు. అలాగైంది నాజీవితం. ఏమైనా, నన్ను మోసం చేయగలిగాడు గానీ, నా మనసుని మోసం చేయగలడా సారథి?'—

□□□

విజేత

యద్దనపూడి సులోచనారాణి

(గత సంచిక తరువాయి.

"తోటంతా పూవుమీద పిందె మీద వుంది. ఈ గాలివాన చూస్తుంటే—' దిగులుగా అంది సంధ్య

ఆయా మాట్లాడలేదు ఈ వానకి తోట యేదన్నా అయితే అది సంధ్య మనసుమీద ఎంత దెబ్బతీస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి. ఈ తోటకోసం సంధ్య యెంత శ్రమపడిందో, ఎండనకా, వాననకా ఎంత కాయకష్టం చేసి, ఫలితంకోసం ఎదురు చూస్తోందో ఆయాకి కాక పోతే ఇంకెవరికి తెలుస్తుంది!

రాత్రంతా వర్షం పడ్తూనేవుంది. ఉదయానికి తగ్గకపోగా గాలి విసురు మరింత ఎక్కువైంది. పగలంతా ఒక్క నిముషం కూడా తెరిపి యివ్వలేదు ఈదురుగాలితో కుంభ వృష్టి కురస్తూనే వుంది.

సాయంత్రం అవుతుండగా "ఒకసారి తోటకివెళ్ళి చూసివస్తాను" అంది సంధ్య.

"ఈ వానలోనా? నీకేమైనా మతిపోయిందా!" ఆయా కసిరింది.

ఈ వూరుకి వచ్చిన తర్వాత ఈ రెండు మూడు సంవత్సరాలలో యింత పెద్ద వర్షం యెప్పుడూ పడ లేదు. ఇలు నేసి చాలా రోజులు కావడంవల్ల పెంకుల మధ్యనుంచి ఇంట్లోకి వాన కురుస్తోంది.

చీకటిపడింది. ఆయా వెలిగించి పెట్టిన లాంతరు గాలికి రెపరెప లాడుతోంది. రాత్రికివానతగ్గే సూచనలేవీ కన్పించడంలేదు. వాసు పడుకుని మంచంమీద సంధ్య ముడుచుకుని కూర్చుంది. ఆయా ఇంట్లో వున్న చెంబులు గిన్నెలు తెచ్చి అక్కడక్కడ వాన నీళ్ళు పడుతున్న చోట పెట్టింది. అయినా లాభం లేకుండా వుంది రాత్రంతా యిలాగే పడితే ఇల్లంతా వాన నీళ్ళకి నిండిపోయేట్టుగా వుంది. గోడలనుంచి కూడా తేమగా నీళ్ళూర్తున్నాయి.

సంధ్య నిస్సహాయంగా చూస్తూ కూర్చుంది.

వాకిలి తలుపులు కిలివిన్నట్లు చప్పుడైనాయి

'ఎవరది?' అంది ఆయా బిగ్గరగా.

'ఎవరూ లేరు నీకు ఒకటే భ్రాంతి. గాలి శబ్దం' సంధ్య వినుకుంది.

'నాకు ఎవరో పిలిచినట్టు విన్పించింది.'

'కాస్త వాలంటే వెళ్ళి చూడరాదూ!' ఇంత చీకట్లో ఎవరు వస్తారో అనుకుంది.

ఆయా వెళ్ళి తలుపు తీయగానే మాధవ్ రెయిన్‌కోటు నుంచి నీళ్ళు కారుతుండగా లోపలికి వచ్చాడు.

అతన్ని చూడగానే సంధ్య చటుక్కున లేచి నిలబడింది.

ఒక్కసారి తలుపులు తెరుచుకోగానే హఠాత్తుగా వచ్చిన గాలి విసురుకి లాంతరు రెపరెపలాడింది. ఆయా చప్పున వెళ్ళి చేతులు అడ్డు పెట్టింది.

మాధవ్ వెంటనే తన వెనక తలుపులు మూసేశాడు.

'మీరు ఊరినుంచి ఎప్పుడు వచ్చారు?' అంది ఆయా.

'ఉదయమే వచ్చాను. బైటికి కదల నివ్వకుండా ఒకటే వర్షం.' సాధారణంగా అతను ఊరినుంచి రాగానే సంధ్యవాళ్ళింటికి వచ్చి తాను క్షేమ సమాచారాలు తెలియజేస్తాడు.

మాధవ్ ఇంటినిండా పరిచిన గిన్నెలవంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. పొడుగ్గావున్న రెయిన్ కోటులో అతను మరింత పొడుగ్గా లావుగా కన్పిస్తున్నాడు. వాన జల్లుకి తడిసిన జుట్టు నుదుటిమీదపడి అంటుకుపోయింది. అది ఒక అందంగానే వుంది. ఎప్పటికప్పుడే యిప్పుడెంత బాగుంది అన్పించి మరోసారి చూడాలి అన్పించే ప్రత్యేకతవుంది ఆ జుట్టుకి.

'ఒకటే వాన. ఈ రాత్రికి కూడా తగ్గేట్టులేదు.' అంది ఆయా.

'ఇల్లంతా కురుస్తోంది లా వుందే!' రెయిన్‌కోటు విప్పేస్తూ అన్నాడు. దాన్నుంచి కారుతున్న నీళ్లు కాలవ కడుతున్నాయి.

ఇంతవానలో యిప్పుడీ చీకట్లో రాకపోతే యేం మునిగిపోయిందో! కిందకి చూస్తూ నిలబడిన సంధ్య ముఖం చిట్లించుకుని కనుబొమ్మలు ముడుచుకుంది.

'లోపలంతా కూడా కురుస్తోందా?—' అంటూ మాధవ్ చొరవగా లోపలంతా చూసి తిరిగి వస్తూ 'బాప్‌రే! గోడలు కూడా కారుతున్న నీళ్లతో నానుతున్నాయి' అన్నాడు.

ఆయా మాట్లాడలేదు.

'ఈ రాత్రికి వాన తగ్గదు.' అన్నాడు.

మళ్ళీ ఎవరూ సమాధానం చెప్పలేదు. సంధ్య వంచిన తల ఎత్తలేదు.

'నది ఇప్పటికే ఒడ్డు రాచుకుని ప్రవహిస్తోంది. ఏక్షణంలో పొంగినా పొంగవచ్చు. పల్లెవాళ్ళంతా గుడిసెలు ఖాళీచేసి ఊళ్ళోకి వచ్చారు. ఈ రాత్రంతా వాన పడితే నది పొంగటం ఖాయం. దేవుడెరుగు. ముందీ వర్షపు నీళ్ళతోనే ఈ ఇల్లు మునిగి

పోయేలావుంది' నవ్వుతూ అంటూండగానే పైనుంచి టపటప చినుకులు వచ్చి తలని తలమీద పడ్డాయి. వాటినుంచి తప్పించుకోటానికి మాధవ్ అనుకోకుండా సంధ్యవైపు జరిగాడు,

'ఈ రాత్రప్పుడు ఎక్కడికి వెళతాం' అంది అయినా సందేహంగా.

'మా యింటికి రండి. మళ్లీ తెల్లవారగానే వచ్చేద్దురుగాని.' అన్నాడు మాధవ్.

'ఫర్వాలేదు. వాన తగ్గిపోతుంది.' మొట్టమొదటిసారిగా మాట్లాడుతూ అంది సంధ్య

లాంతరు వెలుగులో క్షణంసేపు సంధ్యవైపు చూస్తూండిపోయిన మాధవ్‌కి సంధ్య నిలబడిన తీరు, ఆ వంచుకున్న ముఖం చూసేసరికి దగ్గరగా వెళ్ళి బలవంతంగా రెండు చేతుల్తో ముఖం పైకెత్తి, కళ్ళెత్తి చూడమని ఆజ్ఞాపించాలని అనిపించింది అలా చూసినప్పుడు 'నేనేం చేస్తే నీకు నా మీద ఉన్న అసహ్యం పోతుందో చెప్పు సప్తసముద్రాలు ఈదనా? మంచుకొండల మీద

జరిగినకథ

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలు శిక్ష తరవాత స్వగ్రామం తిరిగి వస్తున్న మాధవ్, త్రోవలో బండి బురదలో కూరుకుపోగా నిస్సహాయంగా ఉన్న సంధ్యకు సహాయం చేస్తాడు. ఆమె అతన్ని అపార్థం చేసుకుని, కొట్టి అవమానిస్తుంది. ఆ తరువాత కొన్నేళ్ళకు ఆమె అతనికి రైల్లో ఒంటరిగా తారసిల్లుతుంది. తల్లి మరణం, ప్రేమించిన సుధ మరొకరిని వివాహమాడడం మొదలైన సంఘటనలతో వికలమనస్కుడై ఉన్న మాధవ్ ఆ యువతిపై పూర్వపు కసితో మానభంగం చేస్తాడు. మరికొన్నేళ్ళకు ఒక పల్లెటూరులోని తన భవనానికి వెళ్ళిన మాధవ్‌కు ఆ సంధ్యే మళ్ళీ తటస్థపడుతుంది. అనుకోకుండా తిరిగి తిరిగి ఎదురవుతూ తనపై విపరీత ద్వేషం చూపుతున్న ఆమెను ఎలాగైనా తనను ప్రేమించేలా చేయాలని అతను ప్రయత్నిస్తాడు. వికలాంగుడైన ఆమె తమ్ముడు వానుతో స్నేహం చేస్తాడు. వాను అంగవైకల్యం పోగొట్టి ఆ విధంగానైనా సంధ్య ప్రేమాదరాలను పొందాలని వానును హైదరాబాదు తీసుకువెళ్ళి ఆపరేషన్ చేయిస్తాడు.



నుంచి క్రిందకి జారనా? అగ్నిపర్వతాల మధ్యనుంచి చిరునవ్వుతో నడవనా? ఏం చెయ్యను? ఏం చేస్తే నీ ముఖంలో ఆవరించుకున్న కాఠిన్యం కరిగి నా పట్ల ప్రసన్నత కలుగుతుందో చెప్పు సంధ్యా' అని అడగాలనిపించింది. కాని పైకి మాత్రం మామూలు స్వరంతో, అతి సహజంగా 'అర్థరాత్రి వేళ ఏదయినా అయితే?' అన్నాడు.

'ఏం కాదు' దృఢంగా వచ్చింది సమాధానం.

'కీడెంచి మేలెంచటం మంచిది. చెడుని వూహించి జాగ్రత్త పడటంలో నష్టం ఏమీ లేదు. ఈ రాత్రి ఏమీ కాదని మీరూరుకుంటే ఏదయినా అవవచ్చునని నా భయం. మనిషి ఎప్పుడూ తన నమ్మకాలమీద గుడ్డి విశ్వాసం పనికిరాదు. భగవంతుడు ఒక్కోసారి మనం ఊహించిన దానికి పూర్తి వ్యతిరేకంగా జరిపిస్తాడు' చివరి మాటలో శ్లేష ఒక్క సంధ్యకే అర్థమైంది. క్షణంసేపు నిశ్శబ్దం యేర్పడింది.

లాంతరు వత్తి సరిచేస్తున్న ఆయా సంధ్యవైపు చూసింది. ఈ గాలి, ఈ వాన సీళ్ళతో నానుతున్న ఈ



గోడలు చూస్తుంటే అందరికీ భయంతో ప్రాణం పోతోంది కనీసం కప్పుకునేందుకు మంచి బట్టలు కూడా లేవు

'ఏమిటావు ఆయామ్మా?—' మాధవ్ తనేదయినా చేయదల్చుకుంటే ఆయాతోనే సంప్రతిస్తాడు.

'నాదేముంది?–' అనుమానంగా అంది.

'అయితే తక్షణం బయలుదేరు. చిన్నవాళ్ళ అభిప్రాయాలకి విలువ ఇవ్వాల్సిందే కాదనను. కాని పెద్దరికంతో ఆజ్ఞాపించాల్సిన సమయాలు కూడా కొన్ని వున్నాయి'

సంధ్య ముఖం ఎర్రబడటం ఎవరూ గమనించలేదు.

'నేను ప్రాణం పోయినా సరే. ఇక్కడే వుంటాను కానీ మీ యింటికి రాను. ఇక్కడినుండి వెళ్ళు.' అని బిగ్గరగా అరవాలనిపించింది. కాని వివేకం కోపాన్ని అణగమని హెచ్చరించింది. ఆయాని చూసి మాటాడకుని బతిమాలాడింది సంధ్య కళ్ళతో. ఆయా వైపు చూసింది. చలిలో గడగడలాడుతూ—భయంతో అనుమానం నిండిన కళ్ళతో 'వెళ్దాం' అని ప్రాధేయపడుతూ దీనంగా వున్న ఆ దీనముఖం కళ్ళ చూసే సంధ్య తగ్గింది. ఈ చలిగాలికి, ఈ వానకి ఆయాకి ఏదైనా జబ్బుచేస్తే అసలే మరీ కష్టం.

సంధ్యకి గత్యంతరం తప్పలేదు.

ఎలాగైతేనేం బైలుదేరారు

'మీ రిద్దరూ ఈ రెయిన్‌కోటు కప్పుకోండి. తల తడవకుండా వుంటుంది.'

మాధవ్ రెయిన్‌కోటు అందిచ్చాడు.

ఆయా తీసుకుంది.

'అవసరం లేదు. నే నిలా రాగలను' తల తిప్పేసి విసురుగా అంది సంధ్య. ఆ అనేటప్పుడు ఆ కళ్ళలో కన్పించిన కంపరం మాధవ్ గుర్తించక పోలేదు ఆయాకి కోటు జాగ్రత్తగా కప్పాడు.

ఇంటికి తాళంవేసి వరండా దిగుతుంటే మట్టిలో సంధ్యకాలు జర్రున జారింది.

'అ! అ! జాగ్రత్త—' వెనకగా వస్తున్న మాధవ్ చప్పున బలంగా జబ్బ గుచ్చిపట్టుకుని పడిపోకుండా ఆపాడు. ఆ ప్రయత్నంలో సంధ్య తల వచ్చి అతని గుండెలకి ఆనింది. సరిగ్గా నిలబడి మాధవ్ చేతిని విదిలించుకునేలోపల అతనే వదిలేశాడు. అతని స్పర్శ అసహ్యంగా వున్నమాట వాస్తవమే! కానీ మెరుపులా అతనలా పట్టుకు ఆపకపోతే ఈపాటికి బురదలో బోర్లా పడి వుండేది. అందుకే సంధ్య అనుకున్నంతగా అసహ్యించుకోలేకపోయింది.

34

ఎప్పుడూ దూరంనుంచి లీలగా చూడటం తప్ప దగ్గరగా ఈ

ఇల్లు ఎలా వుంటుందో సంధ్యకి, ఆయాకి యిద్దరికీ తెలియదు. వరండాదాటి లోపల అడుగు పెట్టేసరికి హాలునిండా బిలబిలలాడుతూ చాలామంది కన్పించారు. వాళ్లలో ఎక్కువమంది పల్లెవాళ్ళు వున్నారు. సాలీలు—కొంతమంది కమ్మరవాళ్లు కూడా వున్నారు. మగవాళ్లు కంబళ్లు కప్పుకుని కూర్చున్నారు. ఆడవాళ్ళు గుంపుగా వారి పిల్లల్ని దగ్గర పెట్టుకుని కూర్చున్నారు. వాళ్ళందర్నీ చూసిన తర్వాత సంధ్య తేలికగా నిట్టూర్చింది. తల దాచుకోటానికి ఆశ్రయం యివ్వటంలో మాధవ్ తనకి ప్రత్యేకత చూపలేదు. చాలామంది అనాధల్లా తనూ వచ్చింది. అంతే.

'రండి' అంటూ లోపలి గదిలోకి తీసుకెళ్ళి 'గోవిందూ!' అని కేక వేశాడు.

'వస్తున్నా!' లోపలనుంచి జవాబు వచ్చిన రెండు క్షణాల తర్వాత గోవిందు అక్కడికి వచ్చాడు. అతను వంటరిగా రాలేదు. తెల్లగా, బొద్దుగా చక్కటి జుట్టుతో, ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న నాలుగైదు సంవత్సరాల కుర్రాడిని ఎత్తుకొచ్చాడు.

'అరె! నువ్వింకా నిద్రపోలేదూ?—' మాధవ్ చేతులుజాస్తూ అడిగాడు.

ఊహు నువెక్కడికి వెళ్లావు?—' తండ్రి చేతుల్లోకి వచ్చిన బాబు సంధ్యా వాళ్ళని చూస్తూ అడిగాడు.

'గోవిందూ! వాళ్ళకి లోపల ఎడంవైపు గది చూపించు.' అన్నాడు మాధవ్.

'ఎవరీ కుర్రాడు?—' ముద్దొస్తున్న బాబునిచూసి ఆయా అడక్కుండా వుండలేకపోయింది.

'నా కొడుకు' ఎంత సహజంగా చెప్పాలన్నా అతని కంఠం ఎలాగో అయిపోయింది.

సంధ్య ఉలిక్కిపడింది.

ఆయా విచిత్రంగా చూసింది.

'ఏం? పెళ్ళి పెటాకులూ లేకుండా కొడుకెలా వచ్చాడనా? నాలాంటి వాళ్ళకి వస్తాడు. వీడు నా కొడుకు అని తెలిసింది. వెంటనే తెచ్చుకున్నాను. తల్లి ఎక్కడుందో తెలియదు.' అతని మాటల్లో శ్లేష అందరికీ అర్థం అవుతూనే వుంది. నిజాన్ని నిస్సంకోచంగా చెప్పే అతని ధైర్యానికి అంతా ఆశ్చర్యపోయారు కూడా.

'బాబూ! ఆయా దగ్గరకి వెడతావా?—' ఆయాకి అందిస్తూ కొడుకుని అడిగాడు. వాడు వెళ్ళినట్టే వెళ్ళి మళ్ళీ తండ్రికోసం చేతులు జాచాడు.

'అచ్చు మీ పోలికే సుమా!' ఆయా నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది. మాధవ్ నా కొడుకు అని చెప్పిన విషయం కుర్రాడి ముఖంలో స్పష్టంగా కన్పిస్తున్న అతని పోలికలు ఖచ్చితంగా ఋజువు చేస్తున్నాయి.

"ఎక్కువ నా పోలికలున్నమాట నిజమే. కానీ పరీక్షగా చూస్తే పెదవుల్లో, ముక్కులో తల్లి పోలిక కూడా కన్పిస్తుంది" అతని ముఖం క్రీనీడలో వుండటంవల్ల అక్కడ ఎలాంటి భావం వుందియెవరికీ కన్పించలేదు.

ఆ ప్రసంగం ఆ పైన వినటం యిష్టంలేనిదానిలా సంధ్య అక్కడి నుంచి గోవిందుతో లోపలికి వెళ్ళిపోయింది.

"పిల్లాడిని ఎవరు చూస్తున్నారు మరి ?—" అంది ఆయా.

'ఇంకా ఎవరూ దొరకలేదు. ఆయాల కోసం వెతుకుతున్నాను. నేనున్నా లేకపోయినా కంటికి రెప్పలా చూసేమనిషి కావాలి." అన్నాడు మాధవ్.

"జానాను" ఆయా కూడా అక్కడినుంచి లోపలికి వెళ్ళిపోయింది.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత మాధవ్ ఒక్కసారి బాబుని గుండెలకి హత్తుకుని అక్కడున్న ఒక కుర్చీలో కూలబడ్డాడు. ఎంత విచిత్రం! సంధ్యకి వీడిని చూపించి నా కొడుకు అని ఎలా చెప్పాలా అన్న సమస్య ఇంత సులభంగా పరిష్కారం అయిపోతుందని అతను కల్లో కూడా అనుకోలేదు. ఈరోజే వాడిని సిస్టర్ దగ్గరనుంచి పూర్తిగా తెచ్చేసుకున్నాడు. ఈ రోజే అనుకోకుండా తప్పనిసరి కావడంవల్ల సంధ్య ఈ యింటికి తలదాచుకోటానికి వచ్చింది. "నా కొడుకు" అని చెప్పినప్పుడు సంధ్య ముఖంలో కన్పించిన అసహ్యమైన భావం అతను గుర్తించకపోలేదు. ఏనాటికైనా బాబుని తీసుకెళ్ళి సంధ్యకి అందిచ్చి 'వీడు నీ కొడుకు సంధ్యా!' అని చెప్పే క్షణం వస్తుందా ? బాబుని అలవాటు చేసుకోటానికి అతను యెన్ని తిప్పలు పడ్డాడో ఆ భగవంతుడికే తెలుసు. దాదాపు ప్రతిరోజూ నర్సింగ్ హోమ్ కి వెళ్ళేవాడు. వెళ్ళినప్పుడల్లా వాడిని తీసుకుని కారులో కూర్చోపెట్టుకుని ఊరంతా తిప్పేవాడు. చాకలెట్లు, బిస్కెట్స్, బొమ్మలు, బట్టలు, ఒకటేమిటి వాడి దృష్టిని ఆకర్షిస్తుంది అనుకొన్న ప్రతి వస్తువు స్వయంగా షాపుకి తీసుకెళ్ళి కొనిపెట్టేవాడు. అందువల్లే వాడు అలవాటు అవటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. రాను రాను

బాబుకి మాధవ్ అంటే ఓ విచిత్ర
మైన లోకం చూపించే మనిషిగా;
తనేం కావాలంటే అది యిచ్చే
అప్పుడిగా తెలిసిపోయింది. అందుకే
సిస్టర్ 'ఆయనతో వెళ్తావా' అంటే
వెంటనే తల వూపాడు. పదిహేను
రోజులకి, లేకపోతే కనీసం నెల
రోజులకి ఒకసారయినా తీసుకొచ్చి
బాబుని చూపించి, బెంగపడటం
లేదని రుజువు చేయాలని సిస్టర్
గట్టిగా హెచ్చరించి మరీ యిచ్చింది.
వాడిని దగ్గరికి తీసుకున్నప్పుడు
ఒళ్లో కూర్చోపెట్టుకున్నప్పుడో,
లేక మంచంమీద పడుకుని గుండెల
మీద పడుకోబెట్టుకున్నప్పుడో
వాడివైపు ఏకదీకంగా చూస్తూ గంటల
తరబడి ఆలోచనల్లోకి జారిపోవడం
మాధవ్‌కి అలవాటయిపోయింది.

ఇప్పటికి కూడా వాడిని తాకితే
విద్యుత్ తాకినట్లే అన్పిస్తుంది అత
నికి. సంధ్య దగ్గరికి బాబు వెళ్ళేలా
చేయటం ఎలాగన్నది ప్రస్తుతం
మాధవ్‌ని వేధిస్తున్న సమస్య. అతని
మనసు వాడికోసం వేయిమార్గాలు
వెతకసాగింది.

గదిలోకి వచ్చిన తర్వాత పడుకో
బోయేముందు ఆయా "నిజంగా
కొడుకే నంటావా?" అంది యింకా
అదే ఆలోచిస్తూ నమ్మలేనట్లుగా.

"ఏం? ఎందుకు కాకూడదూ?"
కఠినంగా ప్రశ్నించింది సంధ్య.

"మరి తల్లి?—"

"గంగలోకి దూకివుంటుంది. లేక
పోతే మరో పెళ్ళి చేసుకుని మర్చి
పోయిందో."

"ఎంతయినా కుర్రాడు మాత్రం
ముత్యంలా వున్నాడనుకో. అచ్చుట్టా
అతన్లా అందరూ అచ్చుఅయనే—"
అంది ఆయా,

సంధ్య మాట్లాడలేదు. మన
సంతా భయంకరమైన జ్ఞాపకంతో
కలకలలాడ్తోంది. తనకీకూడా ఒక
వేళ ఆ కుర్రాడు బ్రతికి వుంటే!
సంధ్య శరీరం భయంతో జలదరించి
వెంటనే జుగుప్సతో ముడుచుకు
పోయింది. ఛి — ఛి! ఇంత
వరకూ అలాంటి ఆలోచన యెప్పుడూ
రాలేదు. అయినా అతనికి ఎంత
సిగ్గులేదూ! ఎంత గర్వంగా చెప్పు
కుంటున్నాడో. సంధ్యకి తండ్రీ
కొడుకులు కలిసిన ఆ దృశ్యం కళ్ళ
ముందు మెదలగానే శరీరం అంతా
తేళ్ళు, జెర్రులు పాకినట్లు కంపరం
పుట్టింది. అతని జీవితంలో ఎంత
మంది ఆడవాళ్ళు! రోజురోజుకీ
పరిచయం పెరిగే కొద్దీ ఈ ఆడవాళ్ల
సంఖ్య పెరిగిపోతోంది! సుధ,
జ్యోతి, ఈకుర్రాడి తల్లి, తనూ అప్పు!
నిజంగా ఏం మనిషి. సంధ్యలో అణు
వణువు అతనంటే మరింత
ద్వేషంతో అసహ్యించుకోసాగింది.
అయినా ఇదేం ఖర్మం! ఈ ఇంట్లో
అసలు తనెందుకు అడుగుపెట్టింది.
భగవాన్! నేనేంపాపం చేశాను.
నన్నింత కూరంగా శిక్షిస్తున్నావు.
చీకట్లో, వానచప్పుడు వింటూ పడు
కున్న సంధ్య కళ్ళనుంచి నిశ్శబ్దంగా

వెచ్చటి కన్నీళ్ళు ప్రక్కలకి జార సాగినాయి.

35

మర్నాడు వర్షపు ఉధృతం కాస్త తగ్గింది. కానీ గాలిలో జోరు యేమాత్రం తగ్గలేదు. రాత్రి మాధవ్ యింట్లో వున్న అందరూ ఆరోజు కూడా అక్కడే వుండేట్టు అతను ఏర్పాట్లు చేశాడు. గోవిందు, అతని భార్య, తల్లి అందరికీ భోజనం సంగతి చూస్తున్నారు. అంత పనివుంటే చూస్తూ ఊరికే వుండలేని ఆయా తను కూడా వంట యింటివైపు వెళ్ళింది. అంతక్రితం కొద్దిసేపటి మునుపు సంధ్య ఒక్కసారి వెళ్ళి తోటని చూసివస్తాను అంది. ఈ వానలో అడుగు బైట పెట్టటానికి వీల్లేదని ఆయా గట్టిగా చెప్పింది.

గదిలో వంటరిగా కూర్చొన్న సంధ్య ఆయా వంటయింట్లో హడావుడిలో మునిగిపోయిందని గ్రహించగానే మెల్లిగా బైటకి జారుకుని, చీరకొంగు తిప్పి తలమీద కప్పుకుని తోటవైపు పరుగెత్తింది. వడివడిగా అడుగులు వేస్తూ, ఏదో ఆలోచిస్తూ తోట కభిముఖంగా వస్తున్న సంధ్య అల్లంతదూరంలోనే మాటనొక్కినట్టు ఆగిపోయి కళ్లు వెడల్పు చేసుకుని చూడసాగింది. అక్కడంతా జలమయం అయిపోయింది. పైన నీళ్ళ మీద తెప్పల్లా తేలుతున్న పువ్వుల్నీ పిందెల్నీ చూసి అక్కడ తోట వుందని అనుకోవాలి. పందిరిమీదకి ప్రాకిన తీగెలు కూడా ఎడా పెడా పడిపోయినాయి. స్థాణువులా నిలబడి పోయిన సంధ్యకి యెదురుగుండా కన్పిస్తున్న యీ భయంకరమైన యదార్థాన్ని గ్రహించటానికి ఎంత ప్రయత్నించినా మనసు ఒప్పుకోవటంలేదు. గాలికి తల మీద కొంగు జారిపోయింది. సరిచేసుకోవాలనే ధ్యాస కూడాలేదు. ఆ వానలో అక్కడ యెంతసేపు నిలబడిపోయిందో సంధ్యకి గుర్తులేదు. ఎన్ని రోజుల కష్టం! ఎంత శ్రమ! ఎన్ని ఆశలు! వీటన్నిటిని నిరాశ అనే ప్రవాహం ముంచేసింది.

క్రుంగిపోయిన మనసుతో, మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ సరాసరి ఇంటికివచ్చి తలుపుతీసి లోపల ప్రవేశించింది. ఇల్లంతా నీళ్ళు నిండి వున్నాయి. నీరసంగా వాసు మంచం మీద కూలబడింది. గుమ్మంలోనుంచి చల్లటి ఈదురుగాలి రివ్వు రివ్వుమని వీస్తోంది. వానకి తల, బట్టలు పూర్తిగా తడిసి పోయినాయి. ఎంత ఆపుకుందామన్నా ఆగకుండా శరీరం అంతా చలికి గడగడా వణుకుతోంది. పళ్ళు కటకట లాడుతున్నాయి. సంధ్యకి ఒక్కసారి వెర్రికేకపెట్టి ఏడవాలనిపిస్తోంది. తోటంతా సర్వనాశనం అయింది. ఏం తినాలి! మళ్ళీ ఎంత డబ్బు ఖర్చుచేస్తే — ఎంత శ్రమపడితే మామూలు స్థితికి వస్తుందీ తోట. భగవంతుడికి తనంటే ఎందుకింత కసి! ఏం

చేసిందని తను ? ఎటువైపు వెళ్ళినా ఈ విధంగా క్రూరంగా నవ్వుతున్నాడు. కళ్ళనిండా నీళ్ళు నిండి వెచ్చగా బుగ్గలమీదకి కారసాగినాయి.

ఉన్నట్టుండి ఫెళఫెళా విరిగిపడ్డ చప్పుడు విన్పించింది భయంకరమైన శబ్దం ఏమిటో తెలియని సంధ్య కెవ్వుమని మంచానికి కరుచుకు పోయింది. ఒక్కసారిగా వాన జల్లు వచ్చి విసురుగా సంధ్య మీద పడి యింకా యింకా తడి పేస్తోంది. సంధ్య మెల్లగా తలెత్తి చూసింది. అటువైపు యిల్లంతా కూలిపోయింది. లేచి అక్కడినుంచి బైటకి పారిపోవాలని ప్రయత్నించింది కాని సూదుల్లా వచ్చి మీదపడుతున్న వర్షపు ధారలు కళ్ళు తెరవనివ్వలేదు. కాళ్ళు వణుకుతున్నాయి. లేవబోయిన సంధ్య మళ్ళీ కూలబడింది. కళ్ళమీదకి మత్తులాంటిది వస్తోంది. అది పూర్తిగా వశంచేసుకోక ముందే యిక్కడ నుంచి బైటకెళ్ళాలి. కూలిపోయిన యింట్లో ఒంటరిగా వుంది తను. ఇంకా కొద్దిసేపటిలో ఈ భాగం కూడా కూలిపోతుంది. ఏమాత్రం సందేహంలేదు. తను తక్షణం బైటకి పారిపోకపోతే దీని అడుగునపడి నలిగి ముక్కలవుతుంది. శరీరం నామరూపాలు లేకుండా నాశనం అవుతుంది. సంధ్య ఏమయిపోయిందో ఎవరికీ తెలియదు. ఎప్పుడో శిథిలమైన ఈ ఇల్లుని కదిలిస్తుంటే—ఏ ఎముకలో బైటపడితే అప్పుడు గుర్తిస్తారు. కళ్ళముందు క్షణంసేపు కదిలిన స్పష్టమైన ఈ ఊహాచిత్రాన్ని చూసి సంధ్య వణికిపోయింది. మరింత ఖంగారుతో లేచి పరుగెత్తాలనుకుంది. కాని శరీరం ఏ మాత్రం సహకరించలేదు. లేచి రెండడుగులు వేయబోయి తూలి మళ్ళీ మంచంమీద పడింది. పాతకాలపు కోళ్ళున్న మంచం. సంధ్య తల వెళ్ళి కోడుకి కొట్టుకుంది. 'అబ్బా!' అనటానికి పెదవులు తెరుచుకున్నాయి. కాని శబ్దం పైకి రానేలేదు. సంధ్యకి స్పృహ తప్పిపోయింది.

36

ఎంతసేపు అలా వుందో సంధ్యకి ఏ మాత్రం గుర్తులేదు. మెల్ల మెల్లగా నాలుగు మూలలనుంచి నీళ్ళు వచ్చి నిండితున్నాయి. ఆ నీటిలో ఆకులు, పిందెలు పువ్వుల్తోపాటు తన శరీరం కూడా తేలియాడుతోంది. ఉన్నట్టుండి ఒక్కసారి ఉధృతంగా గాలి వీచింది. అకస్మాత్తుగా నీళ్ళన్నీ అమితమైన వేగంతో ఎటో ప్రవహించటం ప్రారంభించినాయి. ఆ జాలులోపడి సంధ్య శరీరం కూడా కొట్టుకుపోతోంది. అయినా సరేభయం వేయటంలేదు. పైనుంచి హాయిగా

శాంతిగా వుంది. నీళ్ళన్నీ పెద్ద ఎడారిలోకి ప్రవహించి అక్కడున్న ఇసకలో యింకిపోయినాయి. దూది కంటే మృదువుగా, అతి మెత్తగా వున్న ఆ యిసకలో సంధ్య శరీరం బోర్లా పడివుంది- యెంత ప్రయత్నం చేసినా లేవలేకపోతోంది. నిర్జీవంగా వున్న ఆ ఎడారిలో వున్నట్టుండి ఓ చిత్రమైన కేక ఒకటి విన్పించింది. అది ఏమిటో ఎటువైపునుంచి వస్తోందో తెలుసుకోవాలని యావత్ శక్తినీ కూడదీసుకుని పెనుగులాడుతున్నా ప్రయోజనం లేకుండావుంది. విచిత్రంగా వున్న ఆ శబ్దం మెల్లిగా దగ్గరగా వచ్చి అది క్రమేపి సంధ్యా అన్న పిలుపుగా మారిపోయింది. ఎవరో వచ్చారు తనకోసం. ఎవరై వుంటారు? వాసా? వాసుకంఠంలో అంత గభీరత్వం యెక్కడుంది? మాధవా?— మాధవ్‌కి తనని పెత కాల్సిన పనేముంది. అయితే ఎవరు మరి? ఏమో! సంధ్యా అన్న పిలుపుతో దిక్కులు పెక్కటిల్లుతున్నాయి. మోదేశులమీద లేవబోయిన సంధ్య నీరసంతో మళ్ళీ బోర్లాపడిపోయింది. చుట్టూ సంధ్యా అన్న పిలుపు వేయికంఠాలతో విన్పిస్తోంది. 'ఇక్కడున్నాను. ఇక్కడున్నాను.' అనాలనుకుంది. కాని అనలేకపోతోంది. అర్థంగాని యీ అశక్తతకి సంధ్యకి కళ్లంబడి నీళ్ళు కారుతున్నాయి. సంధ్య కళ్ళమీదకి మసకమసకగా మళ్లీ మత్తులాంటిది వచ్చి ఆవరించుకుంది. అమ్మయ్య! చచ్చిపోతున్నాను. పర్వాలేదు. కాని, కాని, వాసు! వాసుకి చెప్పనే లేదు. ఇలా తను చచ్చి పోయినట్టు వాడికెలా తెలుస్తుంది? ఎవరు చెప్తారు. సంధ్య మనసు వాసు కోసం బెంగ పట్టుండగా యీసారి పూర్తిగా స్పృహతప్పి పోయింది.

మళ్ళీ మెలకువ కలిగే సరికి కళ్ల ముందు తెల్లటి వెలుగు కన్పిస్తోంది. అది సూర్యకాంతిలా తీక్షణంగా లేదు. వెన్నెలలా చల్లగా వుంది.

అయినా వెన్నెలకాదు ఆ లేత వెలుగులో అడవిపూలు కలకలలాడుతూ గాలికి ఊగుతున్నాయి. పక్షులు ఆకాశంలో పల్టీలు కొడుతూ వలయాలు, వలయాలుగా తిరుగుతున్నాయి. సంధ్యకి తనెక్కడుందో ఏం చేస్తోందో వూహించను కూడా వూహించలేనంత నీరసంగా వుంది కళ్లు తెరిచేసరికి "అక్కా!" అంటూ వాసు మీదకి వంగి ఆత్రంగా అడుగుతున్నాడు.

"వాసూ!"శూన్యంలోకి తడుముకుంటూ చెయిజాచింది.

"అక్కా! మెలకువ వచ్చిందా?"

"వాసూ! నిజంగా నువ్వేనా— లేక—"

'నిజంగా నేనక్కా! నేనే' వాసు కంఠం దుఃఖంతో పలికింది.

సంధ్యకి పూర్తిగా తెలివి వచ్చింది. వాను ప్రక్కలో దగ్గరగా కూర్చుని వున్నాడు.

'వానూ! నువ్వు-నువ్విక్కడికి ఎప్పుడువచ్చావు?-'

'అదంతా తర్వాత చెప్తాను. ముందు నువ్వు మందు వేసుకో.' వాను లేచి ప్రక్కనే టేబిల్ మీద వున్న మందు, మంచినీళ్ళు తెచ్చి యిచ్చాడు.

'వానూ! నువ్వు-నువ్వు-' సంధ్య చప్పున లేవబోయింది.

'లేవకు!' తలవైపునుంచి గంభీరంగా విన్పించింది. సంధ్య గడ్డం బాగా పైకెత్తి అటువైపు చూసింది. అక్కడ మాధవ్ మంచాన్ని పట్టుకుని నిలబడి వున్నాడు. క్షణం సేపు సంధ్య కళ్ళతో కలిసిన అతని కళ్ళలో ప్రపంచంలో వున్న ప్రేమానురాగాలు అంతా పోగుచేసి అక్కడ సంధ్య కోసం దాచిపెట్టినట్టు నిండుగా తొణికిసలాడుతున్నాయి అతని చూపులనుంచి కళ్ళు విడదీసుకున్న సంధ్య వెంటనే కనుబొమ్మలు ముడిచింది. మళ్ళీ వెనక్కు జారి మెల్లగా దిండుమీద తల ఆన్చుకుంది.

వాను మందుయిస్తూ 'వేసుకుంటావా?' అన్నాడు.

'వానూ!' సంధ్య కళ్ళు ఆశ్చర్యానందాలతో మెరిశాయి. వాను మళ్ళీ నడుస్తున్నాడు. అది మొట్ట మొదటిసారిగా చూస్తోంది తను. అక్కగారి కళ్ళలో ఆ భావాన్ని కనిపెట్టిన వాను 'చూశావా? నేను నడిచేస్తున్నాను. మొట్ట మొదటిసారి యిక్కడికి రాగానే స్పృహలేని నిన్ను చూసి ఎంత నీళ్లు కారిపోయానో! చూడు. ఎలా నడిచేస్తున్నానో!' అంటూ వాను గబగబా గది అంతా తిరగటం ప్రారంభించాడు.

'ఆ! ఆ! చాల్లే! ఎక్కువ అలసట పనికిరాదని డాక్టరు చెప్పలా?' మాధవ్ వారిస్తూ మందలించాడు.

'ఆల్రైట్ హుజూర్!' వాను బుద్ధిమంతుడిలా మానేసి వచ్చి సంధ్య దగ్గర కూర్చున్నాడు. మాధవ్

● ఒకాయన కంగారుగా ఫోన్ తీసి 2626 డయల్ చేశాడు. 'హల్లో. 2626 యేనా?' అని అడిగాడు.

'కాదు. ఇది 2627.'

'పోన్లెండిగాని, మీ పక్కింట్లో డాక్టర్‌గారుంటారు. కాస్త ఆయన్ని అర్జంటుగా మా యింటికి రమ్మనాలి.'

మూలంగా తన జీవితం నాశనం అయినా, అతని పశుత్వం మూలంగా స్త్రీగా పొందవలసిన సుఖాలకి శాశ్వతంగా దూరం అయినా ఇప్పుడిలా వానుని మళ్ళీ మనిషినిచేసి జీవితం ప్రసాదించి నందుకు సంధ్య మనసు కృతజ్ఞతతో మెత్తపడింది

కొద్ది సేపయ్యింతర్వాత మాధవ్ గదిలోంచి వెళ్ళిపోయాడు అతను వెళ్ళగానే వాను ఆత్రంగా ముఖం పెట్టి 'అక్కా! ఇంట్లో వున్న ఆ చిన్న కుర్రవాడు ఎవరు? మాధవ్ తన కొడుకు అంటున్నారు. నిజమేనా?' అని అడిగాడు.

సంధ్య మనసులో ఏర్పడిన మృదుత్వం వెంటనే కఠినంగా మారి పోయింది. రెప్ప వాల్చకుండా తమ్ముడివైపు చూడసాగింది,

'అక్కడికి తమాషా చేస్తున్నా రేమో అన్పించింది అనుమానం పట్టు లేక పెంపుడు కొడుకా అని కూడా అడిగాను. లేదు. స్వంత కొడుకే నా రక్తంలో రక్తం అన్నారు. అక్కా! ఇదెలా సాధ్యం. ఆయన కసలు పెళ్ళే కాలేదు. పిల్లలెలా పుట్టారు? స్వంత కొడుకు అంటే ఎలా నమ్మేది.'

'ఎందుకు నమ్మకూడదు?' గంభీ రంగా అంది సంధ్య.

'కాని అక్కా, మాధవ్‌లాటి మనిషి—'

'అలాటి వాళ్ళకి ఏదయినా సాధ్యమే. నువ్వు దాన్ని గురించి ఎక్కువ ఆలోచించకు.'

'అంతేనంటావా? అయితే నిజంగా కొడుకేనంటావా?-' ఈర్ష్యగా అడిగాడు వాను

సంధ్య ముఖం తిప్పేసుకుంది కుర్రాడిని చూసి సంధ్య వీడికెందు కింతబాధ! 'కాని-అక్కా! అసలు మాధవ్-'

'వానూ! నన్ను కొంచెం పడుకో నిస్తావా? నిద్రవస్తోంది.' అంది కొద్దిగా విసుగ్గా. 'అలాగే అలాగే. నిద్రపో, నేనిక్కడే కూర్చుంటాను.' అన్నాడు వాను.

తర్వాత అయాద్వారా జరిగిం దంతా తెలుసుకుంది సంధ్య ఎంత సేపటికి తను యింటికి రాకపోతే మాధవ్ వెతకటానికి వెళ్ళాట్ట. చివ రికి వెతికి వెతికి ఎక్కడా కన్పించక యింటికి తిరిగి వస్తుంటే దోవలో సంధ్య యిల్లు సగం కూలి కన్పిం చింది. తలుపులు తెరిచివున్నాయి. ఆత్రంగా లోపలికి పరుగెత్తికెళ్ళి చూస్తే అక్కడ సగం పడిపోయిన ఇంట్లో ఓ ప్రక్కగా వాము మంచం దగ్గర స్పృహ లేకుండా పడివున్న సంధ్య కన్పించిందిట. వెంటనే రెండు చేతులమధ్యా ఎత్తి ఇంటికి తీసుకు వచ్చాట్ట. వానలో తలా

అది బాగా తగవటంవల్ల స్వామి నియ్యా వచ్చింది. ఒకరోజు హైద్రాబాద్ తీసుకెళ్ళకపోతే లాభంలేదు అన్నంత ప్రమాదం అన్పించింది. ఆ రోజు చూసి తగ్గకపోతే మర్నాడు తీసుకువెళ్ళే ఏర్పాట్లు చేశారు. కాని ఆ అవసరం రానే లేదు. తగ్గుముఖం పట్టింది జ్వరం వాను అక్కగారికి సుస్తీ చేసిందని తెలియగానే ఇంటికి వచ్చేశాడు. జ్వరం తీవ్రంగావున్న నాలుగైదు రోజులూ రాత్రిపూట మాధవ్ తనే స్వయంగా మేలుకుని దగ్గర కూర్చుని మందులవీ యిచ్చాట్ట. అంత జ్వరంలో కూడా సంధ్య అతన్ని అసహ్యించుకున్నట్లు మాట్లాడేది. మందు తాగనని తోసేసేది దగ్గర కూర్చున్న మాధవ్‌ని గుప్పెళ్ళు బిగించి గుద్దింది. ఇదంతా చూసి ఆయా, వాను భయపడుతుంటే "ఏంలేదు. జ్వరతీవ్రత. ఖంగారుపడకండి" అని ధైర్యం చెప్పాట్ట. ఒక్క నిముషం కూడా అతను సంధ్య మంచం వదల్లేదు. మందు వేసుకోనని పళ్ళు బిగించి పెనుగులాడుతున్న సంధ్య ప్రక్కలో కూర్చుని ఒళ్ళోకి లాక్కుని బలవంతంగా మందు త్రాగించటం అతనికి ఒక్కడికే సాధ్యం అయింది. ఇవన్నీ ఆయా నోటినుంచి వివరంగా వింటుంటే సంధ్యకి సిగ్గుతో ప్రాణం పోయినంత పనయింది.

37

సంధ్య కోలుకోటానికి ఎక్కువ రోజులు పట్టలేదు. పడిపోయిన యింటిని బాగుచేయాలంటే మిగతా భాగాన్ని కూడా కూలదోసి మళ్ళీ కట్టడం మంచిదని, లేకపోతే ఇంకోసారి యిలాటి వర్షం వస్తే ఈభాగం కూలుతుందని మేస్త్రి చెప్పాడు. మాధవ్ రోడ్డు దగ్గరగావున్న తన స్థలంలో చిన్న డాబా వేయించటానికి ప్లాను గీయించాడు. ఇల్లు కట్టటానికి డబ్బులేదు అందుకే స్థలం లేకపోయినా సంధ్య తప్పనిసరిగా ఆయాచేత ఇంతవరకు మాధవ్ ఆ ఇంటిని కొనుక్కోవటం విషయం గుర్తుకు తెచ్చి అడిగించింది. మాధవ్ ఒప్పుకున్నాడు. కాని అతను గీయించిన ఆ ప్లాన్‌కి, కట్టబోతున్న ఇంటికి తను అమ్మిన ఇంటిపైకం ఓ మూలకి కూడా రాదని సంధ్యకి తెలియదు. మాధవ్ చెప్పదలుచుకోలేదు.

ఎంత లేదన్నా ఇల్లు కట్టాలంటే నాలుగైదు నెలలకి పైనే పడుతుంది. కాని ఎక్కువ పట్టదు. ఈ వ్యవధిలో మాధవ్ ఇంట్లో వుండటంకంటే వేరు గత్యంతరం ఏమీ కన్పించలేదు. ఈ విధంగా పరిస్థితులన్నీ మూక వుమ్మడిగా ఎదురునిలిచి సంధ్యని బలవంతంగా మాధవ్ వైపు నెట్టటం ప్రారంభించాయి.

ఆయాకి బాబు అంటే రాను రాను ఇష్టం అధికం కాసాగింది. వాడి చిన్నతనం చేష్టలు, వచ్చీరాని వసి మాటలు, అల్లరి అందర్నీ ఆకర్షిస్తున్నా సంధ్యని మాత్రం ఆకర్షించటంలేదు బాబుకి తల దువ్వటం, స్నానం చేయించి బట్టలు వేయటం, వేళపట్టున భోజనం తిన్పించటం ఇవన్నీ ఆయా తనే స్వయంగా చూస్తోంది. అంతే కాదు గోవిందు భార్యని వంటపని మాన్పించి ఆ భారం కూడా తన మీదనే వేసుకుంది. సంధ్య వద్దు చెప్పబోతే "నువ్వేవరుకో! ముగ్గురం పడి తింటున్నాం. ఈ మాత్రం చేయటం ఒక లెఖ్ఖకాదు" అని కసిరింది. ఆయా అప్పుడప్పుడు ఈ పన్లతో సతమత మౌతుంటే సంధ్య సాయం చేయటానికి వెళ్ళేది ఆయా బాబు పన్లు చూడమని పురమాయించేది వాడిని ముట్టుకోటానికి, ఆ పనులు చేయటా కి సంధ్య కెలాగో అన్పించేది. వాడి వంక భయంభయంగా చూసేది ఇవేవీ తెలియని బాబు ఎందుకో సంధ్యంటేనే యిష్టపడేవాడు. ఏదో విధంగా దగ్గర కెళ్ళాలని ఆరాటపడేవాడు.

కుర్రాడు అంటే మాధవకి యెంత అపరూపమో యింట్లో అందరికీ స్పష్టంగా తెలుస్తునే వుంది. వాసు మాత్రం ఈర్ష్యని దాచుకోలేక బైటపెట్టలేక సతమతమౌతున్నాడు.

ఆ రోజు— సంధ్య తన గదిలో కిటికీదగ్గర నిలబడి పరధ్యాన్నంగా బైటకిచూస్తోంది దూరంగా మామిడి చెట్లక్రింద, వాటి నీడలో నిలబడి వాసు గాలిపటం యెగరేస్తున్నాడు. ప్రక్కనే నిలబడి దారంవుండ పట్టుకున్న బాబు గాలిపటం చూపిస్తూ యేదో అడుగుతున్నాడు. వాసు విన్పించుకోలేదు బాబు వాసుచెయి పట్టుకుని గుంజి మళీఅడిగాడు వాసు విసుగ్గా కసిరాడు బాబు వెంటనే దారపువుండ క్రిందపారేసాడు. వాసు వున్నట్టుండి బాబు వీపుమీద టపటపమని గట్టిగా రెండు చరిచాడు. సంధ్య తెల్లబోయి చూస్తోంది బాబు వెంటనే యేడుపులంకించుకున్నాడు మాధవ్ యింట్లోనే వున్నాడు. పిల్లాడి యేడుపువింటే యింకేమైనా వుందా? సంధ్య చూస్తుండగానే యింతలో ఆయా అక్కడికి పరుగెత్తుకువెళ్ళింది. యేడుస్తున్న బాబుని యెత్తుకుని యేమిటి అని అడిగింది. వాడు ఓ చేత్తో కళ్లు నలుపుకుని యేడుస్తూనే యింకోచేత్తో వాసుని చూపించాడు ఆయా వాసుని అడిగింది. వాసు నిర్లక్ష్యంగా తల యెగరేసి సమాధానంగా యేదో అన్నాడు. వెంటనే ఆయా వాసు రెక్క పట్టుకుని బరబరా లోపలికి యీడ్చుకు వచ్చింది. సంధ్యకూడా అదుర్దాగా బైటికి వచ్చింది.

(సశేషం)

తారా బలం

ఆ రోజు ఆదివారం. అయినా ఊళ్ళోకి వెళ్ళడానికి - సంతోషంగా తిరగడానికి అవకాశం కనిపించలేదు. ఏం చెయ్యడానికీ తోచక గదిలో పచారు చేస్తున్న సమయంలో నా కంటికి - ఆశా రేఖలా - పంచాంగం కనిపించింది. పంచాంగం తెరిచి చూస్తున్నాను. సరిగా అదే సమయంలో గోపాలం తుఫానులా నా గదిలో ప్రవేశించాడు.

'ఐదు గంటలు దాటిపోయింది. ఈ దిక్కుమాలిన గదిలో ఏం చేస్తున్నావు?' అన్నాడు వస్తూనే.

నేను జవాబు చెప్పేలోగా నా చేతిలో పంచాంగం లాక్కుని చూసి ఆశ్చర్యపోయి 'ఏమిటి నువ్వు చేస్తున్నది? పంచాంగం ఎందుకు చూస్తున్నావు?' అన్నాడు.

'కూర్చో చెబుతాను!' అన్నాను స్తిమితంగా.

'కూర్చోను— నీ అసలు రంగు యీవేళ బయట పడింది. నువ్వు మోసగాడివి! దగాకోరువు! అవకాశవాదివి!' అన్నాడు గుక్క తిప్పుకోకుండా!

'అదేమిటి?' అన్నాను తెల్లబోయి.

'ఇదివరకు నువ్వేం చెప్పావు? నీకు తారాబలం మీద, గ్రహబలం మీద నమ్మకం లేదన్నావు. పంచాంగం చూస్తూ తిథి వార నక్షత్రాలు లెక్కపెట్టే వాళ్ళంతా కాలాన్ని వృధా చేస్తున్నారన్నావు. సెంటిమెంటు అన్నావు. పిచ్చి నమ్మకం అన్నావు అర్థమైన కూతలూ కూశావు. ఇప్పుడు నువ్వు చూస్తున్నది పంచాంగం కాదా? నువ్వు చేస్తున్నది మీనమేషాలు లెక్కపెట్టడం కాదా?'

అతని ధోరణికి నాకు కోపం వచ్చిన మాట నిజమే! అయినా కొంచెం తమాయించుకొని 'నీగొడవేదో నీదేకాని నా మాట వినవేమిటి?' అన్నాను.

'వినను! ఎంతమాత్రం వినను! నువ్వు అభుద్యదయ వాదివి అని మనవాళ్ళంతా అనుకుంటున్నారు. నీ కథా, నీ పంచాంగం కథా కనిపించిన వాడికల్లా చెబుతాను — నువ్వు అభ్యుదయవాదుల్లో 'రివిజనిస్టు' వని వూరూవాడా పబ్లిసిటీ యిస్తాను. నీకు పోటీ పార్టీ పెట్టిస్తాను.'

జేబులో డబ్బులులేక నిరుత్సాహంతోవున్న నా మీదికి 'పులిమీద పుట్ర' లాగ గోపాలం వచ్చాడు.

తన్ని గెంటేద్దామన్నంత కోపం వచ్చింది. కాని కొన్ని వ్యవహారాలలో గోపాలం చాలా గొప్పవాడు కనక మంచి మాటలతో అతని అపోహ తొలగించక తప్పలేదు.

"గోపాలం నేను పంచాంగం చూస్తున్న మాట నిజమే. ఒప్పుకుంటున్నాను." అన్నాను.

ఇదే మరొకళ్ళయితే నామాటకు కొంత మెత్తబడి వుండేవాడు. కాని గోపాలం అలాంటి బాపతు కాదు.

"ఎవడికోసం ఒప్పుకుంటావు?" అన్నాడు ముఖంమీద గుద్దినట్టు.

"మా యింటి యజమాని రామ్మూర్తి నీకు తెలుసుకదూ?"

"ఎందుకు తెలియదూ? ఈ మహాపట్నం మొత్తంమీద డబ్బున్న పదిమందిలోనూ ఒకడు. లాభం కోసం ఎంత తక్కువరకం వ్యాపారం అయినా చేయించగల సమర్థుడు. మున్సిపల్ కౌన్సిలర్. అందమైన ఆడవాళ్ళన్నా - కుక్కపిల్లలన్నా - పబ్లిసిటీ అన్నా అతనికి మహా మోజు- అతని పేరు రెండుసార్లు నువ్వు పేపర్లో వేయించావు కనక నువ్వంటే అతనికి యిష్టం!"

క్షణంలో రామ్మూర్తిగారి రేఖాచిత్రం గీసి చూపించాడు గోపాలం.

గోపాలం! నువ్వు ఎంత తిట్టినా నాకు రామ్మూర్తి అవసరం చాలా వుంది. నాకు డబ్బు ఎప్పుడు కావలిసి వచ్చినా అతను సహకాడు. లేదని అనడు. అతనికి బోల్డు వ్యాపకాలు వున్నాయి. నాకు అవసరమైనప్పుడు యింటిలో దొరకడు అందుకే నేను పంచాంగం కొనుక్కోవాసి వచ్చింది" అన్నాను.

"ఏడిసినట్టేవుంది. అతను ఇంట్లో దొరక్కపోవడానికి - నువ్వు పంచాంగం కొనడానికి సంబంధం ఏమిటి? నువ్వు చెప్పిన దానికి తాడూ బొంగరం ఏమైనా వుందా?"

"ఉంది. సంబంధం వుంది. కనకే కొన్నాను. రామ్మూర్తికి తిథి వార నక్షత్రాల మీద చాలా నమ్మకం వుంది. మంచి రోజున మంచి ముహూర్తంలో అతనెప్పుడూ ఇంటి దగ్గర దొరకడు. ముఖ్యమైన పనుల మీద వెళ్ళిపోతూ వుంటాడు. నాకు డబ్బు అవసరమైనప్పుడు నేను తప్పకుండా పంచాంగం తెరిచి చూడవలసిందే. తిథి మంచిది కాని రోజున దుర్ముహూర్తంలో వెళ్ళితేనే నాకు రామ్మూర్తి దర్శనం అవుతుంది. లేకపోతే ఆయన దర్శనం అవదు సరికదా! రానూ పోనూ టాక్సీ ఖర్చవుతుంది. నేను పంచాంగంచూడ్డానికి కారణం యిప్పటికైనా తెలిసిందా?" అన్నాను.

"అందరూ మంచి ముహూర్తాల కోసం పంచాంగం చూస్తే నువ్వు దుర్ముహూర్తాలకోసం చూస్తావా? ఇది నమ్మ వలసిన మాటేనా?" అన్నాడు.

వెంటనే నేను అతని చేతిలో పంచాంగం లాక్కొని "ఇదుగో,



చూడు! ఈవేళ ఆదివారం, అమావాస్య. వర్షం నాలుగున్నర నుంచీ వుంది – ఇప్పుడు టైమెంత యింది?' అన్నాను.

'ఐదు' అన్నాడు.

'అంటే యిప్పుడు మంచి దుర్ముహూర్తమన్నమాట! — పద! రామ్మూర్తిగారి యింటికి వెళదాం. నాకు పనీ అవుతుంది నీకు రుజువూ దొరుకుతుంది.'

'అయితే తప్పకుండా చూడవలసిందే. కానీ నేను నీ దగ్గరకి మరో అర్జంటు పని మీద వచ్చాను' అన్నాడు. 'ఆ పని తరవాత చూద్దాం, ముందు నడు.' అన్నాను,

ఇద్దరం కలిసి రోడ్డెక్కాం. గోపాలం చుట్టూ ఒక్కసారి చూసి 'వెధవ్వూరు! ఒక్క టాక్సీ కనపడదు. ఉన్న టాక్సీలన్నీ రైలుస్టేషను దగ్గరే తగులబడతాయి' అన్నాడు.

'నీ జేబులో ఏమాత్రం డబ్బుంది?' అన్నాను.

"డబ్బా? — డబ్బుకేముంది?" అన్నాడు. అంతే కాని తన జేబులో డబ్బు లేదని మాత్రం ఒప్పుకోలేదు.

అసలు గోపాలం స్వభావమే అంత. తన జేబులో కనీసం పది పైసలు లేకపోయినా—పది లక్షల ఆస్తిపరుడిలా కనిపిస్తాడు. అలాగే మాట్లాడతాడు అతని ముఖంలో నిరుత్సాహం అన్నది కనిపించదు. ఎంతటి పిసినిగొట్టునయినా, పరమ కర్కోటకుణ్ణయినా మాటలతో యిట్టే బోల్తా కొట్టించెయ్యగలడు అలాగని అతన్ని మహా మేధావి అనుకోగలరు. కొన్నిరంగాలలో ఉత్త అమాయకుడు. పైకిమాత్రం తెలియని వాడిలా కనిపించడు నాటకం, నృత్యం, సంగీతం, సినిమా, చిత్రలేఖనం— మీరు దేని గురించయినా మాట్లాడండి వెంటనే అతను కలగజేసుకొని— లేదా మిమ్మల్ని మాట మధ్యలోనే ఆపు చేసి— ఆయా కళలమీద తన అమూల్యాభిప్రాయాలు తెలియ చేసి—మిమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చెయ్యగలడు. అతను పత్రికారచయితలలో పత్రికారచయిత, నటులలో నటుడు, కవులలో కవి, సినిమాప్రొడ్యూసర్లలో ప్రొడ్యూసర్, యిన్ని రంగాలలో యీవిధంగా చెలామణీ కాగలిగిన వాణ్ణి నేనయింతకుపూర్వంఎక్కడా చూళ్లేను.

పదిమంది చేరి ఒక సమాజంపెడితే దానిలో గోపాలానికి తప్పకుండా ఒక స్థానం వుంటుంది. ఒకవేళ సదరు సమాజంవాళ్లు యితనిని వర్జించుకోకపోయినా— యితనుపూరుకోడు. తనంతటతానే ప్రవేశం సంపాదించుకోగలడు. ఈ పట్నంలోని ప్రతి సాంస్కృతిక సమాజతోను గోపాలానికి అంతో యింతో సంబంధం వుంది. అలాగని గోపాలం చాలా పలుకుబడి కలవాడని మీరు అనుకోగలరు. ఇతను అడుగుపెట్టిన ప్రతి సమాజంలోను సంవత్సరం తిరక్కుండా పేచీతెచ్చుకోవడం— యివతలకు రావడం జరుగుతూ వుంటాయి. "ఇతను ఏసమాజంలోనూ నప్పక పోవడానికి కారణం యేమిటి?" అని మీరు అడగవచ్చు. కాని అతనికీ నాకూ మైత్రీ సంబంధాలు తెగిపోకుండా వుండాలంటే నేను జవాబు చెప్పకూడదు.

నాలుగు అడుగులు ముందుకు వేసేసరికి మాకు "సరసు" ఎదురొచ్చాడు. వస్తూనే గోపాలాన్ని నిలదీసి "ఏమిటి మహానుభావా? ఎక్కడా దర్శనాలు లేవు" అన్నాడు.

"ఈ మధ్య వూళ్ళో లేను. నిన్నే బొంబాయి నుంచి తిరిగొచ్చాను.— మళ్ళా కలుసుకుందాం!" అని గోపాలం అతన్ని వదిలించుకోబోయాడు.

"మీకు పనిలేని దెవ్వడు? నామాటకు మర్యాదగా జవాబు చెప్పి వెళ్ళండి" అన్నాడు సరసు సీరియస్‌గా! "ఏం జవాబుకావాలి? కోపంతో అడిగాడు గోపాలం.

అంగర సూర్యారావు

"అదే! మన పుస్తకం ఎందాకా వచ్చింది?"

"ఇంకా ఏం లేదు. కొనసాగొచ్చేసింది. ఇప్పుడు అచ్చు ఆఫీసులో వుంది. తర్వాత మాట్లాడదాం. వస్తాను." తిరిగి తప్పించుకోడానికి ప్రయత్నించాడు. కానీ సరసు జీడిలా పట్టుకొని వదలలేదు

"ఏ అచ్చాఫీసు?" అన్నాడు.

"పట్నంలో — ఎంత ఖర్చయినా అక్కడే వేయించాలి. ప్రెస్సుకు రెండువందలు అడ్వాన్సు యిచ్చాను. టైటిల్ పేజీకి మరో రెండువందలు యిచ్చాను. డబ్బు చాలేదు. —వచ్చే వారం జనరల్ బాడీ సమావేశం వుంది మీకందరికీ ఇన్విటేషన్ వస్తుంది. తప్పకుండా రండి."—అంటూ గోపాలం ముందడుగు వేశాడు. రొండడుగులు దాటిన తరువాత వెనక్కి తిరిగి చూశాను సరసు అక్కడే నిలబడి వున్నాడు.

ఇక్కడ సరసు గురించి రెండు మాటలు చెప్పడం అప్రస్తుతం కాదనుకుంటాను. "సరసు" అన్నది కలం పేరని మీరు యీపాటికి తెలుసుకుని వుంటారు మొదట అతని కథలు చాలా పత్రికలలో కనిపిస్తూ వుండేవి. "సరసు అంటే రచయిత్రి అనుకొని అతని కథల్ని పత్రికలు ప్రచురించేవి" అని కిట్టనివాళ్ళంటారు.

నాకు సరసు ఎదురయినప్పుడు 'శ్రీశ్రీ' సూక్తి జ్ఞాపకం వస్తూ వుంటుంది. 'కదిలేదీ కదిలించేదీ కవిత్వం" అన్న సిద్ధాంతాన్ని సరసు ఒకసారి రుజువు చేశాడు ఇతను రాసిన ఒక శృంగార కథ కొందరు పాఠకులను కదిలించి కోర్టుకు తీసుకు వెళ్ళింది — అంతేకాక యితని కథ పత్రికలో ఎప్పుడు అచ్చుపడినా—సదరు సంపాదకులకు దేశంలోని ఏదో ఒక మూలనుంచి ఉత్తరం వస్తూ వుండేది. ఇతని రచన ఫలానా భాషలో ఫలానా రచనకు అనుసరణ అనో . లేకపోతే మక్కికి మక్కి కాపీ అనో ఆ ఉత్తరాల సారాంశం.

ఇవేకాక యింకా అనేక కారణాలవల్ల 'సరసు' రచనా రంగంలోంచి నిష్క్రమించి ప్రస్తుతం అజ్ఞాతవాసంలో వున్నాడు. ఈ బాపతు ఫెయిల్యూర్ కథకులను కొందరిని చేరదీసి—వాళ్ళదగ్గరే డబ్బు వసూలుచేసి ఒక ప్రచురణ సంస్థ ప్రారంభించాడు గోపాలం. కథకుల జాబితాలోంచి నా పేరు ఏందుకో తొలగించారు కనక నాకా సంస్థలో చేరవలసిన బెడద తప్పిపోయింది.

ఇక్కడ చిత్రమేమంటే—గోపాలం యింత వరకూ ఆ కథ సంపుటి అచ్చుకు యివ్వలేదు. మరి నూలు చేసిన డబ్బంతా యేమయిందంటారా? దానికి జవాబు భవిష్యత్తే చెప్పాలి!

'ఏమండోయ్ గోపాలంగారూ! ఎక్కడా... కనిపించడమే మానేశారు!'

ఎదురుగా శంకర్ కనిపించాడు. శంకర్ అంటే ఉత్తర హిందూస్తానీ వాడు అనుకోగలరు. ఆధునిక పత్రికా సాహిత్యంలో కనిపించే ఒక సజీవ పాత్ర శంకర్

శంకర్ణి చూడగానే గోపాలం ముఖభంగిమలో రవంత మార్పు వచ్చింది. అయినా మామూలు ధోరణిలో 'ఈ మధ్య వూళ్లో లేను,' అన్నాడు.

'అందులో కొత్త యేముంది? మీరు ఏదైనా బ్రహ్మాండమైన ప్రోగ్రాం జరిపించిన తరవాత కొన్నాళ్ల పాటు అజ్ఞాత వాసం చేస్తారు.' అన్నాడు శంకరం.

'అజ్ఞాతవాసం చెయ్యవలసిన ఖర్మ నాకెందుకొస్తుంది? — కొద్ది రోజులు రెస్టు — అంతే — వస్తాను. తర్వాత కలుసుకుందాం' అంటూ గోపాలం అతన్ని తప్పించుకోబోయాడు.

'తర్వాత కలుసుకోవలసిన పని నాకేం లేదు. ముందు అడిబ్బేదో

యిక్కడపెట్టి — నిక్షేపంగా — వెళ్ల వచ్చు." అన్నాడు శంకరం

"ఎకౌంట్లుతేలగానే యిచ్చేస్తాను."

"అసలు మీ ఎకౌంటు తేలడం అంటూ వుంటుందా?"

"అదంతా అనవసరం. నీకు కావలిసింది డబ్బు — రెండు రోజుల్లోవచ్చి పట్టుకు పో! — అంతే!"

శంకరాన్ని తప్పించుకొని ముందుకు నడిచాడు గోపాలం దారిలో అడిగాను "అతనికి నువ్వెందుకు డబ్బివ్వాలి?"

"అదంతా ఒక తమాషా! — వాడికి తానొక గొప్ప గాయకుణ్ణని నమ్మకం, — ఆమధ్య నేను సినిమాతారలతో 'నాట్య ప్రదర్శనలు' ఏర్పాటు చేయించాను చూశావూ — అప్పుడు శంకర్ నా దగ్గరకొచ్చి — సంగీత దర్శకత్వం తనకు యిప్పించమని ప్రాధేయపడ్డాడు. సరేలే చూద్దాం. అన్నాను కానీ నన్ను వదలందు అంతలో నాకు ఐదువందలు అర్జంటుగా కావలసి వచ్చాయి ముందు డబ్బిస్తేకాని హాలు రిజర్వు చెయ్యనన్నాడు ప్రొప్రయిటర్. అప్పుడు మరో దారిలేక శంకర్ దగ్గర ఐదు వందలు అప్పు పుచ్చుకొన్నాను." అన్నాడు గోపాలం

"పోనీ సంగీత దర్శకత్వమైనా శంకర్‌కు దక్కిందా?"

"వాడితలకాయ వాడి బతుక్కి సంగీత దర్శకత్వం ఒకటా?"

"అతను సంగీతం తెలిసిన వాడే కదా? — ఆమధ్య సినిమాల్లోకి కూడా పోయివచ్చాడు"

"అదంతా ఒక ఫార్సలే — రెండువేలకుపైగా పట్టుకొని పట్నం వెళ్లాడు. — అందరి చుట్టూ తిరిగి ప్రాధేయపడితే చివరకు ఒక ఛాన్సు దొరికింది అదయినా ఏమిటనుకున్నావు? — వీడేం పాట పాడక్కరేదు. — ప్రఖ్యాత నేపథ్యగాయని ఒకావిడ పాట పాడుతూ వుంటే — వీడు మధ్యలో — అహో! అహో! — ఓహో! — ఓహో! 'అని రాగం తీయడం. వీడు తీసే రాగంలో 'కుయ్యో మొర్రో!' లాంటి అరుపులూ కూతలూ మినహాయిస్తే పాటే లేదు రెండువేలూ అయిపోగానే వెనక్కి వచ్చేశాడు ఇప్పుడు మన బస్తీ మొత్తానికి శంకర్ ఒక్కడే సంగీత దర్శకుడు. బోధపడిందా?" అన్నాడు హేళనగా గోపాలం.

• *"ఏంహోయ్ మైడియర్ షేక్స్‌పియర్! మొహం వేళ్ళాడేశావ్?"*

"ఏముంది? మా ఆవిడా నేనూ దెబ్బలాడుకున్నాం. రెణ్ణెల్లదాకా రానని చెప్పి పుట్టింటికి పోయింది."

"నీకే మంచిదిగా?"

"ఇవాళ్టికి రెణ్ణెల్లు అయిపోయిందోయ్ బాబూ."

నాకు శంకరంమీద జాలి కలిగింది. పాపం! అతని బలహీనత కనిపెట్టి చాలా మంది అతని దగ్గర డబ్బు కాజేస్తున్నారు. — అతనికి ఒక కళ మీద వున్న అచంచల విశ్వాసం కూడా నన్ను కదిలించింది.

తిన్నగా మాకు ఎదురునస్తున్న షావుకారు నరసయ్యను చూడగానే గోపాలం 'ఏమిటి? యివేళ అన్నీ దుశ్శకునాలే వస్తున్నాయి?' అని విసుక్కున్నాడు.

అంతలోనే నరసయ్య 'ఏమయ్యోయ్! గోపాలం ఇంకఆసొమ్ముకనీళ్ళధారేనా?' అన్నాడు సమీపిస్తూ.

'నీళ్ళధార యెందుకు? నిక్షేపంగా పట్టుకుపోవచ్చు!' తేలిగ్గా జవాబు చెప్పాడు గోపాలం

'నీ దగ్గరేముంది పట్టుకుపోడానికి?— రోగానికి రొక్కం లాగే కావు.— మాతృరోజీ బుక్కులో వేసి మూఅద్వాచఫీసులో పన్నిడొందలు అరువెట్టావు' అన్నాడు నరసయ్య ఆయాసపడుతూ!

'పన్నెండు వందలకీ పూచీనాది కాదు. అది అసోసియేషన్ వాళ్ళ బాధ్యత! నేను సెక్రటరీ పదవికి రాజీనామా యిచ్చేశాను —యిప్పున్నసెక్రటరీకి నోటీసు యివ్వండి — మీదగ్గర పుచ్చుకున్న రెండువేలు మాత్రం నేను యిచ్చేస్తాను'

'నువ్వు యివ్వడం—నేను పుచ్చుకోడమూను! —యీ రెండూ జరిగేవేనా అంటూ!— డబ్బు నీకుతోచినప్పుడు యిద్దూగాని— ముందు ఒక నోటు రాసియ్యి.— అవి ఎంత చప్పున చేస్తే అంతమంచిది.' అన్నాడు నరసయ్య

'అలాగన్నారు. బాగుంది, రేపు వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను.'— అంటూ ప్రరోగమించాడు గోపాలం.

మేం బస్సులో రామ్మూర్తిగారి యిల్లుచేరుకోనేలోగా చిన్న చిన్న సంఘటనలు కొన్ని జరక్కపోలేదు. అయినా అవి చెప్పుకోతగ్గవి కావు.

అంతపెద్ద భవనంలో కేవలం నలుగురేవుంటున్నారని నేను చెప్పినప్పుడు గోపాలానికి సృష్టికర్తమీద చాలా కోపం వచ్చింది.

'చూడు, మనలాంటి వాళ్లం ఒకొక్క గదిలోనూ నలుగురం యిరుక్కు చస్తున్నపుడు—పాతిక గదులున్న యిలాంటి మేడలో కేవలం నలుగురు వుండడం — స్వార్థం-ద్రోహం!' అన్నాడు గోపాలం.

'నిజమే! నేనూ ఒప్పుకుంటాను. రామ్మూర్తికి ఒక సిద్ధాంతంకాని — ఒక పార్టీ కానీలేవు.కనక అతనికి స్వార్థం వుండడంలో మనం ఆశ్చర్య పడవలసిన అవసరంలేదు. — మరి పెద్ద పదవుల్లో వుంటూ — త్యాగాల గురించి మాట్లాడే మన రాజకీయ వేత్తల ఐశ్వర్యం మాటేమిటి?—మనం యీ యింట్లోకి వెళ్లి పని పూర్తిచేసుకొని తిరిగి వచ్చేవరకూ స్వార్థం గురించి మాట్లాడకు — ఆ తరువాత

నీయిష్టం—తెల్లవార్లూ మాట్లాడుదువు గాని' అన్నాను.

ఇంద్రభవనంలా వున్న ఆ మేడలో అడుగు పెట్టేసరికి గోపాలానికి మతిపోయినంత పని జరిగింది. ఒక మ్యునిసిపల్ కౌన్సిలర్ యింట్లో— రకరకాల నాట్యభంగిమలలో వున్న చిత్రాలు కనిపిస్తాయని అతనెప్పుడూ వూహించి వుండడు. గోడల మీదవున్న చిత్రాలను పరీక్షిస్తూ హాలులో తిరుగుతున్నాడు. నేను అక్కడే కుర్చీలో కూర్చొని గోపాలం ధోరణి గమనిస్తున్నాను. — అతను హాలు చివరకు వెళ్లేసరికి ఒక అల్సేషియన్ కుక్క — యిలు ప్రతిధ్వనించేలా మొరుగుతూ— అతనికి ఎదురు వచ్చింది. కళ్ళుమూసి తెరిచేసరికి—ఆ కుక్క నాలుగుకాళ్ళూ పైకెత్తి గోపాలం మీదికి దూకడం—నౌకరువచ్చి కుక్కను పట్టుకు పోవడం రెండూ జరిగాయి. ఈ సంఘటనతో గోపాలంలోని కళాభిమానం తాత్కాలికంగా ఆగిపోయింది. అతనికి స్వల్పమైన గాయం తగిలింది.

'ఇప్పుడు నీకు రోజులేం బాగా లేవు' అన్నాడు కుర్చీలో కూర్చుంటూ గోపాలం.

'కుక్క కరిచినంత మాత్రాన రోజులు చెడిపోయాయా?' అన్నాను.

'అదికాదు. జనవరి వరకూ నాకు తారాబలం అనుకూలంగాలేదు. ఈలోపున నేను ఏపని చేసినా ఆటంకాలు వస్తాయి' అన్నాడు.

'పిచ్చనమ్మకం!'

'అలా కొట్టిపారెయ్యడానికి వీల్లేదు.'

'తారాబలం సరిగ్గా లేదని నమ్మి చేసే పనుల్ని వాయిదా వేసుకోవడం పిరికితనం, తెలివితక్కువకూడా. — యీ దేశంలో జన్మ నక్షత్రం తెలియని మనుషులు ఎన్ని కోట్లమంది వున్నారో నువ్వెప్పుడైనా వూహించావా?'

'అది వాళ్ళ దురదృష్టం' అన్నాడు గోపాలం తడుముకోకుండా. 'అది దురదృష్టం కాదు, అదృష్టం!'

'ఎందుకని?'

'జన్మ నక్షత్రం తెలియదు కనుక వాళ్ళకు కాలాన్ని వృథా చేసుకోవలసిన అవసరం వుండదు. మీనమేషాలు లెక్కపెడుతూ — చెయ్యవలసిన పనుల్ని వాయిదా వేసుకుంటూ— రాబోయే మంచిరోజుల కోసం ఎదురుచూస్తూ కూర్చోవలసిన అవసరం వాళ్ళకులేదు.'

'గ్రహబలం సరిగా లేనప్పుడు

● *"ఆవిడ కెన్నేళ్లుంటాయంటావ్ ?"*

"అసలు యాభై. నలభై ఏళ్ళదానిలా కనిపిస్తుంది. ముప్ఫయ్యేళ్ళని తను అనుకుంటుంది. ఇరవయ్యేళ్లదానిలా ముస్తాబు చేసుకుంటుంది. పదేళ్ళ పిల్లలా ప్రవర్తిస్తుంది."

చేసిన ప్రతిపనీ దెబ్బతింటుంది.— కావాలంటే పరీక్ష చేసిచూడు.' అన్నాడు

అదే సమయంలో తిన్నగా వున్న డోర్ కర్టన్ తొలగించి— శ్రావ్యమైన కంఠస్వరతో 'ఓ! మీరా!— మీరువచ్చి ఎంతసేపు అయింది?' అంది తెలుగు సినిమాలోని స్త్రీపాత్ర లాంటి ఓ నవయౌవని!

'మేం యిప్పుడేవచ్చాం!—మేం రాగానే మీకుక్కవచ్చి మమ్మల్ని పరామర్శించి వెళ్ళింది.' అన్నాను.

'లిలీకి మీరు తెలుసు!— అది మీజోలికిరాదు!'

'కానీ మాగోపాలాన్ని అది ఎరుగదు కదా?' అన్నాను నవ్వుతూ!— ఆమె ముఖంలో మార్పుకపించింది. వెంటనే 'మీనాన్నగారు లేరా శ్యామలా?' అన్నాను.

'ఉన్నారు. నాన్నగారితో చెప్పి వస్తాను.' లోపలికి వెళ్ళి పోయింది శ్యామల.

'రామ్మూర్తిగారి అమ్మాయేనా?' నెమ్మదిగా అడిగాడు గోపాలం.

'అవును.'

'చాలా చక్కటి విగ్రహం!' మెచ్చుకున్నాడు.

'నువ్వు కొద్దిక్షణాలపాటు విగ్రహాలనుగురించి— పర్సనాల్టీ గురించి మాట్లాడ్డం మానెయ్యాలి!' అన్నాను సీరియస్‌గా.

'ఇంతటి చక్కని చుక్కను చూస్తూ మెచ్చుకోకుండా ఎలావుండగలను?'

'మన దేశంలో పరాయిస్త్రీల అందాన్ని మెచ్చుకోవడం వంటికి అంత మంచిదికాదు.' అన్నాను.

'కొన్ని విషయాలలో నువ్వు శుద్ధ పూరకాలంమనిషివి' కోపం వచ్చిన గోపాలానికి— అంతలో ఏదో జ్ఞాపకం వచ్చిన వాడిలా "ఆగు! ఆగు! రామ్మూర్తి పెళ్ళాన్ని వదిలేశాడు కదా!— మరి ఈ యింటిలో వున్న ఆవిడ ఎవరూ!— ఇప్పుడు కనిపించిన చిన్నది ఎవరి కూతురు?" నన్ను నిలదీసి అడిగి తెలుగు సినిమాలోని డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌లా పోజు పెట్టాడు.

అతని ధోరణి నాకు నచ్చలేదు. "వాళ్ళ యింట్లో కూర్చుని వాళ్ళ కళంకంగురించే మాట్లాడుకోవడం చాలా దారుణం. అనాగరికం!— అమర్యాద!" అన్నాను.

"మనుషులలోని కల్మషాన్ని— పైకితీసి చూపించడానికి కలంపట్టిన— నీలాంటి రచయిత అనవలసిన మాట కాదని!" ముఖంమీద కొట్టినట్టు జవాబు చెప్పాడు.

"ఇక్కడ నువ్వు యిదే ధోరణిలో మాట్లాడితే విగ్రహాలవల్ల కలిగే చెడ్డఫలితాలను — నీతోపాటు నేను కూడా అనుభవించవలసివుంటుంది."

నేను విగ్రహాల ప్రసక్తి తీసుకురాగానే గోపాలం అగిపోయాడు. రామ్మూర్తి పట్ల గోపాలానికి

కలిగిన అనుమానంలో నిజం లేక పోలేదు. పెద్ద బంధువంతంగా కట్టి పెట్టిన భార్యను విడిచిపెట్టి యిరవై యేళ్ళనుంచీ రామ్మూర్తి యీ ద తోనే వుంటూ — 'జీన్‌పాల్ స్త్రాత్రే' సిద్ధాంతాలలో ఒకదాన్ని అమలు జరిపాడు. ఆ దగూతురే శ్యామల — ఆవయస్సులో వున్న అందరు పిల్లల లాగే శ్యామలకు అలంకరణ మీద మోజు ఎక్కువ. ఆమెలో అందం కంటే ఆకర్షణే హెచ్చు — ఎన్నడూ ఏ బెంగా ఎరగని రామ్మూర్తికి — యిప్పుడు పట్టుకున్న బెంగ 'యీ అమ్మాయికి పెళ్ళి చేయడం ఎలాగ!' అన్నది. ఈ ప్రసక్తి లోగడ మాయిద్దరి మధ్యా ఒకసారి వచ్చింది.

'ఈ రోజుల్లో — ఎవరో కొందరు రాజకీయ వేత్తలు మినహాయించి - కులంగురించి పట్టించుకొనే వాళ్ళు ఎవరూ లేరు — ఆ రాజకీయ నాయకులైనా — కేవలం వోట్లుకోసం — ఎలక్షన్లకోసం — పదవుల కోసం మాత్రమే కులవ్యవస్థను చచ్చిపోకుండా కాపాడుకుంటున్నారు. మీ శ్యామలవంటి అందమైన అమ్మాయికి పెళ్ళవడం యీరోజుల్లో కష్టమైనపనేంకాదు. వర్ణాంతరవివాహాలు చేసుకున్న వాళ్ళ పిల్లలకు ఎంతమందికి పెళ్ళిళ్ళు కావడం లేదు!'

నా మాటలకు రామ్మూర్తి సంతోషించాడు. నేను చెప్పింది నిజమే అంటూ ఒప్పుకున్నాడు.

శ్యామల వెనక కొంత మంది యువకులు తిరుగుతున్నారని మొదట తెలిసినప్పుడు రామ్మూర్తికి సంతోషం — భయం కూడా కలిగాయి. [illegible] ఒక కేసులో రామ్మూర్తి — ఒక రోమియోకి దేహశుద్ధి చేయించడం కూడా జరిగింది. రామ్మూర్తి చేతిలో డబ్బుంది.

ఊళ్ళో ప్రతి వార్డుకు ఒకయిల్లు వుంది. సంతపేట దగ్గర్నుంచి — ఒస్ రూట్లువరకూ బోట్లు వ్యాపారాలలో లక్షలకొద్దీ రూపాయలు నిత్యం ప్రవహిస్తూ వున్నాయి. — పూర్వం ఈస్టిండియాకంపెనీ వాళ్ళు వ్యాపార రక్షణకోసం సైనికుల్ని పోషించినట్టు రామ్మూర్తికూడా కొంతమంది రౌడీలను జాగర్త చేసి వుంచాడు. ఎన్నికలలో నిలబడే ప్రతి పెద్దమనిషీ రామ్మూర్తి సహాయాన్ని అర్థించడం రివాజు. రామ్మూర్తి బలపరచిన అభ్యర్థి గెలవడం తథ్యం.

రామ్మూర్తికి వున్న యిళ్ళలో—

● *'ఇదిగోనోయ్ నీకు పుట్టినరోజు కానుక.'*

'ఏమిటిది ?'

'ఉత్తరాలు చింపుకునేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ కట్టర్.'

'మా ఆవిడుండగా ఇంకా ఇది దేనికోయ్.'

ఒక యింట్లో ఒక భాగంలో నేను అద్దెకు వున్నాను. పట్నాలలో చీటికి మాటికి యిళ్ళ అద్దెలు పెరుగుతూ వుండడం అందరికీ తెలిసిన సంగతే — కానీ నా విషయంలో అందుకు వ్యతిరేకంగా జరిగింది — నామీద అతనికి ఎందుకు సదభిప్రాయం కలిగిందో తెలియదు. నేను అద్దె యివ్వడానికి వెళ్ళినప్పుడు కబుర్లలోకి దించి చాలా సేపు కూర్చోబెట్టేవాడు. సంవత్సరం తిరిగేసరికి నేను యివ్వవలసిన అద్దె సగానికి సగం తగ్గిపోయింది.

ఈ మహా పట్నంలో అవసరానికి అప్పు దొరకడం చాలా కష్టం — రామ్మూర్తి వల్ల నాకు యీ యిబ్బంది కూడా తొలగిపోయింది. నేను ఎప్పుడు ఎంతడబ్బు అడిగినా ఆయన లేదనకుండా యిచ్చేవాడు.— కానీ యిందులో మరో చిక్కు కూడా ఎదురయ్యేది. ఆయనకు అసంఖ్యాకంగా వ్యవహారాలున్నందువల్ల నేను వెళ్ళినప్పుడు ఆయన యింట్లో వుండేవాడు కాదు.

'ఆయన యింట్లో ఏ సమయంలో దొరుకుతారు? పనులమీద వెళ్ళే సమయాలు ఏవి?' అని ఒకసారి శ్యామలను అడిగాను. ఆమె కూడా సరైన సమాధానం చెప్పలేకపోయింది. వాళ్ళ నాన్నగారు పైకి వెళ్ళడానికి ప్రత్యేకించి వేళలంటూ ఏవీ లేవని చెప్పింది.

ఒకనాడు నేనూ రామ్మూర్తీ మాట్లాడుతున్న సమయంలో వాళ్ళ పురోహితుడు వచ్చాడు. రాబోయే వారం రోజుల్లోనూ వున్న మంచి తిధులు, సమయాలు — ఏ రోజున ఏదిశకు వెళ్ళవచ్చో - ఏదిశకు వెళ్ళకూడదో — వగైరా వివరాలన్నీ చెప్పి పురోహితుడు వెళ్ళిపోయాడు. ఆయన కేవలం పురోహితుడే కాదనీ — చిన్నప్పుడు కాశీ వెళ్ళి అన్ని శాస్త్రాలతో పాటు జ్యోతిశ్శాస్త్రం కూడా నేర్చుకువచ్చాడనీ - మూడు కాలాలకు సంబంధించిన జ్ఞానం క్షుణ్ణంగా తెలిసినవాడనీ — ఆయన పెట్టిన ముహూర్తాలకు తిరుగులేదని — రామ్మూర్తి చెప్పాడు.

దానితో ఆయనకు తారాబలం మీద చాలా నమ్మకం వుందని తెలుసుకున్నాను. మొదటిసారి కేలండరు ఒకటిచూసి — దుర్ముహూర్తంలో రామ్మూర్తిగారి యింటికి వెళ్ళాను. తక్షణం ఆయన దర్శనం అయ్యింది.

దుర్ముహూర్తాలలో రామ్మూర్తిగారి దర్శనం దొరుకుతుందన్న సంగతి — నా అంతట నేనే కనిపెట్టాను. గ్రహబలం మీద నాకు నమ్మకం లేకపోయినా — నేను ఆ విషయంలో ఆయనతో ఎప్పుడూ వాదించలేదు. వాదించాలంటే నాకు ఆధారాలు లేకపోలేదు. లోగడ ఒకసారి ఆయన శుభఘడియలలో ప్రయాణమై వూరు వెళుతూవుంటే ఆయన కారుకు యాక్సిడెంటు అయ్యింది. మరొక ప్రయాణంలో

ఆయన చిన్న కూతురు చచ్చిపోయింది — శుభ ముహూర్తాలు ఎన్ని విఫలమైనా పంచాంగంమీద గౌరవం రవ్వంతైనా తగ్గలేదు. సరికదా రోజురోజుకూ పెరుగుతోంది.

"ఏమండోయ్! ఏమిటి సంగతి? —చాలా కాలానికి కనపడ్డారు" లావుగా పొట్టిగా వున్న ఓ విగ్రహం చిరునవ్వుతో ప్రశ్నించింది

"మీతో కొంచెం పని వుండి వచ్చాను — మీరు పైకి వెళుతున్నారా?"

"అబ్బెబ్బే! లేదు! ఈ వేళ పనులేమీ లేవు. నిన్న పొద్దున్నే ఊరినుంచి తిరిగొచ్చారు." కుర్చీలో కూర్చుంటూ రామ్మూర్తి అన్నాడు.

నేను వచ్చిన పని తెలియజేసేను. అయన మారుమాటాడకుండా పర్సులోంచి నోట్లు తీసి నా చేతికి యిచ్చాడు.

"వీరెవరు?" గోపాలంకేసి చూస్తూ ప్రశ్నించాడు రామ్మూర్తి

'ఇతను నా స్నేహితుడండీ. గోపాలాన్ని మీకు యిదివరకే తెలిసి వుండాలి. అంచేత నేను పరిచయం చెయ్యలేదు.'

'ఎక్కడో చూసినట్టు గుర్తు ది.'

'ఒక కల్చరల్ ప్రోగ్రాంకు మీదగ్గర చందా పుచ్చుకున్నాను.' పాత సంగతి గుర్తుకు తెచ్చాడు గోపాలం.

'గోపాలానికి డాన్సు, డ్రామా, లలిత సంగీతం, చిత్రలేఖనం వగైరా కళలమీద చాలా అభిమానం — వాటికోసం నిత్యం ఏదో శ్రమ పడుతూవుంటాడు.'

'నాకు అందమైన బొమ్మలు, నాటకాలు, సినిమాలు తప్ప మిగిలిన వేవీ బోధపడవు అంచేత భరత నాట్యాలకు నేను చందా యిచ్చినప్పటికీ వెళ్ళి చూడను' దాపరికం లేకుండా చెప్పేశాడు రామ్మూర్తి.

వెంటనే గోపాలం అందుకున్నాడు. ఈ మధ్య గొప్ప గొప్ప వాళ్ళంతా కలిసి ఒక సినిమా తీస్తున్నట్టూ—దానికి తనే సారథ్యం వహిస్తున్నట్టూ-అదృష్ట జాతకుడితో ప్రారంభోత్సవం జరపబోతున్నట్టూ- ఇంకా ఎన్నో వివరాలు చెప్పాడు.

రామ్మూర్తి ముఖభంగిమలనుబట్టి అతనికి మొదట ఈ ప్రసంగం రుచించినట్టు కనిపించలేదు. కానీ గోపాలం తక్కువ వాడు కాదు. రామ్మూర్తిలో వున్న బలహీనతను పసికట్టి... నెమ్మదిగా వలవిసిరాడు.

'ఎప్పుడు మొదలు పెడతారు?' అడిగాడు రామ్మూర్తి

● *భర్త : "మాకావిడ ఈ వ్యాసంలో రాశారు. తండ్రి ఎంత తెలివైనవాడైతే కొడుకు అంత మంద అవుతాట్ట."*

భార్య : "అయితే మనఅబ్బాయికేం ఫరవాలేదన్నమాట."

'జనవరి వెళ్ళేవరకూ నేనేమీ చెయ్యదలుచుకోలేదు ఉగాదినాడు ప్రారంభోత్సవం మీతోనే జరిపిస్తాను.' 'ఏమిటీ? నాతో జరిపిస్తారా?' 'నిజంగానే.' ఆశ్చర్యపోయాడు రామ్మూర్తి

'అవును. మీతోనే--మీకంటే అదృష్టవంతులెవరున్నారు? — మీరు చెయ్యిపెట్టిన ప్రతి వ్యాపారం తిరుగులేకుండా అభివృద్ధిలోకి వస్తోంది. మీ హస్తవాసి చాలా మంచిది. ప్రారంభోత్సవానికి మీ పర్మిషన్ పుచ్చుకోడానికే నేనిప్పుడు వచ్చాను.'

ఈ చివరిమాట మాత్రం శుద్ధ అబద్ధం. దుర్ముహూర్తంలో రామ్మూర్తి దర్శనం అవుతుందా? కాదా? అన్నది తేల్చుకోడానికి మాత్రమే గోపాలం నాతో వచ్చాడు. ఇప్పుడు ప్లేటు మార్చాడు.

'ఈ ఊళ్ళో నా కంటే గొప్పవాళ్ళు—ఎక్కువ చదువుకున్నవాళ్ళూ ఎంతోమంది వున్నారు. వాళ్ళతో ప్రారంభం చేయించండి' అన్నాడు రామ్మూర్తి.

కానీ గోపాలం ఒప్పుకోలేదు. గొప్ప గొప్ప విద్వాంసులూ, పండితులూ ప్రారంభోత్సవాలకు పనికిరారన్నాడు. వాళ్ళ చేతులు మంచివి కావన్నాడు. వాళ్ళ చెయ్యి పడినంత మాత్రాన పచ్చగా వున్న సంస్థలు కూడా ఎండిపోతాయన్నాడు.

ఎలాగైతేనేం గోపాలం నెమ్మదిగా రామ్మూర్తిని — వూబిలోకి దించడం ప్రారంభించాడు. నేను వున్నానన్న సంగతి కూడా గుర్తించకుండా వాళ్ళిద్దరూ కొత్త వ్యాపారం గురించి ఉత్సాహంతో చర్చించుకుంటున్నారు. నేను గోపాలాన్ని యిక్కడికి తీసుకు రావడంలోని ప్రమాదాన్ని ఇప్పటికి గుర్తించాను. నా మీది నమ్మకంతో — నాతో వచ్చినవాడు తప్పకుండా పెద్దమనిషి అయివుంటాడని రామ్మూర్తి అంచనా! అందేతనే గోపాలం మాటలకు అతను అంత విలువ ఇస్తున్నాడని నేను వూహించాను.— అయితే రామ్మూర్తిని ఈ ఉచ్చులోంచి విడిపించడం ఎలాగ? మనస్ఫూర్తిగా నమ్మిన వాళ్ళను— సునాయాసంగా దగా చెయ్యగల శక్తి నాలో లేదు కనక--యీ వ్యవహారం చాలా బాధాకరంగా వుంది-- అయిదు నిముషాల తరవాత యిద్దరికేసీ చూశాను. వాళ్ళ ఉత్సాహం క్షణక్షణానికీ ద్విగుణీకృతం అవుతోంది.

అంతలో మా వెనక 'రామ్మూర్తిబాబూ!' అన్న బొంగురు గొంతూ-- కుక్క అరుపు — ఒక చిన్నదాని కేకలారవం— ఒక్కసారిగా వినిపించాయి.

రామ్మూర్తి నిదానించి చూసి 'ఏంవోయ్ జోగులు! రా! రా!— ఏమిటి సంగతి?' అన్నాడు.

పెద్ద జుత్తు, కండలు తిరిగిన వళ్లు,

గళ్ళ లాల్చీ, ఫిన్లే పంచె కట్టిన జోగులు నాకు తెలియనివాడు కాదు. ప్రకనితో వచ్చిన కుటిల కుంతల (చెడ అర్థం తియ్యకద్దు మనవి, ఉంగరాల జుత్తు కలదని భావం) వసంత అతకంటే తెలియనిది కాదు.

నన్ను చూడగానే వసంత మందగమనతో (అంటే లావుపాటిది కాదు) చిరునవ్వుతో వచ్చి నా పక్కని కూర్చొని "మీరు యిక్కడున్నారేం?" అంది.

"రామ్మూర్తిగారిని నాకు బాగా తెలుసు అప్పుడప్పుడు యిక్కడికి వస్తూవుంటాను." సంజాయిషీ చెప్పుకున్నాను

ఈ రెండు పాత్రల ప్రవేశంతో గోపాలం ముఖంలో కళ తరిగిపోయింది. జోగుల్ని చూడగానే ముఖం చాటు చేసుకున్నాడు. ఎవరిని చూసినా చలించని గోపాలంలో ఈ మార్పేమిటి? దీని అర్థం ఏమిటి? అనుకుంటూ వుండగానే జోగులు గోపాలాన్ని సమీపించాడు. పైకి కిందికి చూశాడు.

"ఏమయ్యోయ్! పెద్ద మనిషీ! ఇక్కడ చేరేవేంటి సంగతి?" అన్నాడు వ్యంగ్యంగా!

"చిన్న పనిమీద వచ్చానులే!— ఈ మధ్య నువ్వెక్కడా కనపడ్డం లేదేం? బాగున్నావా?" అన్నాడు గోపాలం.

"ఏ మొకం పెట్టుకుని అడుగుతున్నావంటు!— నీ కన్పడ్డాక నేను బాగోడం కూడానా? అసలు నువ్విక్కడ ఎందుకు చేరేవో సెప్పు రామ్మూర్తి బాబుని ఎందులోనైనా దించుతున్నావేంటి?"

"దించడం ఏమిటి?" కోపంతో అడిగాడు గోపాలం.

"దించడం అంటే ముంచడం అన్నమాట!" ఉరిమాడు జోగులు.

"ఏమిటోయ్ జోగులూ? ఏమిటిదంతా?" మందలించే ధోరణిలో అడిగాడు రామ్మూర్తి

- *మొగుడు రోజూ ఒక విస్కీ సీసా ఇంటికి తెచ్చుకుని పూర్తి చేసేవాడు. పెళ్ళానికి తనని వరస ఏం నచ్చలేదు ఎన్నిసార్లు చెప్పినా అతనికి ఆ అలవాటు పోలేదు*

  ఒక రోజున పెళ్లాం కోపం పట్టలేక అతని చేతులో సీసా లాక్కుని కొద్దిగా రుచి చూసింది, నోరు భగభగ మండిపోయింది గొంతు పట్టుకుని అరగంటదాకా దగ్గుతూ నానా హడావిడి చేసింది.

  "చూశావా. నే నేదో ఇన్నాళ్లూ సరదాగా అనుభవిస్తున్నాననుకున్నావ్. ఇది తాగడం ఎంత కష్టమో తెలిసిందా?"

'ఏం చెప్పమంటావ్ రామ్మూర్తి బాబూ!—మా చెల్లి తిలకం ఎంత మంచిదో యీ బాబు నడుగు!' అంటూ నన్ను చూపించాడు జోగులు.

ఆ ఆడవాళ్ళతో నీకేం పరిచయం అని మీ రడగొచ్చు. వాళ్ళంతా నాటకాలలో ఆడపాత్రలు—తిలకం, వసంత యిద్దరూ నాటకాలలో వేషాలు వేశారు. వసంత యిప్పటికీ వేస్తోంది.

'ఇప్పుడు మీ తిలకాని కే మొచ్చింది?' అడిగాడు రామ్మూర్తి.

'దానికి పోయేకాలం వొచ్చింది. ఇదుగో! ఈ పెద్ద మనిషి దగా సేసి—దాని మనసు యిరిసేసి—వూరు దాటించేసి—సినిమాల్లో కలిపేసేడు.'

'ఇందులో చెడ్డేముంది? నాటకాల్లో కంటే సినిమాల్లో ఎక్కువ డబ్బొస్తుంది కదా?' అన్నాడు రామ్మూర్తి

'అదిపోయి యేణ్ణర్థం అయ్యింది. ఒక్క సినిమాలోనూ దాని మొకం కనపళ్ళేదు. దాన్ని యితగాడు యే దగా కోరుకు అప్పగించాడో తెల్దు'

'ఇదుగో! జోగులూ! నువ్వు తొందర పడితే లాభంలేదు. మీ తిలకం యిప్పుడు తిలకంకాదు రేఖ! పేరూ మారిపోయింది — రేఖా మారిపోయింది. — కావాలంటే ఎడ్రస్ యిస్తాను. వెళ్ళి చూడు గుమ్మం ముందు గూర్ఖా, గుమ్మం లోపల గులాబీలు, ఇంటినిండా ఆర్టిస్టులు!— నువ్వు చూశావంటే ఆశ్చర్యపోతావు. చూసి మాట్లాడు!' ఆవేశంతో చెప్పాడు గోపాలం.

'నీ మాటలకి ఎవరైనా బోల్తా కొట్టొచ్చు. నేను మాత్రం కొట్టను. నన్ను కొట్టించలేవు'

'అవతలికి రా! అయిదు నిముషాలు మాట్లాడదాం!' వలవిసిరేడు గోపాలం.

'అయిదు నిమిషాలుకాదు ఐదు గంటలు మాటాడతాను—ఆగు!— నిన్ను సూడగానే నేనొచ్చినపనే మరిసిపోయాను' అంటూ యింటి యజమాని కేసి తిరిగి 'రామ్మూర్తి బాబూ! మామాటేంసెప్పావు?' అన్నాడు.

'ఇప్పుడాని కేముంది జోగులూ! నేను కలగచేసుకుంటే పని అయిపోవలిసిందే!'

జోగులు చాలా సంతోషించాడు. 'మీలాంటి మారాజులుండబట్టే యీ ప్రపంచకం యిలాగైనా నిలబడివుంది.' అన్నాడు.

'అయితే నాకు డాన్సుటీచరు ఉద్యోగం యిస్తారా అండి?' అంది సంతోషంతో వసంత.

'ఇస్తారా యేమిటి?—యిచ్చేసినట్టే! వారం పదిరోజుల్లో ఆర్డర్లొస్తాయి.' అన్నాడు రామ్మూర్తి

నేను లేచి 'రామ్మూర్తి రూ!

సెలవు! మరోసారి వచ్చి కలుసుకుంటాను.' అన్నాను.

'మీతో చాలా సంగతులు మాట్లాడాల' న్నాడు కృష్ణమూర్తి.

'మీ కెప్పుడు తీరికో చెబితే వస్తాను' అన్నాను

'రేపు రాత్రి 8 గంటలకి తప్పకుండా రండి'

సరే అన్నాను. గోపాలం నన్ను అనుసరించాడు.

'ఏయ్ పెద్దమనిషి! ఎప్పుడొస్తావని యెళ్ళిపోతున్నావేంటి?' వెనకనుంచి గర్జన వినిపించింది.

'జేబులో తీసు. మా యింటికొచ్చి పట్టుకు వెళ్ళు!' అంటూ వెనక్కి తిరిగి చూడకుండా గోపాలం నాతోపాటు వీధిలో వచ్చాడు.

'నీ మూలాన్ని తిలకం పాడైపోయిందంటాడేమిటి? నువ్వేం చేశావు?' గోపాలాన్ని అడిగాను.

'వాడి మాటలా నువ్వు నమ్మేవు? ఆ జోగులుగాడు వుత్త దొంగ వెధవ! వాడు ఆ యిద్దరు చెల్లెళ్ళమీదా ఆధారపడి బతుకుతున్నాడు. సోమరిపోతు! వీడు వాళ్ళను బాగుచెయ్యడు. వాళ్ళంతట వాళ్ళు బాగుపడతామంటే— వాళ్ళను బాగుపడనివ్వడు.— అందుకు బాగుపడతానంటే నేను దారి చూపించాను. చక్కగా రెక్కలు కట్టుకొని ఎగిరిపోయింది. మధ్యని విడిచెందుకా దగ్గరే ఈ వూళ్ళో ఎన్నేళ్ళు వున్నా తిలకం—తిలకంగానే వుండిపోతుంది. అదిదకు రేఖ మారే యోగం వుంది. స్వతంత్రించి వెళ్ళిపోయింది.

ఆకు మేఘాలమీద పరుగెత్తుతుంటూ వచ్చి ఒక జట్కాబండి మా ముందు ఆగింది. ఆవెరిపడి ముందుకు చూశాను. ఆ మూరుడులాంటి ఆ రథసారధి నాకు తెలిసినవాడే? వాడికి రెండు కాళ్ళూ వంకర. మనిషి పొట్టివాడు. ఇవాళేమో చాలా దురుగ్గా వున్నాడు.

'అబ్బాయిగారూ! కొత్త గుర్రం కొన్నాను! ఎక్కండి! బండెక్కండి.' అన్నాడు చిట్టి.

నేను చదువుకునే రోజుల్లో చిట్టి గుఱ్ఱబ్బండిమీదే స్కూలుకు వెళ్ళే

- *ఇంట్లో వాటాని అద్దెకడిగిన ఆసామీతో ఇంటి యజమాని : "మీకు పెంపుడు కుక్కలున్నాయా?"*

  "లేవండి. ఏం?"

  "ఏం లేదు. మాకు నాలుగున్నాయి. అవి అస్తమానం మొరుగుతూ వుంటాయి. వాటితోనే ఛస్తున్నాం ఇహ మీక్కూడా వుంటే భరించలేం. అందుకని"

వాణ్ణి. చిట్టి ఒకతోరకం రౌడీ! పెద్ద మనుషుల్లో పెద్దమనిషి! పేచీకోరుల్లో పేచీకోరు! వాణ్ణి చూస్తే అందరూ జడుస్తారు. వాడి ఆకారమే అలాంటిది! చింతనిప్పుల్లాంటి కళ్లు! పెద్ద గిరజాల జుత్తు! లావుపాటి ముఖం, మైక్ అక్కర్లేకుండా అరఫర్లాంగు దూరం వినపడే గొంతు!— వాడంటే యెవరూ యిష్టపడరు

"కిరాయి యివ్వొద్దు! నా జేబు నిండా డబ్బులున్నాయి. మీరెక్కి కూర్చుంటే — సెణంలో గేలాప్ మీద తీసుకుపోతాను కొత్త గుఱ్ఱానికి ముందు బోణీ మీరే సెయ్యాలి. యెక్కండి!" చిట్టి అరుస్తున్నాడు, గుఱ్ఱం సకిలిస్తోంది

"ఎక్కడికి వెళ్ళవలిసిన పనిలేదు. ఇంటికి వెళ్ళిపోతున్నాను నీబండి మరోసారి..."

"నేనొప్పుకోను! మీరెక్కాలి. నేను బండితోలాలి. సాయంత్రం షికార్! ఊరవతలకు పోయి — యెనక్కి తోలుకొచ్చి యింటికాడ దిగబెట్టి యెళతాను."

నేనింకా సంశయిస్తున్నాను. గోపాలం బండి ఎక్కుతూ అన్నాడు. "ఇప్పుడు యింటికి వెళ్ళిమాత్రం యేంచెయ్యాలి? వాళ్లు ఎంత సరదా పడుతున్నారు. కాస్సేపు షికారు వెళ్ళివద్దాం"

దాన్తో మారుమాటాడకుండా జట్కా యెక్కాను అప్పటికే బండిలో రెండు గ్రహాలు కూర్చుని వున్నాయి. మాటల ధోరణినిబట్టి వాళ్ళిద్దరూ గుర్రబ్బళ్ళవాళ్ళే అని, చిట్టి అనుచరులని అనుకున్నాను. మామూలు వేగకంటే రెట్టింపు వేగంతో బండి వూరు దాటిపోయింది!— చిట్టి తన యిద్దరు అనుచరులతో కలిసి గుఱ్ఱాన్ని చిత్రగతులతో నడిపించడం ప్రారంభించాడు. ముగ్గురూ కలిసి గుఱ్ఱాన్ని రకరకాలైన పరీక్షలు చేస్తున్నారు. ఒకడు చక్రం పక్కని కమిచీకర్ర పెట్టి కటుటు శబ్దం చేస్తున్నాడు ఒకడు విరామం లేకుండా ఈలలు వేస్తున్నాడు —'చల్! చల్!' అని అరుస్తూ —బిగ్గరగా తిడుతూ — కొరడా కర్రతో చితగ్గొడుతూ గుర్రాన్ని భూమికీ ఆకాశానికీ మధ్య నడిపిస్తున్నాడు చిట్టి! — అప్పటికి నాకు ప్రమాదం బోధపడింది. ముగ్గురూ మందు నిషాలో వున్నారు. వాళ్ళ ముగ్గురి దృష్టి గుర్రపు పరీక్షలో కేంద్రీకృతమైవుంది. అదే వేగం కొద్ది క్షణాలు సాగేసరికి గుఱ్ఱం వెనక తక్కెం తెగిపోయింది. దాన్తో చెక్క రాపిడి యెక్కువయ్యింది గుఱ్ఱానికి వెనక భాగం దెబ్బతగలడం ప్రారంభమయింది — గుఱ్ఱం బెదిరిపోయింది ముగ్గురు హేమాహేమీలు యెంత లాగడినా గుఱ్ఱం దారికి రాలేదు. బండి గతుకుల్లో పడి మన్మల్ని అయిదడుగుల యెత్తుకు తీసుకువెళ్ళి కింద పారేస్తోంది ఆ తరంతకూ ఆకాశం లోంచి దూసుకు పోతోంది. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని

కూర్చున్నాం — దారిలో లారీలు, బస్సులూ, కారులూ బొమ్మల్లా కని పిస్తూ చిత్తు మాయ మై పోతు న్నాయి. గుఱ్ఱం దయాధర్మంమీద ఆధారపడి— అది ఎటు తీసుకుపోతే అటే బండీ— బండితోపాటు మేము వెళ్ళిపోతున్నాం. గుఱ్ఱం ముక్కుకు సూటిగా పోతోంది. కాలవ వంతెన దగ్గర రోడ్డు వంకరగా మలుపు తిరిగి వుంది గుఱ్ఱం వంతెననూ రోడ్డునూ మలుపునూ పట్టించుకోవడం లేదు. తిన్నగా తీసుకు వెళుతోంది. కొద్ది క్షణాలలో కాలవలోకి లాగెయ్యడానికి సిద్ధంగా వుంది.

'చచ్చాంరా దేవుడా !' అంటూ అమాంతంగా గోపాలం బండిలోంచి వురికేశాడు. నేను కూడా దూకడానికి తయారవుతున్నాను. ఆ సమయంలో మెరకవల్ల బండివేగం రవంత తగ్గింది. చిట్టి శిష్యు లిద్దరూ చెరో పక్క నుంచీ ముందుకు వురికి - గుఱ్ఱంతో సమానంగా పరుగెత్తి కాలవగట్టు చేరుకొనేసరికి బండి ఆపుచేశారు.

'చంపావోయ్ చిట్టి ! నిక్షేపంగా ఇంటికి పోతున్న వాళ్ళను పిలిచి ప్రాణాలు తీసినంతపని చేశావు.' అన్నాను కోపంతో.

'అబ్బే ! ఇదీ ఒక గేలాపేనా? కొత్త గుర్రం సంగతి తేల్దానికి— ఇంకా సాలా తమాషా లున్నాయి మరోకమాటు చూపిస్తాను మీకు !' తెలిగ్గా అన్నాడు చిట్టి.

తొందరగా వెనక్కి వెళ్ళి నేల మీద కూర్చుని ఆయాసపడుతున్న గోపాలాన్ని బండిలో వేసుకొని ఊరు చేరుకున్నాం.


గోపాలానికి ఎముకలు విరక్క పోయినా వొళ్ళంతా హూనం అయి వారం రోజులవరకూ లేవలేదు.


అమావాస్యనాడు దుర్ముహూర్తంలో బయలుదేరి నందువల్లనే - ఆ రోజున అనేక అవమానాలు జరిగాయని, ఒవరకు పెద్ద ప్రమాదం జరిగి తనకు చావుతప్పి కన్ను లొట్టపోయినంత పని జరిగిందని గోపాలం అన్నాడు.

మరి నేనూ ఆ దుర్ముహూర్తంలోనే బయలుదేరాను కదా? నాకు ఒక చెడుగూ జరగలేదేం?— పైగా నే నెందుకు వెళ్ళానో ఆ పనికూడా పూర్తి అయింది.

ఒకవేళ తమను ఎవరైతే నమ్ముతారో వాళ్ళనే గ్రహాలు బాధ పెడతాయా? — తమమీద నమ్మకం లేనివాళ్ళకు— న్యాయంగా పక్రమమైన మార్గంలో నడిచేవాళ్ళకు అవి దూరంగా వుండడంలో అర్థం యేమిటి? — అసలు ఈ దుష్టగ్రహాలు అనేవి భూమ్మీదేకాని ఆకాశంలో లేవా? ... ఇంకా ఎన్నో సందేహాలు మిగిలిపోయాయి.

□□□


ఆడాళ్లగొడుగు
మీరేసుకుంటే
నవ్వుతారని
అంటున్నా తప్పితే
మీరు తడుస్తే
నాకేం సరదానా!


మీరెన్నిచెప్పండి - టామీ
లేనిలోటు మీరు తీర్చలేరు
తీర్చలేరు

సంజీవి

డాక్టర్ మహీధర నళినీమోహన్

చెముడుకాకి గూటిలో సంజీవి పుల్ల వుంటుందని నమ్మి దానిని ఎలాగైనా పట్టుకోవాలని ప్రయత్నించిన కుర్రకారులో నేనూ ఒకడిని. తన పిల్లలకు ఏ ప్రమాదమూ రాకుండా ఈ కాకి తన గూట్లో ఈ పుల్లను పెట్టుకుంటుందట. ఆ సంజీవి పుల్లను అది ఎక్కడ సంపాదిస్తుందో ఎవరికీ తెలియదు. కాని, ఆ పుల్ల దానిగూట్లో వుండడం మాత్రం నిజమట.

అసలు చెముడుకాకులు కనపడటమే అరుదు. దానిగూడు ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడం మరీ కష్టం. ఆ గూటిలో వున్న వందలాది ఎండు పుల్లలలో సంజీవిపుల్ల ఫలానా అని గుర్తుపట్టడం ఎల్లాగా?

దీనికి ఒక సులభమార్గం ఉంది దాని గూడు అంతా పీకి, ఒక నది ఒడ్డుకివెళ్ళి, ఒకొక్క పుల్లనీ తీసి నదిలో వెయ్యాలి. మామూలు పుల్లలన్నీ ప్రకృతి సహజంగా నదీప్రవాహంలో కొట్టుకు పోతాయి ఒక్క సంజీవిపుల్ల మాత్రం అలా కొట్టుకు పోకుండా ప్రవాహానికి ఎదురీదుతుందిట. జరజరా పాములాఈదుతూ కన్పిస్తుందిట. అటువంటి చిత్రమైన పుల్లకనబడగానే చటుక్కున దానిని ఒడిసి పట్టుకోవాలి. ఆతరువాత పూజ పునస్కారం శాంతులు వగైరా తతంగం కొంత ఉంటుంది.

చెముడు కాకి కనపిస్తే చాలు దానిని వెంబడించి, పొలాలకు అడ్డబడి తుమ్మచెట్లెక్కి, జారి ముళ్ళలోపడి, అప్పట్లో సంజీవిపుల్ల వేటను తాత్కాలికంగా విరమించాను. ఆంజనేయుడు లక్ష్మణుని బ్రతికించడానికి సంజీవిని తెచ్చిన తరువాత మళ్ళీ అటువంటి సంజీవి పుల్లను సంపాదించిన మొనగాడు మరొకడెవ్వడూ ఉన్నట్టు దాఖలా లేదు.

కలకాలం బ్రతకాలని, ఇలుపట్టనంత బంగారం సంపాదించాలని కలలు కనని వాళ్ళు అరుదు. ఈకలలకు అనుగుణంగా చిత్ర చిత్రమైన కథలు బయలుదేరేయి. ఎల్లప్పుడూ ఆరోగ్యంగా తరగని యౌవనంతో బహుకాలం జీవించడానికి తోడ్పడే వస్తువు ఒకటి ఉందని దేశదేశాలలో ప్రజలు పూర్వం నమ్మేవారు. అల్లాగే ఇనుము సీసం వంటి క్షుద్రలోహాలన్నింటినీ ఒక్కసారి ఇలాతాకిస్తే చాలు మేలిమి బంగారంగా మార్చివేయగల శక్తివంతమైన రాళ్ళు ఉన్నాయని సువర్ణయోగులు నమ్ముతూవచ్చారు. ఎలాగో కష్టపడి ఈరెండిటినీ చేతికి పట్టుకోగలిగితే ఇహ ఏకష్టమూ లేకుండా కాలు మీద కాలువేసుకుని జీవించవచ్చు

ననే ఆశతో భగీరథ ప్రయత్నాలు చేసి నిరాశతో కృశించి పోయిన వాళ్ళు చరిత్రలో కోకొల్లలు.


అమర జీవి అనేది లేదని వైజ్ఞానికలోకం చాలా కాలం క్రితమే గ్రహించింది. పుట్టిన ప్రతిజీవి ఎప్పటికో అప్పటికి చనిపోవడం తథ్యం అన్నారు.

కాని ఇటీవల 'జాతస్య మరణం ధ్రువం' అన్న సామాన్యసూత్రానికి అక్కడా అక్కడా వ్యాఘాతాలు కనబడసాగేయి పుట్టిన ప్రతి జీవి చచ్చి తీరాలని ఏమీ లేదు ఎప్పటికీ చనిపోవని జీవులు కూడా ఉన్నాయి!

అతి సూక్ష్మమైన జీవ కణాలు కోటాన కోట్లు చేరి మన శరీరాలు తయారయాయి కాని, ఒకే ఒక జీవకణంతో ఏర్పడ్డ జీవులు (ఏకకణ జీవాలు) కూడా ఉన్నాయి. మనకు జబ్బులు కలిగించే కంటికి కనబడని అనేక రకాల సూక్ష్మజీవులు ఈ కోవకు చెందుతాయి వీటికి తల, మొండెము, కాళ్ళు, చేతులు వంటి అంగ విభాగాలు ఏవి లేవు వీటికి గుండె మెదడు వంటి అంగాలు అంత కన్నా లేవు.

కాని, అవి ఆహారాన్ని తీసుకుంటాయి. కదులుతాయి. ప్రమాదం కనబడితే పారిపోతాయి. పిల్లలను కంటాయి.

ఈ సూక్ష్మజీవులలో సంతానోత్పత్తి చాలా చిత్రంగా జరుగుతుంది. వీటిలో ఆడ, మగ భేదం లేదు. సూక్ష్మజీవి, ఆహారం తీసుకుంటూ క్రమంగా పెరిగి పెద్దవుతుంది సుమారు ఒక అర గంటలో పూర్తిగా పెరిగి, అత్యుచ్ఛ దశను చేరుకుని, నెమ్మదిగా రెండు భాగాలుగా విడిపోతుంది! ఆ రెండు మొదటి సూక్ష్మజీవి నుంచి వచ్చిన పిల్లలు ఈ రెండూ దూరం దూరంగా జరిగి, వేరింటి కాపురాలు పెట్టి వేరువేరుగా జీవయాత్రసాగిస్తాయి. ఈ పిల్లలు రెండూ పెరిగి పెద్దవై మళ్లీ ఒకొక్కటి రెండేసి భాగాలుగా విడిపోతుంది. అవి మళ్లీ రెండుగా విడిపోతాయి. అవి మళ్ళీనూ...


సంజీవి పురుగు

ఇంతకి మొదటి సూక్ష్మజీవి చనిపోయినట్లుకాదా? చనిపోతే శవం ఏదీ? అది మనకు తెలిసిన చావు మాత్రంకాదు. అసలు జీవి పూర్తిగా మాయం అయిపోయి,దానిస్థానంలో రెండు సరికొత్త జీవులు బయలుదేరేయి.

ఈసూక్ష్మజీవులకు నిజంగా చావు

అంటూ లేదు. అంటే అసలు ఎప్పటికీ ఏవిధంగానూ చచ్చిపోవని కాదు ప్రమాదంచేత చనిపోతాయే కాని, జీవన క్రమంలో ముసలితనం రావడం, చచ్చిపోవడం అంటూ ఏమీ లేదు.

ముసలితనం రావడం, కృశించి చనిపోవడం వంటి దశలు బహు సూక్ష్మమైన ఏక కణజీవాలలో లేవు. జీవపరిణామంలో పరిణతి చెందిన పెద్దజీవులకుమాత్రమే ఇవి కనిపిస్తున్నాయి.


అయితే పెద్ద జీవులు చావును తప్పించుకునే మార్గాలు ఏమైనా ఉన్నాయా? కథలోని పదహారేళ్ల బాలా కుమారంలాగ అనంత కాలం జీవించడం సాధ్యమా? ఏ జీవినైనా బహుకాలం జీవించేటట్లు చెయ్యగలమా?

ఈ విషయాల మీద కొందరు శాస్త్రజ్ఞులు కృషిచేశారు. కొన్ని జీవులు కొన్ని ప్రత్యేక పరిస్థితులలో చావునుపూర్తిగా జయించి, మార్కండేయుని లాగా అనంత కాలం జీవించగలవని కనుగొన్నారు. చికాగోయూనివర్సిటీలో 'చైల్డ్' అనే ప్రొఫెసర్ చేసిన పరిశోధనలలో వింత వింత విషయాలు బయటపడ్డాయి.

'ప్లాటిహెల్మింథెస్' అనే శాస్త్రీయ నామంతో వానపాముల జాతి మంచినీటి జీవులకొన్ని ఉన్నాయి. (వాటిని ప్లానేరియన్ వర్మ్స్ అంటారు.) పలుచగా అకులాగా సుమారు అంగుళం పొడుగున ఉంటాయి ఈ పురుగులు. ఇవి మామూలుగా అన్నిజీవులలాగే కొన్ని రోజులు (మూడు నాలుగు వారాలు) బ్రతికి చచ్చిపోతాయి. కాని, ఆహారం దొరకక పోతే ఈపురుగులు క్రమ క్రమంగా కృశించి ఆవగింజంత నలకలుగా మారి, కొన్ని నెలల ఉపవాసానంతరం చచ్చిపోతాయి అంటే సుష్టుగా భోజనం పెట్టినప్పటికన్నా పొట్టమాడిస్తేనే అవిచాలాకాలం బ్రతుకుతాయన్న మాట ఆహారం దొరకనప్పుడు శరీరం కృశించిపోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. అన్ని జంతువులకు అంతే తమ శరీరాలలో నిలువ ఉన్న కొవ్వును వాడుకుని కృశిస్తాయి. కాని ఈజీవులు కృశించడం మాత్రమేకాక వార్ధక్య,కౌమార, యౌవన, బాల్య దశలలో వెనుకకునడుస్తాయి అంటే ముసలిపురుగు నొకదానిని పట్టుకుని ఆహారంఇవ్వకుండా ఎండగడితే శరీరం కృశిస్తూ యౌవనంలో అడుగు పెట్టి, అటుతరువాత బాల్యావస్థను చేరుకుంటుంది మళ్ళీదానికి ఆహారం ఇవ్వడం మొదలు పెడితే మామూలుగా గుడ్డులోనుంచి బయటికి వచ్చిన పిల్లలాగ బాల్య యౌవనాది దశలన్నీ దాటుకుంటూ వస్తుంది. దానిని మళ్ళీ ఎండగట్టి, మళ్ళీ అహారంపెట్టి, మళ్ళీ మానేసి ---ఈవిధంగా చేసుకుంటూ పోతే ఆ జీవి ఎన్నటికీ చనిపోదని రుజువు అయింది।

ప్రొఫెసర్ చైల్డ్ రెండు తొట్టెలలో ఈ పురుగులను కొన్నింటిని వేసి, ఒక తొట్టెలో పురుగులకు ఆహారం మామూలుగా అందించాడు. రెండవతొట్టెలో పురుగులకు ఆహారం ఇస్తూ, మానివేస్తూ, మళ్ళీఇస్తూ, మానివేస్తూ... ఇల్లాగ వాటిని ఒకే ఒక సైజులో ఉండేటట్లు చేశాడు. మొదటి తొట్టెలోని పురుగులు పెరిగి పిల్లలను కని చనిపోయాయి. ఆ పిల్లలకు పిల్లలుపుట్టేయి. వాటికి మళ్ళీ పిల్లలు... ఈ విధంగా ఇరవైతరాలు గడిచినా రెండవతొట్టెలో పురుగులు చనిపోకుండా ఒకే యౌవన దశలో ఉండిపోయాయి. అదే మనుష్యుల వయః పరిమితితో పోల్చిచూస్తే నాలుగైదు వందల సంవత్సరాలు బ్రతికినట్లు అన్నమాట! ప్రొఫెసర్ చైల్డ్ అంతటితో ఆ పరిశోధనను ముగించివేశాడు కాని ఇరవైతరాలు కాదుకదా ఇరవైవేల తరాలుగడిచినా ఆ జీవులు అల్లాగే బ్రతికి ఉంటాయనడానికి సందేహం లేదు.

□□□





రాణి మందాకినీదేవి గవాక్షం గుండా తన దృష్టిని సారించి చూస్తోంది. నిన్న వికసించి, పరిమళాలని వదిలిన పువ్వులన్నీ వాడి పోయి, సౌకుమార్యాన్ని కోల్పోయి రాలిపోతున్నాయి. వాటిలో చాలా

పువ్వులు ఫలించకపోవచ్చు. తుమ్మెదల ద్వారా వాటి ప్రాకృతిక కర్తవ్యాన్ని లేదా హక్కుని అనుభవించే అవకాశాన్ని అవి దూరం చేసుకుని ఉండచ్చు. రాణి చిన్న నిట్టూర్పు విడిచింది. ఈ రోజంతా అక్కడ ఉచ్ఛ్వాస, నిశ్వాసాలన్నిటినీ ఇలాంటి నిట్టూర్పులే నింపివేశాయి. తన బ్రతుకు కూడా ఆ 'అవకాశం' దొరకని ఏదో ఒక చిన్న పువ్వువంటిదనే అనుమానం కలిగిందామెకు. మళ్ళీ ఒక నిట్టూర్పు విడిచి దగ్గరలో ఉన్న ఆసనంమీద కూర్చుంది.

వంతు ప్రకారం దశరథమహారాజు ఈ 'రాత్రి' తన అంతఃపురానికి వస్తాడు. ఈ రాత్రేనా? అంతేనేమో! కాకపోవచ్చు కూడా! ఈ అంతఃపురమూ, ఈ గవాక్షం, ఈ ఆసనం తన జీవితంలో కాలప్రవాహాన్ని అరికట్టి యాంత్రికంగా తయారు చేశాయి. ఎప్పుడో చాలా ఏళ్ళ క్రితం దశరథమహారాజు ఈ అంతఃపురానికి వచ్చిన తర్వాత తన జీవితంలో చెప్పుకోదగ్గ బలమైన సంఘటన ఏం లేదేమో! రోజూ నిద్రనుండి లేవడం, కాలకృత్యాల తర్వాత చెలికత్తెలు సుగంధాలతో స్నానం చేయించడం, భోంచెయ్యడం, నిద్రపోవడం కాకుండా, చెలి తగ్గు స్వరంలో వాయిద్యం వాయిస్తూండగా ఈ ఆసనంలో కూర్చుని, ఈ గవాక్షం గుండా పువ్వులని, ముఖ్యంగా రాలిపోతున్న పువ్వులని, తోటద్వారాన్ని కాపలా కాస్తున్న ఆ బలిష్ఠుడైన ద్వారపాలకుణ్ణి చూడడం తప్ప ఏ రోజులోనైనా ఇంకో కొత్తది, కదిలించేదీ అయిన సంఘటన లేదేమో! లేకేం! ఈ రెండేళ్ళలోనూ ఒక రోజున, ఆ ఉదయం గవాక్షంగుండా చూస్తోంది తను. తోటలో పువ్వులు కోయడానికి ఓ చెలికత్తె వెళ్ళింది. తను రోజూ చూచే ఆ బలిష్ఠుడైన ద్వారపాలకుడు ఆమెకేసి చూసి చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వులో ఎంతో చిలిపితనం, ఉత్సాహం ఉండి ఉంటాయి. చెలికత్తె కందని ఏదో చెట్టుకొమ్మన పువ్వుని ఎగిరి కోసి ఆమె సిగలో తురిమాడు. చెలికత్తె సిగ్గుపడింది. వెంటనే అటు యిటూ చూసి అతడు ఆమెను పొదివి పట్టుకుని, చుంబిస్తూ, చెట్టు పక్కగా తీసుకెళ్ళిపోయాడు. తర్వాత జరిగే విషయాన్ని కన్నార్పకుండా ఆ చెట్టే మందాకినీదేవికి అడ్డువచ్చి దాచేసింది. ఆ నాడు ఆ జరిగేదేమిటో చూడాలనే ఉద్రేకానికి, అందుకు శతవిధాల ప్రయత్నించినప్పుడు తన మానసిక బలహీనతకి ఎంతగా సిగ్గుపడిపోయిందో తను. ఆ సంఘటన చూసిన తన మనస్సు ఎంత ఆందోళన పడింది. ఆసనంలో కూలబడి తను కన్నీరు కార్చింది. ఆ సంఘటన తనని మానసికంగా దెబ్బకొట్టడానికి, హేళన చెయ్యడానికే ఉద్దేశింపబడినట్టుగా తను బాధపడింది. చెరగని

ముద్ర వేసింది. అతనెంత బలంగా ఆమెని కౌగిలించుకున్నాడు. ఎంత బలంగా చుంబించాడు. కాని అతను చేసిన ఈ ఏ క్రియలోనూ తను పాల్గొనలేదనే విషయం తన్నెంతో కలవర పెడుతోంది. ఈ ప్రపంచంలో అందరికీ సామాన్యమైన ఈ మధుర సంఘటన తనకెంత అపురూపమైపోయింది. అయినా యీ రాత్రైనా దశరథ మహారాజు వస్తాడేమో!

'రాణీ మందాకినీదేవి తమ భోజనానికి వేళైంది' చెలికత్తె వినయంనటిస్తూ చెప్పింది.

'ఈ వేళ శరీరంలో బాగుండ లేదు భోజనం చేయను. తలుపువేసి ఎవర్నీ రానివ్వకు' అని సమాధానం చెప్పింది రాణి.

తను శాఖిలీ రాజ్యానికి రాజైన వీరేంద్రుని కూతురు. తన పదిహేను సంవత్సరాల జీవితాన్ని శాఖిలీరాజ్య అంతఃపురంలోనే గడిపింది. అప్పుడు కూడా అంతఃపురంలోనే అయినా, వినోదాలలోనూ, ఆటపాటలలోనూ మునిగి పోయేది. తన తల్లితండ్రులను చూదిన క్షణాలు తనకి బహు తక్కువ. తనకి జ్ఞానం వచ్చిన తర్వాత, తల్లికి దూరంగా వేరే ఉండే ఏర్పాట్లు జరిగాయి. తనకి ఆరోగ్యం బాగుండనపుకో, యిలాంటి మరో కారణం వల్లో తన తల్లి వచ్చి చూసి వెళుతూ ఉండేది. తన తండ్రిని చూసిన క్షణాలు ఆమెకు మరీ తక్కువ. ఒక రోజు మాత్రం తనకి బాగా జ్ఞాపకం ఉంది. చెలికత్తె వచ్చి తనని తన తల్లి అంతఃపురానికి తీసుకు రావలసిందిగా నాన్నగారు కబురు చేశారని చెప్పింది. (ఆ రోజు వంతుప్రకారం నాన్నగారికి తన తల్లి దగ్గరకు వచ్చే రోజయ్యుంటుంది) తను రాజసన్నిధానంలో వేసుకొనవలసిన దుస్తులు ధరించి తన తల్లి అంతఃపురానికి వెళ్ళింది. తన తల్లి, తండ్రి ఆసనంమీద కూర్చుని ఉన్నారు. ఆరోగ్యం గూర్చి పరస్పరం సంభాషించుకున్న తర్వాత నాన్నగారితో తల్లి ఇలా అంది 'యువరాణికి యుక్త వయస్సు వచ్చింది, సంబంధాలు చూడండి.'

'నిజమే, గుర్తు చేశావు. అప్రయత్నంలో వుండమని మంత్రిని రేపే ఆజ్ఞాపిస్తాములే' అన్నారు నాన్నగారు.

తను సిగ్గుపడుతూ వచ్చేసింది. రాజాంతఃపురాల్లో ఇలాంటి సంభాషణలు తప్ప వేరే ఉండక పోవడం వల్ల తల్లి అభిమతం తనకి వెంటనే అర్థమయింది. తను ఇంకో విషయం ఏది అర్థం చేసుకోలేదేమో కూడా.

ఓనాడు చెలికత్తె వచ్చి నవ్వుతూ, హేళనగా తనకి చెప్పింది. తన తల్లి తండ్రిగారితో యిలా అందిట "యువరాణికి వినోదానికి జతగా ఎవర్నైనా పంపించండి. ఈ మధ్య ఏదోలా ఉంటోంది. స్వయంవరం ఏర్పాట్లు చేస్తున్నారా ?"

"స్వయంవరానికి ఈ పరిస్థితుల్లో వీలుండదు. మనం దశరథ మహారాజుతో యుద్ధంలో ఉన్నాం. ఈ లోపుగా మనకు యుద్ధ ఖైదీ అయిన శాక్తేయ రాకుమారుణ్ణి పంపిస్తాం" అన్నారుట నాన్నగారు.

ఏ విషయంలో తను గోప్యంగానూ, రహస్యంగానూ ఉండదలుచుకుందో, ఆ విషయాలు తన తల్లిదండ్రులు, ఇంత సాధారణంగా, చెలికత్తెలు వినేలా ఎలా మాటాడుకుంటారో తన కర్థంకాలేదు. శాక్తేయ రాజకుమారుణ్ణి తను రాజ ప్రాసాదంలో ఖైదుగా తీసుకు వచ్చినపుడు తెరల మరుగునుండి చూసింది ముప్ఫై ఏళ్ళకు పైగా ఉంటాయి. అతని కూడా అతని భార్య, యిద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఖైదీలమీద జుగుప్స, చులకన కలిగించుకోడం సహజమైన రాజవంశీకుల్లాగే తనూ నిర్లక్ష్యంగా చూసింది. అతడు తనకి ఏవిధంగా జత అవుతాడని తల్లిదండ్రులు అనుకున్నారో అర్థం కాలేదు. ఇదట్లా ఉండి రాజకుమార్తె అయిన తనకి తన దేశం

దశరథునితో యుద్ధంలో ఉన్నదన్న విషయం అప్పుడే తెలిసింది.

కొన్ని రోజులకి, శాక్తేయ రాజకుమారుడు తన అంతఃపురానికి రాకముందే, దశరథుడు యుద్ధం గెల్చుకున్నాడు. తన తండ్రి యుద్ధంలో చంపబడ్డాడు. తల్లి వెంటనే విషం తాగి మరణించింది. దశరథుడు అంతఃపురంలోని చాలా మందిని ఖైదీలుగా పట్టుకున్నాడు. తనని పెళ్ళి చేసుకున్నట్టు ప్రకటించాడు. పెళ్ళిలాంటిది జరగకపోయినా, కన్యాదానం చెయ్యవలసిన తల్లి తండ్రులు చనిపోవడం వల్ల, ఓడిన రాజవంశ స్త్రీలను అనుభవించే హక్కు ఉన్నదనే సూత్రం వల్ల తను అతని భార్యగా ప్రకటింపబడింది. తను దశరథుని అంతఃపురానికి తరలింప బడింది.

ఇంత జరిగినా తను దశరథుని చూడలేదు. దశరథుని అంతఃపురానికి వచ్చిన తర్వాత అతని వందల భార్యలలో తను ఒకర్తె అయిన విషయం, దశరథుడు కోరికలు ఉడిగిపోయే ముసలితనంలో ఉన్నవాడన్న విషయం తెలిశాయి. తనకి యింకా అప్పటికి పదిహేనవ ఏడు నిండలేదు. పైగా తన వంశం అనాగరికమైనదని దశరథుని వంశం భావించేది.

యుద్ధంలో గెల్చిన తర్వాత రాజ్యంలో వేడుకలు, రాజప్రాసాదంలో విందులు, దశరథునికి జయ

జయధ్వానాలు లాంటి సంరంభాలన్నీ అయిన తర్వాత దశరథుడు ఓ రోజు తన అంతఃపురానికి వస్తాడన్న విషయం తెలిసింది. ఆ రోజంతా చెలికత్తెలు అలంకరణలతో తనని, అంతఃపురాన్ని వెలిగించేశారు. ఈ ప్రయత్నాలన్నీ తన జీవిత పరమావధేదో యీ రోజు తనను వరిస్తోందని, జీవిత సాఫల్యాన్ని అంతనీ కానీ రోజు కౌగలించుకో బోతోందనే అభిప్రాయం అంతఃపురంలో కల్గించి తన లోనూ కొంత వరకు ఉత్సాహం కల్గించాయి.

దశరథుడు తన అంతఃపురానికి వచ్చాడు. వస్తూనే 'కాశీలి వంశ రాజ కుమారివి కదూ' అని తన్నడిగాడు. ఆ ప్రశ్న ఎంత అర్థరహితమైనది? అతని ఆగమనంలో కానాశించిన ప్రత్యేకతగానీ, ఉత్సాహం గానీ ఏం లేదా? తనెవరో తెలియకుండా ఏం చేద్దామని వచ్చాడో?

'అవును' తను సమాధానం చెప్పింది.

దశరథుడు తనని దగ్గరకూర్చో పెట్టుకున్నాడు. తన నాన్నగారి దగ్గర కూర్చుంటూ కి, దీనికి ప్రాథమికంగా ఉద్దేశంలోనే భేదం ఉండవచ్చుగానీ, అలాంటి ఉద్దేశమే తనకి దంపుకుందామన్నా ఏర్పడి పోయింది. దశరథుడు నాన్నగారికంటె చిన్నవాడు కూడా కాడు. శారీరకంగా అతనిపైన రాజాభరణాల ఆర్భాటం తప్ప ఉన్నతమైన దేదీ అతనిలో తనకి కన్పించలేదు. దశరథుడు తనని లాలిస్తూ భాషణలనారంభించాడు. అందులో తనపై ప్రేమని (యిది అసాధ్యమయినా) వ్యక్తపరచే ఉద్దేశం లేకుండా, తను రాజ్యాన్ని గెల్చుకున్న అతిశయం, ఇందు కోసం అతని మహోన్నతత్వానికి తాను చూపవలసిన కర్తవ్యం అనే భావం అతని సంభాషణలో వ్యక్తమయ్యాయి. చాలా రాత్రయింది వింటూ అతని ఒడిలోనే నిద్రపోయింది తను. కాస్సేపటికి అతను లేపి 'చిన్నపిల్లవు సుమా! అయినా ఫర్వాలేదు' అంటూ దగ్గరకు లాక్కున్నాడు.

తెల్లారి తను లేస్తుండగానే దశరథుడు తన దుస్తులు, ఆభరణాలు ధరించి వెళ్ళిపోతున్నాడు. వెళ్తూ 'నే వెళ్తున్నాను. తిరిగి మరుసటి సంవత్సరంలో యిదే రోజున వస్తాను.' అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రోజు చెలికత్తెలందరూ తనని చూస్తూ నవ్వుతూ వేళాకోళాలాడినా రాత్రి జరిగిన విషయంలో కొట్టవచ్చిన ప్రత్యేకతగానీ, సంతృప్తిగానీ తనలో ఏర్పడలేదు. ఇది గమనించిన చెలికత్తెలు అలాంటి సంభాషణలు మానివేశారు. ఒక ముసలిదాసి ఏదో మాటాడబోయి కళ్ళు తుడుచుకుంది.

అప్పటినుండి తనకి యాంత్రిక

జీవితం, ఈ గవాక్షం, ఈ పువ్వులూ మిగిలి పోయాయి. మరుసటి సంవత్సరంలో దశరథుడు తన దగ్గరకు రాలేదు. అతను చేసిన యాగాల వల్లో, పెద్ద ప్రయత్నాలవల్లో, కొడుకులు లేని అతని పెద్దరాణులు ముగ్గురికీ నలుగురు కొడుకులు పుట్టారు. అందుకు జరిపే వేడుకలలో మునిగి పోయిన రోజుల్లో తన వంతు రోజు రావడం వల్ల రాలేకపోయాడు. ఈ ఒక్క సంవత్సరంలో తనలో వచ్చిన మార్పో, ఏమో కానీ, అందుకు నిశ్చయ రూపం లేని అస్పష్టమైన బాధేదో తనలో కలిగింది.

ఆ తర్వాత ఎప్పుడూ దశరథుడు తనదగ్గరికి రాలేదు. 'వంతురోజులు' ప్రతి ఏడాదీ వస్తూనే వున్నాయి. బహుశ అతని ముసలితనం పూర్తిగా నిర్వీర్యుణ్ణి చేసిందేమో. ఇది తనకి భయంకరమైన ఆలోచన. లేక అతని కొడుకుల మీద శ్రద్ధ ఎక్కువై (వారిపై అతనికి అవ్యాజానురాగమని తనకి చెలికత్తెలు చెప్పారు) తీరికలేక రాకపోవచ్చు. దశరథుని కొడుకులని తను చూసింది. ఏదో పడగనాడు ఉదయం, నదిలో స్నానం చేసి రథంలో వస్తూ ఉండగా, రాజసైనికుల శిక్షణ మైదానంలో వారు ఆయుధాల కవాతు చేస్తున్నారు. అందులో ఒక కుర్రవాడు తనకి పానీయం అందించడంలో అయిన ఆలస్యానికి సేవకుడిని కొడుతూ వుంటే మిగిలిన ముగ్గురు పిల్లలూ, రాజవంశీకులకు సహజమైన దర్పంతో చూస్తున్నారే తప్ప కలగ చేసుకోవడం లేదు. తను అంతఃపురానికి వచ్చేసింది. ఆ తర్వాత వాళ్ళు పెద్దవాళ్ళవడం, పెళ్ళి అవడం కూడా తను చూసింది. దశరథుని పెద్ద కొడుకు ఏకపత్నీ వ్రతుడట. ఇది దశరథునికి వ్యక్తిగతంగా యిష్టంలేకపోవచ్చు. పోనీ యీ రాత్రయినా తన మందిరానికి వస్తాడేమో!

"రాణీ మందాకినీదేవీ, వైద్యుడను పిలిపించాను ప్రవేశ పెట్టమంటారా?" చెలికత్తె తలుపు తెరచుకుని వచ్చింది

"వద్దు! స్వస్థతగానే ఉంది" అంది రాణి.

"అయితే భోజనం ఏర్పాట్లు చేయమంటారా?"

"వద్దు! ఈ రోజు భోజనం చెయ్యను."

చెలికత్తె తలుపువేసి వెళ్ళి పోయింది.

రాణి పాతలోని మదిర తాగింది. వైద్యుడిని పిలిపించడం ఆమెకి చాలా అసహ్యకరంగానూ, నవ్వులాటగానూ కన్పించింది. అంతఃపురాల్లో ఉండే పురుష భృత్యవర్గంలాగే ఈ వైద్యుడు కూడా ముసలివాడు. ఇతను తనకి మందు వెయ్యగలడా? చాలాకాలం ఎంతో ఆశతో ఎదురు

చూసిన విషయం అందుబాటులోనికి రానపుడు కలిగే భయంకరమైన నిర్లిప్తతే తన కేర్పడింది. ఎన్నాళ్ళీ ఎదురుచూడ్డం? ఈ చూడడం ఎవరి కోసం? అందుబాటులో ఉండే వ్యక్తి అనగ్గాడు ఇప్పుడా అవకాశం కూడా లేదు. ఆ పువ్వుల్లాగే తనూ రాలిపోతుందా? ఈ ఆశ ఎంత హాస్యాస్పదమైనా యీ రాత్రైనా దశరథుడు వస్తాడేమో!

రాణి ఇంకాస్త మదిర త్రాగింది. అయినా తన జీవితంలో ఇంకేం ఆదర్శం లేదా? ఇంకేం బాధ్యతా లేదా? ఈ శరీరాన్ని ఎవరికి వ్వాలి అనే ప్రశ్న తప్ప సామాన్య జీవితాన్నెదుర్కొనే ఇంకో సమస్య లేదా? ఇదే రాణీ అయిన తనకుండే సౌఖ్యమా? ఈ మెత్తటి పరుపులూ, బంగారు పాత్రలూ, చెలికత్తెలు, పంచభక్ష్యాలూ లేని యింకే మారుమూల అరణ్యంలోనైనా ఇంతకన్నా ఆనందంగా బ్రతక వచ్చేమో!

రాణీ మరికాస్త మదిర త్రాగింది, ఇలాంటి ఫలించని జీవితాన్నుండి, యీ కుళ్ళు వాతావరణం నుండి బయటపడటమెలా? చనిపోవడం మంచిదేమో! తను చనిపోతే బహుశ యీ లోటు మరో స్త్రీతో, తనకన్నా యువ్వని, తనకన్నా సౌందర్యవతి, సుకుమారి అయిన మరో స్త్రీతో పూడ్చబడుతుంది. అవును. ఇదేం పవిత్రత అపాదించవలసిన స్థానం కాదు. శాశ్వతమైన సంబంధం కలదీకాదు. రాజ్యంలో చాలా ఉద్యోగులవలె తనూ ఒక ఉద్యోగిని. ఈ రాజు యొక్క ఘనతని పెంచే అనేకమైన యిలాంటి స్థానాలను ఆక్రమించటం తప్ప ఇంకే విధమైన వ్యాపారమూ చేయలేని ఉద్యోగిని.

రాత్రి చాలా గడిచిపోయింది. తనకి ఆశపోలేదు. దశరథుడు ఇంకా వస్తూ ఉండచ్చు. మెల్లిగా వచ్చి ఆసనంలో కూర్చుంది రాణి.

ఇంతట్లోకే గవాలున తలపుతీసి చెలికత్తె లోపలికి వచ్చి "రాణీ! దశరథమహారాజు కైకేయి రాణి అంతఃపురంలో గుండె పగిలి చచ్చిపోయాడు" అంటూ గాభరాగా చెప్పి, రాణికి దుఃఖంలో వచ్చే తానూహించిన కోపానికి భయపడి వెళ్ళిపోయింది.

"చచ్చిపోయాడా! చచ్చిపోయాడా!" అని రాణి మందాకినీదేవి నిశ్చేష్టురాలయి పోయింది. అకస్మాత్తుగా రాణి దృష్టి తోటలోని ద్వారపాలకునిపై పడింది. ధిగ్గున లేచి వస్త్రాలు సరిచేసి గవాక్షంగుండా అతన్ని పిలిచింది. అతడు పరిగెడుతూ కిటికీ వద్దకు వచ్చి భయ

వేడుతూ, వినయంగా నుంచున్నాడు. రాణి అతన్ని దగ్గరగా పిల్చి అతని చేతిని పట్టుకుని 'నువ్వు నన్ను నీతో ఎక్కడికైనా తీసుకు పోతావా? ఏ అరణ్యాల్లోకో, కొండల్లోకో' అంది.

వణుకుతూ ఉన్న ద్వారపాలకుని నోట మాటరాలేదు.

'చెప్పు, నా నగలన్నీ పట్టుకు వస్తా, తీసుకుపోతావా?'

'నా తల తీసేస్తారమ్మగారూ, నన్ను బతకనివ్వరమ్మగారూ, క్షమించండమ్మా; నాకిలాంటి మాటలు చెప్పకండమ్మా, చచ్చిపోతానమ్మా, క్షమించండమ్మా' అంటూ గాభరాగా వణుకుతూ అతను పారిపోయాడు, బాధను గురించి నిశ్చయం చేసుకుని.

రాణి కళ్ళనిండా నీళ్ళు పొంగుకు వచ్చాయి. ఆపుకోలేని దుఃఖంతో చేతులు నిస్సహాయంగా కిటికీలో వేలాడదీసింది. పేలవంగా నిలబడి పోయింది. వెంటనే ఏదో నిశ్చయం చేసుకున్నట్టు వ్రేలికి ఉన్న విషపుటుంగరాన్ని మ్రింగి నమిలింది.

• • •

రాణి మందాకినీ దేవి చని పోయింది. అందరూ ఘనంగా చెప్పుకున్నారు: ఆమె సౌశీల్యాన్ని గురించి, దశరథునిపట్ల ఆమె ప్రేమ గురించి, ఆత్మహత్యకు దారి తీసిన ఆమె పాతివ్రత్యాన్ని గురించి.

□□□

● రాజుగారు పరివారంతోసహా అడవికి వేటకు బయల్దేరారు. చాలాదూరం పోయాక వున్నట్టుండి ఆయన గుర్రానికి జబ్బుచేసి కూలబడిపోయింది. ఆ దగ్గర్లోవున్న గ్రామంలో వాకబు చేయగా ఇద్దరు పెద్ద రైతులకి చెరో గుర్రం వున్నట్టు తెలిసింది. రాజుగారు వాళ్ళకి కబురు చేయగా వాళ్ళు గుర్రాలతోసహా వచ్చారు. కాని, అవి పట్టి దండగమారి గుర్రాలని, పరిగెత్తలేవని వాళ్ళు మనవి చేసుకున్నారు.

గుర్రా లివ్వడం ఇష్టంలేకనే వాళ్ళు సాకు చెబుతున్నారని రాజుగారు గ్రహించారు. రెండు గుర్రాలకి పందెంపెట్టి ఏది బాగా పరిగెడితే అది తీసుకుంటామన్నారు.

"లాభంలేదు ప్రభూ! వాళ్ళు గుర్రాల్ని సరిగా పరిగెత్త నివ్వరు." అన్నాడు సేనాని రాజుగారి చెవిలో.

"మా బాగా పరిగెత్త నిస్తారు. ఒకళ్ళ గుర్రాన్ని మరొకళ్ళని ఎక్కమను" అన్నాడు రాజుగారు.

చదువుకున్న కమల

ముప్పాళ్ల రంగనాయకమ్మ

(గత సంచిక తరువాయి)

"వహ్ బాగా అడిగావురా!" అంటూ ముసలాయన పళ్ళికిలించి నవ్వటం సాగించాడు.

కమలకి ఒళ్ళు మండింది—కొడుకు కేసి తీక్షణంగా చూస్తూ అంది—"పిచ్చి పిచ్చి వేషాలెయ్యకు. నీకే అర్థమౌతుంది కదా అని వూరుకొంటున్నాను. నీ ఆగడం శ్రుతి మించి రాగాన పడతోంది. సైకిల్ మీద కూర్చోబెట్టుకుని చెల్లిని ఆడించాల్సింది పోయి దాన్ని క్రింద పడేలా తోసేస్తావా? వెధవా!" అంటూ కేకలేసింది.

'వాడేం చెయ్యలేదే! నీకు భయపడి అలా అంటున్నాడు కానీ, అదే దిగబోయి పడింది. పైగా ఏడుస్తోంది' అంటూ మనవడికి సపోర్టు పలికాడు ముసలాయన.

కమలకి అసహ్యం వేసింది—"వాడు ఒప్పుకొంటోనే వున్నాడు. మీ అబద్ధపు సాక్ష్యం ఎందుకూ?" అంది మొహం చిట్లించుకొంటూ.

"అయినా మొగరాయుళ్ళాగా దానికా సైకిల్ మీద ఆటలేవిటి?" అంటూ అందుకొంది శేషమ్మ.

కమల ఆశ్చర్యపడింది — "చిన్న పిల్లలకి మొగేవిటి? ఆడేవిటి? పిల్లల్ని కలిసీ మెలిసీ ఆడుకోమని చెప్పాలిగాని ఇలా పెద్దవాళ్ళే కజ్జాలు పెడుతోంటే వాళ్ళేం బాగు పడతారు? అన్నా చెల్లెళ్ళేం అన్న అభిమానా లేమన్నా వాళ్ళకి వుంటాయా?" అంది

"ఏమోనమ్మా! ఆ చోద్యాలన్నీ మాకు తెలీవు."

"తెలీకపోతే తెలియనట్టు వుండండి." అనేసి వెళ్ళిపోయింది కమల. వెళ్తూ వెళ్తూ తాతగారి సపోర్టుతో మొరాయించి నించున్న కొడుకు వైఖరి గమనించి మరీ వెళ్ళింది.

కమల మనస్సు చాలా చికాకైపోయింది. తన ప్రయత్నాలన్నీ వ్యర్థమై పోతోంటే ఈ అన్నా చెల్లెళ్ళని ఎలా కలపగలదు?

పిల్లల్లో ఎంత చెడ్డతనం వుంటుందో అంత మంచి తనం కూడా వుంటుంది. పెద్దవాళ్ళు ఆ మంచితనాన్ని ప్రోత్సహించి వాళ్ళల్లో వాళ్ళకి - అన్యోన్యతా సామరస్యం - కల్గించాలి.

ఇంట్లోవున్న పెద్దవాళ్ళకి బొత్తిగా ఏకాభిప్రాయం లేకుండా ఒకళ్ళు ఏటికి - మరొకళ్ళు కోటికి లాగితే మంచి జరుగదు సరికదా చెడ్డ తయారై కూర్చుంటుంది. పిల్లల్లో నిర్లక్ష్యం పెరుగుతుంది. మొండితనం అలవడుతుంది. భయభక్తులు నశిస్తాయి. నిరంకుశంగా ప్రవర్తించాలని విశ్వప్రయత్నాలు చేస్తారు.

సరిగ్గా కమల ఎదుర్కొంటోన్న సమస్య అదే! రామం ప్రేమల మధ్య అనురాగం పెంపొందచేయటంలో అత్తమామల సహకారం బొత్తిగా కొరత పడింది.

ఓసారి-మధుమూర్తి కుమార్ని కాసేపు ఎత్తుకు తిరిగి పేపరు చదువుకోవాలని వాణ్ణి కిందకూర్చోబెట్టాడు. వాడు కూర్చోనని మొరాయిస్తోంటే ఓ బిస్కట్టు యిచ్చాడు

తమ్ముడు చేతిలో బిస్కట్టు చూసిన ప్రేమ నిర్భయంగా అది కాస్తా వూడలాక్కుంది.

చంటివెధవ కెవ్వుమన్నాడు.

'అదిగో! అదిగో! పసివెధవని పడదోసి బిస్కట్టు లాక్కుందిరా దొంగముండ' కోపం ముంచుకుపోతోన్నట్టు అరిచాడు ముసలాయన.

చంటివాడు గుక్కపట్టి ఏడుస్తోంటే కూతురుమీద మితిమీరిన కోపం వచ్చేసింది మధుమూర్తికి.

'ఇంకా చూస్తావేంరా రెండు అంటించక? తగలనియ్!' అంటూ చుర్రున చూస్తూ కర్తవ్యం బోధించాడు ముసలాయన.

వెనకా ముందూ ఆలోచించకుండా కూతురి గౌను గుప్పిటతో పట్టుకుని చెళ్ళుచెళ్ళుమంటు చెంపలమీద అంటించాడు మధుమూర్తి.

భయంతో బెదిరిపోయి గొల్లుమంది ప్రేమ. ముసలాయన కేకలతో వరండాలోకి వచ్చిన కమల క్షణాలమీద జరిగిపోయిన ఆ సంఘటన చూసి అచేతనంగా నిలబడిపోయింది.

తండ్రి గౌను వదలగానే తల్లి దగ్గిరికి పోయి కాళ్ళకు చుట్టేసుకొంది ప్రేమ. కూతురితల ఆదరంగా నిమురుతూ ఒక్కసారి భర్తకేసి చూసి కూతుర్ని ఇంట్లోకి తీసుకుపోయింది కమల.

ఆ గందరగోళంతో చంటివాడు నోరు కట్టేశాడు. ఆవేశం తగ్గిపోయిన మధుమూర్తి చేసిన పనికి సిగ్గుపడిపోయాడు. భార్య కళ్ళల్లో కన్నీళ్ళు స్పష్టంగా చూసి-పశ్చాత్తాపంతో సతమతమై పోయాడు.

ఏడ్చి ఏడ్చి తల్లి ఒళ్ళోనే నిద్రపోయింది ప్రేమ. దాన్ని పరుపుమీద పడుకోబెట్టి లేచింది కమల. మూర్తి లోపలికి వచ్చి పరుపుమీద కూర్చుని నిద్రపోతోన్న కూతురికేసి తదేకంగా చూశాడు.

"ప్రేమ బాగా ఏడిచిందా?" నేరం చేసిన వాడిలా అడి డు.

కమల కాస్సేపు వూరుకుని అంది- "లేదు నిద్రపోయింది."

భార్య ముభావంగా వుండటాన్ని మూర్తి సహించలేక పోయాడు— "నేను చాలా తొందర పడ్డాను కమలా!" తనలాగే కమల కూడా తొందరపడితే రామాన్ని ఎన్నిసార్లు దండించాల్సి వుం దేదో బాగా తెలిసిం దాక్షణం

నిజమే. కమల ఎన్నోసార్లు అంటుంది. పిల్లలు తెలియకే తప్పులు చేస్తారు. పెద్దవాళ్ళు తెలిసి వివేకంతో వాళ్ళని సరిదిద్దాలి. అంతే గానీ ఆవేశాలూ కోపాలూ తెచ్చుకుని—పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం లాగా పిల్లల్ని పట్టుకు చావబాదితే వాళ్ళేమైపోతారు?

నిద్రలేచిన కూతుర్ని ప్రేమగా ఎత్తుకు తిప్పాడు మధుమూర్తి.

కూతురు తండ్రికి కాస్త చేరువైంది ఓసారి కమలఅంది— "ప్రేమ చిక్కిపోతోంది. లోలోపల బెంగపెట్టుకుంటోందేమోనని నాకు భయంగా వుంది."

"ఛ! బెంగపెట్టుకోవటం ఏమిటి? దానికి పెద్దవాళ్ళ దగ్గరే బాగా అలవాటు ఇక్కడ నాయనమ్మా తాతగారూ దాన్ని చేరదియ్యటం లేదు రామం కూడా దాన్ని దగ్గిరికి చేరనివ్వటం లేదు. ఏంచేసినా ముసలాయన కసరటం-అది ఏడుస్తూ పడుకోవటం అలవాటై పోయింది."

"పోనీ కమలా! ఆయన తత్వం అలాంటిది ఏంచేస్తాం చెప్పు?"

"అవును ఆ సంగతి మీకు తెలుస్తుంది, నాకు తెలుస్తుంది. పిల్లలకెలా తెలుస్తుంది? వాళ్ళ మధ్య సామరస్యం ఎలా వుంటుంది? వాళ్ళకి కావలసింది ప్రేమ. అది



లోపిస్తే వాళ్ళ మనస్తత్వాలు దారుణంగా మారవచ్చు.'

కమల సైకాలజిస్ట్‌లా మాట్లాడుతోందని మధుమూర్తి హాస్యం చెయ్యలేదు. ఆ సైకాలజీ గురించి తను కూడా కొంచెం ఆలోచించాడు — 'ప్రేమని గురించి నువ్వేం బాధపడకు కమలా! తల్లిదండ్రులం మనం వుండగా దానికెప్పుడూ లోటురాదు' అన్నాడు.

కమల సంభ్రమంగా చూసింది. బిడ్డల విషయంలో తండ్రి అలాంటి శ్రద్ధ వహిస్తానంటే ఏ తల్లయినా సంతోషిస్తుంది. తృప్తి పడుతుంది. 'అవుననుకోండి. అయినా దాని ప్రపంచం అంతా మన యిద్దరితోటే లేదుకదా?' అంది.

మధుమూర్తి కొడుకుని పిల్చాడు. బుజ్జగిస్తూ చెప్పాడు — 'చెల్లితో నువ్వు జట్టుగా వుండటం లేదు కదూ? నేను కనిపెడుతూనే వున్నాను. నీ ధోరణి నాకేం నచ్చలేదు సుమా! మన చెల్లి మన ఇంట్లోనే వుంటుందిగానీ ఎక్కడికి పోతుంది చెప్పు. చక్కగా మీ రిద్దరూ కలిసి ఆడుకోవాలి. కలిసి బళ్ళోకి వెళ్ళాలి. అమ్మ చెప్పినట్టు వినాలి' అంటూ ఓ పావుగంట బాగా నచ్చచెప్పాడు.

'ఏదీ? మీ రిద్దరూ జట్టుగా నించోండి.' అంటూ నవ్వుతూ అన్నాచెల్లెళ్ళ చిన్నారి చేతులు కలిపి - ప్రేమకీ రామూనికీ స్నేహం కుదిర్చాడు.

తండ్రి ప్రతీ విషయానికి కలగజేసుకోడు. కలగజేసుకుని చెప్పాడూ అంటే దాన్ని మీరటానికి వీల్లేదు. ఆ సంగతి రామూనికి తెలుసు.

'రావే చెల్లీ! ఆడుకుందాం' అంటూ ప్రేమని తీసుకు పోయాడు. తండ్రి చూస్తోండగా దాన్ని సైకిల్ తొట్టిలో కూర్చోబెట్టి యిల్లంతా ఉత్సాహంగా తిప్పాడు.

కమల హృదయం చల్లబడింది. కానీ ముసలాయన కా దృశ్యం కంటకింపైంది. 'ఒరే రావుడూ! నీకో కథ చెప్తాను ఇలారా!' అంటూ మనవణ్ని ఆదరంగా పిల్చాడు.

'ఊహూ! నేను రాను. చెల్లీ నేనూ ఆడుకొంటున్నాం. మానాన్న ఆడుకోమన్నాడు.' అంటూ సైకిల్ విసురుగా తొక్కుకుంటూ పోయాడు రాము.

మొగపిల్లల దృష్టిలో తండ్రికి ఎంత విలువ వుంటుందో తెలుసుకోగలిగాడు మధుమూర్తి.

కమల వేదాంతినిలా అంది— 'కొంత కాలానికి మనం యిద్దరం వుండక పోవచ్చు. తల్లిదండ్రుల్లేని పిల్లలు వాళ్ళలో వాళ్ళే ఆప్తులై— ఆ లోటు భర్తీ చేసుకుంటూ వుంటారు. అందుకే తోడబుట్టిన వాళ్ళు అభిమానాలతో వుండాలంటారు.'

భార్య మొహంలో చిత్రమైన తృప్తి చూశాడు మధుమూర్తి.

● ● ●

ఒక్క ప్రేమ విషయంలోనే కాదు. రామం విషయంలోనైనా మామగారికి వున్న అనురాగం ఏ కోవకి చెందిందో—కమలకి అర్థం కాదు.

పిల్లల సహజమైన లక్షణాలన్నీ ఆయనకి చాలా విరుద్ధంగా కన్పిస్తాయి. వాళ్ళు త్రుళ్ళుతూ గెంతుతూ – అల్లరి చేస్తూ – ఆడుకొంటోంటే ఆయన బొత్తిగా సహించలేడు మొహమంతా నోరు చేసుకుని — 'కోతి వెధవల్లారా! వెధవ అల్లరి మీరూను ఓ మూల కూర్చుంటారా లేదా?' అంటూ మంచం మీదనుంచి లేచి పిల్లల్ని ఇల్లంతా తరుముతాడు. అందిన వాళ్ళని ఒకొక్క చరుపు చరుస్తాడు. అక్కడితో వాళ్ళ వుత్సాహం నీళ్లు కారిపోయి గొల్లుమని ఏడుస్తోంటే కమల కలగజేసుకోక తప్పదు.

'పిల్లలు ఆడుకొంటోంటే మీకెదుకా కోపం?'

'కోపం ఏమిటి? చెవులు గళ్ళుపడేలా అరుస్తోంటే ఎంతకని భరించటం? నిక్షేపంలా ఓ మూల కూర్చోరాదూ?'

'పిల్లలు మూలకూర్చుంటే పెద్దవాళ్ళా ఆడుకునేది?'

'ఏమిటా వెధవాట? కోతుల్లా గెంతటమేనా?'

'గంతు లెయ్యకుండా – కిక్కురుమనకుండా ఇంకెలా ఆడుకుంటారు? మన పిల్లలు మన యింట్లో ఆడుకోకపోతే ఎక్కడికి పోతారు? పొరుగిళ్ళకి తరవటం బావుంటుందా? పోనీ మీరే నిద్రయినా పోతున్నప్పుడు అల్లరి చెయ్యద్దన్నా బావుంటుందిగాని—నిత్యం—ఇరవై నాలుగ్గంటలూ వాళ్ళనిబుద్ధిగా కూర్చోమంటే ఏమైపోతారు?'

'కేక లెయ్యకండర్రా అని చెప్పాను. అంతమాత్రానికే వాళ్ళని నేనేదో మింగేసినట్టు అంత గింజుకుపోతా వెందుకు? వాడేం చేస్తున్నాడో చూసేవా అసలు? తలుపులమీదికీ, కిటికీల మీదికి ఎగబాకుతున్నాడు అక్కణ్ణుంచి - దభీ దభీ మని వురుకుతున్నాడు.'

'అవును. అలా గంతులెయ్యకపోతే వాళ్ళకి తిన్నదెలా అరుగుతుంది? ఆరోగ్యం ఎలా బావుంటుంది? ఎంత అల్లరిచేస్తూ ఆడుకొంటే - అంత చురుగ్గా - ఉత్సాహంగా వుంటారు.'

'ఉంటారు. వుంటారు అక్కణ్ణుంచి వూడి కిందపడితే మాబాగా వుంటారు'

'మరేం మునుచుకు పోదు. తగిలితే ఓ దెబ్బ తగులుతుంది— 'పడిపోతావ్ పడిపోతావ్' అంటూ మనం అరవడం కంటే ఓ సారి పడి లేస్తే వాళ్ళకే తెలిసివస్తుంది.'

'సింగినాదం తెలుస్తుంది. అభిగికి ఆడముండ కూడా వాడితో సమంగా గంతులేస్తోంది. ఏ కాలో

చెయ్యో ఫటుక్కున విరిగితే అవుతుంది. ముండపని.'

'ఆ సముండకే కాదు. మొగవెధవకైనా కాలూ చెయ్యీ విరిగితే కష్టమే అయినా గంతులేస్తూ ఆడుకున్నంత మాత్రాన కాళ్ళూ చేతులూ – ఫటుక్కుమంటూ మీకు సంబరం కలిగేలాగ విరిగిపోవు అలా అయితే పిల్లవెధవలంతా పెద్ద వెధవలు కాకుండానే కుంటి వెధవలై వుండేవాళ్ళు.''

కోడలి తర్కానికి – అంతులేని కోపం వచ్చేసింది ముసలాయనకి – 'నువ్వు మాటలు నేర్చావే! నీతో నేనేం నెగ్గగలనూ? కట్టుకున్న వాడే నోరు మూసుకుని వూరుకున్నాడు.'

నిర్ఘాంత పోయింది కమల.

గౌరవం పొందదగ్గ మామగారి లాంటి పెద్దమనిషి కోడలితో అంత చౌకబారుగా మాట్లాడటం ... అత్తగారు తనతో ఎలా దెబ్బలాడినా ... సహించవచ్చు. కోడలు కొడుకుని అప్రయోజకుణ్ణి చేసేసిందనా ఆయన అభిప్రాయం?

కమల గదిలోకి పోవటంతో తాత్కాలికంగా ఆ దెబ్బలాట ఆగింది. కాని, పిల్లల్ని పెద్దవాళ్ళు చీటికి మాటికి కసిరికొడుతోన్నంత కాలం ఇంట్లో ఏ దెబ్బలాటా రేగకుండా ఎలా వుంటుంది?

'అమ్మా! బ రా ణీ ల వా డొ చ్చాడే! కొనవే అమ్మా! కొనవే!' అంటూ మా రా ం సాగించింది ప్రేమ.

అప్పటికే శేషమ్మ వాణ్ణిపిల్చింది రామం వెనకే ప్రేమకూడావరిగె త్తింది.

'ఎందుకురా వెధవ బరాణీలూ మీరూనూ? కటుకూ కటుకూ మంటూ పళ్ళన్నీ నొప్పులు.' అంటూ కసురుకున్నాడు మునలాయన

'పిల్లల కోసమూ? మీ కోసమూ బతాణీలు కొంటోంది? ఎందుకా అనవసరం కేకలూ?' అంటూ విసుక్కుంది శేషమ్మ.

'అసునవును ఎవరికోసం కొంటున్నావో అంతశ్రమపడి నాకూ తెలుసు. పిల్లవెధవల మీద వొంకెందుకూ?' అన్నాడు ముసలాయన.

వాళ్ళిద్దరి జగడం వింటూకూర్చోకుండా అత్త గారు బియ్యం పోసే లోపల ఓ బేడయిచ్చి బతాణీలవాణ్ణి పంపించేసింది కమల

ఓసారి— తాతగారి పక్కలోంచి నెమ్మదిగా బ్యాటరీ లైటుతీసి జేబ్లో పెట్టుకుని చాటుగానే వెలిగించాడు రామం. ఆ వెలుగు కాస్తా అందరికీ కన్పించేలా గోడమీదపడింది

ప్రేమ పకపకా నవ్వుతూచప్పట్లు కొట్టింది.

'ఒరేయ్ కోతి వెధవా! ఆ లైటు తీశావుట్రా?' అంటూ గావు కేక పెట్టాడు ము స లా య న. గబగబావచ్చి మనవడి చేతిలో లైటుకాస్తా గుంజి లాక్కుని—' రవుడీ వెధవా! ఈ సారి తీశావంటే నీవు చిట్లకొడతాను నెత్తురు చిమ్మేలాగ. డొక్కలో ఒక్క పోటు పొడుస్తాను. గిలగిలా తన్నుకు కింద పడతావు' ఓ సే య్! వెధవ ముండా! అన్నగారి ప్రతాపం చూసి ఇకిలిస్తున్నావుటే? పదహారు పళ్ళూ రాలగొడతాను.' అంటూ పిల్లల్ని తిట్లతో చిత్రవధచేస్తూ లైటు అందకుండా పై బల్లమీద పెట్టేశాడు. 'తాతయ్యా ఒక్క సారి చూపించవ్? ఒక్కసారి చూపించవ్?' అంటూ ఎగబాకుతోన్న రామాన్ని దూరంగా తోసేశాడు.

ఆ గోలంతా భరించలేక – మధుమూర్తి 'ఒరేయ్ రాము! నువ్విలారా!" అంటూ కేక పెట్టాడు. అడుగులో అడుగు వేసుకొంటూ పిల్లిలాగా వచ్చాడు రామం. అన్నగారికేం శిక్ష పడుతుందోనన్న భయంతో ప్రేమ కూడా వచ్చి బిక్కు బిక్కు మంటూ చూస్తూ నించుంది.

'ఏమిట్రా ఆ గోల? ఆ యన లైటు నువ్వెందుకు ముట్టుకున్నావుఠ?' అంటూ కోపంతో గద్దించాడు తండ్రి.

'చూద్దామని నాన్నా!'

'ఏం చూస్తావ్?... ఇంకెప్పుడూ

ముట్టుకోకు. తెలిసిందా?' కళ్ళెర్ర జేసి చూశాడు మధుమూర్తి.

'అలా అడుగు వెధవని. గడ్డి పెట్టు. ఆ ముండ ఒకత్తె వాడికి సాయం.' అంటూ వచ్చాడు ముసలాయన.

'పిల్లలంటే మీ కెందుకంత గిట్ట నివ్వరు?' అని మధుమూర్తి అడిగేస్తే ఎంత బావుండును! అది చేతకాని మధుమూర్తి పిల్లల్నే మరోసారి హెచ్చరించాడు.

తండ్రి మాటలకి తల తాటించి ఒప్పేసుకున్నాడు రామం.

కానీ కొడుకు మనసు కమలకు తెలును. ఆ బ్యాటరీలైటు ఎలా వెలుగుతుందో చూడాలని వాడికోరిక. ఎన్నోసార్లు తాతగార్ని అడిగాడు. ఆయన కసిరికొట్టటంతో దొంగతనంగానైనా తీసి చూడాలని ప్రయత్నించాడు. అదీ వీలు కాలేదు. వాడి అభిలాష ఏమిటో అర్థం చేసుకోకుండానే వార్నింగు యిచ్చి వూరుకున్నాడు మధుమూర్తి.

కమల అంది-'ఆ లైటు ఒక్క సారి విప్పదీసి ఆ బ్యాటరీలూ — బల్బూ — గొట్టం — అన్నీ చూపించేస్తే వాడి కుతూహలం ఎప్పుడో తీరి పోయేది. అది ఎలా వెలుగుతుందో — అందులో ఏం రహస్యం వుందో తెలుసుకోవాలని వాడికి ఎన్నాళ్ళనుంచో వుంది.'

మధుమూర్తి జవాబే చెప్పలేదు. నిజానికి అప్పుడే వూహ తెలుస్తున్న పిల్లలకి ప్రపంచమంతా ఇంద్రజాలంలా కన్పిస్తుంది. ప్రతీ వస్తువూ అమితాశ్చర్యాన్ని కల్గిస్తుంది. అగ్గిపుల్లలు మండటం — అగరొత్తుల్లోంచి కమ్మటి పొగరావడం — కాయితంముక్క కాలి నల్లబడిపోవడం — లాంటి సామాన్యమైనవిషయాలని వాళ్లు కుతూహలంగా కనిపెడతారు. కాకిలాగే విమానం ఎగురుతోంటే ఆశ్చర్యంతో చప్పట్లు కొడతారు — అందరిలాగా రేడియో మాట్లాడుతోంటే ఆనందంతో గంతులేస్తారు.

'అదేమిటి? అదెందుకు?' అంటూ లక్షాతొంభైప్రశ్నలు వేస్తారు.

ఆ అభిలాషే వాళ్ల భవిష్యత్ సౌధానికి మెట్లు కడుతుంది. ఆ అభిరుచే ఆ సౌధానికి గమ్యం ఏర్పరుస్తుంది,

"రాను౦ ఇ౦జనీరౌతాడేమో!" అనుకొంది కమల

బ్యాటరీ లైటు తెచ్చి కొడుక్కి చూపించే ప్రయత్నమేమీ చెయ్య లేదు మధుమూర్తి. నిర్లిప్తంగా ఇంటి కప్పు కేసి చూస్తూ మడతకుర్చీలో వెనక్కి వాలి పడుకుని వున్నాడు.

అంతవరకూ భర్త వైఖరి గమనించని కమల కాస్త కంగారు పడింది.

మధుమూర్తి బొత్తిగా డబ్బు యిబ్బందులతో మతి పాడుచేసు కుంటున్నాడు ఎటు చూసినా అప్పులూ వడ్డీలూ తప్పితే కనుచూపు మేరలో ఆస్తి అన్నది కనిపించటం లేదు కమల మెడలో రెండువరసల గొలుసు తప్ప.

రెండేళ్ల క్రిందట గాజులు అమ్మనే అమ్మాడు. కాస్త మెరుగైన పరిస్థితి మళ్లా యథాస్థితి అయింది. ముందు ముందు ఖర్చులు పెరిగే కాలంగానీ తరిగే కాలంకాదు. ఎప్పటికి తనీ సంసారాన్ని సరిదిద్దగలడు? అయోమయం!

● ● ●

ఉదయం వేళ! శేషమ్మ వంట చేస్తోంది; కమలగదిలో పక్కలు సర్దు తోంది.

వంటగదిలో నాయనమ్మ వెంట వెంట తిరుగుతున్న ప్రేమ కెవ్వు మంటూ ఏడవటం విన్పించింది అందరికీ. చేతిలో దుప్పటి వదిలేసి— "ఎందుకేడుస్తో ది ప్రేమ?" అంటూ గబగబా వెళ్ళింది కమల.

'దగ్గిరికి వచ్చి చూడు. నీ కే తెలుస్తుంది. ఉల్లిపాయలబుట్ట ఎలా గుమ్మరించిందో చూడు." తన తప్పేం లేదని చిందరవందరగా పడ్డ ఉల్లిపాయల కేసి చూపించింది శేషమ్మ.

నిజమే, ప్రేమ అటూయిటూ తిరుగుతూ వుల్లిపాయలబుట్ట తిరగ దోసింది.

"అయితే కొట్టడంఎందుకూ?" అంది కమల "కొట్టక ముద్దెట్టు కుంటారు కే? అది తిరగదోసినవన్నీ ఎత్తి పెట్టుకొంటూ కూర్చుంటే యివతల నా పనేంగానూ?" .

'మీరు పనిమాని సర్దుతూ కూర్చో నక్కరలేదు. దాన్నే ఎత్తమంటే లక్షణంగా ఎత్తుతుంది. ప్రేమా! వుల్లిపాయలన్నీ ఏరి బుట్టలో వేసెయ్యమ్మా! నాయనమ్మకి పని వుంది. నువ్వే ఒంచేశావుకదా?" అంది కమల.

ప్రేమ ఏడవటం మానేసి పడిపోయినబుట్ట తిన్నగా పెట్టి చిన్ని చిన్ని చేతులతో వుల్లిపాయలన్నీ ఏరి బుట్టలో వేసేసింది. శేషమ్మ మూతీ ముక్కూ తిప్పుకొంటూ—'ఉల్లిపాయలు కాబట్టి ఏరించావు, బాగానే వుంది. ఏ నెయ్యో ఒంచేస్తే ఏం చేస్తావూ?" అంటూ సాగదీసింది. ,

"ఏంచేస్తానా? నాలుగురోజులు

అన్నంలో నెయ్యి వెయ్యటం మానేస్తాను,—" నువ్వు నెయ్యి పారబోస్తావు కదా? నీకు నెయ్యి లేదు," అని చెప్తాను చేసినతప్పు తెలుసుకొంటుంది. మరోసారి అలా చెయ్యకూడదన్న విషయం, దానివల్ల కష్టం—అర్థమౌతాయి.

నిన్న రామం కాళ్లనిండా బురద పట్టించుకువస్తే ఏంచేశానో చూశారుగా? రెండు అంటించమని శాంతగారు హెచ్చరిస్తోనే వున్నారు. సబ్బుయిచ్చి వాణ్ణి బాత్‌రూమ్‌లో కూర్చోబెట్టి జోళ్లు తెల్లగా కడుక్కోమని చెప్పాను, కష్టపడి జోళ్లు కడుక్కున్నప్పుడు అవి తిరిగి మాపుకోకూడదన్న వివేకం వస్తుంది.

పిల్లలు తెలీక చేసేతప్పులు వాళ్లకే తెలిసివచ్చేలాగ శిక్ష విధించాలి మనం."

"ఏమో తల్లీ! నీలాగా చదువుకున్నామా? తగలడ్డామా? మాకేం తెలుస్తుంది?"

"తెలీనప్పుడు చెప్పింది అర్థం చేసుకుంటే బావుండిపోయేది. నన్ను ఆక్షేపణచెయ్యటం తప్పితే ఏమీ లేదు మీకు," అంటూ వెళ్లిపోయింది కమల.

తండ్రి చెప్పుల్లో కాళ్లు పెట్టి వాటిని ఈడ్చుకుంటూ సరదాగా పచార్లు చేస్తున్నాడు రామం.

"ఓ కేయ్‌మూర్తీ! నీచెప్పులు తగలేస్తున్నాడురా! ఇలారా! ఒక్కటి తగలనియ్! మట్టికరుస్తాడు వెధవ!

చెప్పేవినటంలేదు' అంటూ తెగ అరుస్తున్నాడు ముసలాయన.

"పిల్లవెధవతో మీకూ పంతం ఏమిటి? చెప్పుల్లో కాళ్ళుపెట్టి నడిచినంతమాత్రాన ఏంతగలడిపోతాయి? ఏపనీ చెయ్యకుండా కట్టుకట్టుకుని మూల కూర్చోమంటే పిల్లలు కూర్చుంటారా?" అని మధుమూర్తి అడిగేస్తే ఎంతబావుండును!

ఊహూ! అదిచేతకాదు సరికదా? "ఒరేయ్. రామం." అంటూ ఒక్క గావుకేక పెట్టాడు.

రామం భయంతో నించుండిపోయాడు. చెప్పులుతీసుకెళ్లి తలవువార పెట్టేశాడు.

"అయిందా అబ్బాయిగారిపని. ఇందాకట్నుంచీ నే చెప్తేవిన్నావా?" కోతివెధవా !" అని వళ్లికిలించాడు ముసలాయన.

"నువ్వే కోతి వెధవ్వి! గా డి ద వెధవ్వి, నువ్వేనువ్వే!" అంటూ వీధిలోకి పరిగెత్తాడు రామం.

'చూశావుట్రా మూర్తి! విన్నావుట్రా? మాటకు మాట ఎలా అన్నాడో!' అంటూ వుక్రోషంతో ఫిర్యాదు చేసుకున్నాడు కొడుక్కి.

మధుమూర్తి చూడలేదుగానీ అంతా విన్నాడు. కొడుకుని వెధవ తిట్లుతిట్టటం నచ్చలేదు బిడ్డలతండ్రి అయిన తనమీద తనతండ్రికి ప్రేమ వుందికదా? తనకుమాత్రం తనపసిబిడ్డలమీద ప్రేమవుండదూ? ఆవిషయం తండ్రికెందుకు అర్థంకాదు?

'మహా మంచి మంచి అలవాట్లు నేర్పేస్తూన్నానని అంటుందిగా వాళ్లమ్మ. పెద్దాచిన్నా లేకుండా వాడలా ముసలాయన్ని తిట్టివెడ్తుంటే తనకేం పట్టనట్టు వూరుకుందే ?' అంది శేషమ్మ కలగజేసుకొంటూ.

నిజానికి కమల మనస్సు కుతకుతా వుడుకుతోంది. ముసలాయన చేష్టలకి మధుమూర్తి వూరుకుంటే తను కలగజేసుకోవటం ఎందుకులే అని వూరుకుంది. తాతకి మనవడికి ఎంత సామరస్యం వుందో కమలకి తెలియందికాదు. ఇంట్లో ఎవరేపని చెప్పినా చేస్తాడుగానీ – ముసలాయన చెప్పినపని చస్తేచెయ్యడు రామం. విసనకర్ర అందించమంటే వినడు. మంచినీళ్లు తెచ్చిపెట్టమంటే వినడు. ఊహ తెలుస్తోన్నకొద్దీ వాళ్లిద్దరి మధ్యదూరం పెరుగుతోంది.

కమలఅంది – "పిల్లల్ని కొట్టీతిట్టీ బలవంతంచేసీ – ప్రేమలూ అనురాగాలు పుట్టించగలమా? వాళ్ళని నిష్కల్మషంగా ఆదరించిన వాళ్లనే వాళ్లూ ప్రేమిస్తారు. పిల్లల్ని చేరికచేసుకోలేక పోయినందుకు పెద్దవాళ్లు సిగ్గుపడాలిగానీ, వాళ్లుమాటకి మాట అప్పగించారని కాదు."

"అవున్లే ఎవరెలాపోతే తనకెందుకని ముసలాయన వూరుకోకూడదూ?" అంటూ సణుక్కోసాగింది శేషమ్మ.

కమల అసహ్యంతో మొహం చిట్లించుకొంది. పెద్దవయస్సులో

పోటీదార్లకు మనవి

"జ్యోతి" మాసపత్రిక కళాశాలల, విశ్వవిద్యాలయాల విద్యార్థినీ, విద్యార్థుల నిమిత్తం "చిన్న చిన్న కథల పోటీ" నిర్వహిస్తున్నది. దీనిలో పాల్గొనేవారు ఈ క్రింది నిబంధనలు పాటించ గోరుతున్నాము.

1. కథలు "జ్యోతి"లో రెండు మూడు పేజీలకు మించరాదు.

2. స్వకపోల కల్పితమైన స్వతంత్ర రచనలే పంపించాలి.

3. తమ పూర్తిపేరు, చదువుతున్న తరగతి, కాలేజీ, లేక విశ్వవిద్యాలయం పేరుతో సహా పూర్తి చిరునామా జతపరచాలి.

4. ప్రతినెల 1వ తేదీ వరకు అందిన రచనలనే ఆ పైనెల సంచికలో పోటీకి పరిగణిస్తాము.

5. బహుమతి పొందిన రచనలు త్రిప్పి పంపబడవు. అందుచేత స్టాంపులు పంపించ నవసరంలేదు. రచనల విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

6. కవరు మీద "జ్యోతి, చిన్న చిన్న కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.

7. రచనలను పంపవలసిన చిరునామా "ఎడిటర్," జ్యోతి, సచిత్ర మాసపత్రిక, విజయవాడ-2".

8. రూ. 50 లు ప్రథమ బహుమతి, రూ. 25 లు చొప్పున రెండు ద్వితీయ బహుమతులు.

వుండాల్సిన గుణాలు అత్తమామలకు ఏకోశానా లేవు.

పిల్లలు ఏతప్పుచేసినా— ఎంత అల్లరి చేసినా — ఎంత చిలిపితనం చేసినా పెద్దవాళ్లు పట్టిచుకోనే పట్టించుకోరు. పైగా నవ్వుకుంటారు. మురిసిపోతూ వాళ చేష్టల్ని తరిచి తరిచి చెప్పుకుంటారు బొత్తిగా ఓర్చుకోలేక పోవటం— చీటికి మాటికి కోపం తెచ్చుకోవటం—నోటికి వచ్చిన బండతిట్లుతిట్టి పొయ్యటం— పెద్దవాళ్లు చెయ్యనే లేరు.

జీవితంలో—చరమదశకి చేరినవాళ్ళకి తాత్కాలికావేశాలు కలగవు. అనుభవాలతో తలలుపండివుంటాయి. వయస్సులో వున్నవాళ్ళ బలహీనతలకూ- కోపతాపాలకూ- వయస్సు మళ్ళినవాళ్ళు- విరుద్ధంగా—సుదూరంగావుంటారు సంసారసమస్యలూ బాదరబందీ అంతా చాలించుకుని- ఆధ్యాత్మిక చింతన అధికం చేసుకుని వికసిన పుష్పాల్లా కళ్ళముందు కదలాడే పిల్లల్ని ముద్దుచేస్తూ-వాళ్ళ ఆటపాటల్లో ఇహాన్ని మర్చి- అనిర్వచనీయమైన ఆనందం పొందుతారు.

అలాంటి తత్వాన్ని - సహజత్వాన్ని— తన తల్లి దండ్రుల్లో చూసింది కమల.

ఏవయస్సుకితగ్గ లక్షణాలు ఆవయస్సులో వుండకపోతే — అలాంటి వ్యక్తులు ఎదటివారికి జుగుప్స కలిగిస్తారు.

'ఒరేయ్! మూర్తీ. దొంగవెధవ వచ్చాడ్రా! ఇందాక తిట్టిపోయాడు కనుక్కో.' అంటూ చిత్రమైన చూపులు చూసుకొంటూ వస్తోన్న మనవడి గుట్టు బయట పెట్టేశాడు ముసలాయన.

మధుమూర్తి సగం అయిష్టంగానే కొడుకుని నిలదీశాడు— 'తాతయ్యని తిట్టావా? తప్పుకాదూ?' అంటూ ఒకటి అంటించాడు ఆయన తృప్తికోసం.

జరిగిందానికి కమల సహించలేక పోయింది. తర్వాత మూర్తితో ఖచ్చితంగా అంది— 'మీకు పితృభక్తి అంత అపారంగా వుండే రోజూ రెండు పూటలా పువ్వులుపోసి పాదపూజ చేయండి అంతేగానీ— ఆయన మెహర్బానీకోసం అన్యాయంగా పసివాళ్ళ జీవితాలు నాశనం చేయకండి. వాళ్ళ చైతన్యాన్ని చంపకండి. బాల్యంలోని పునాదులమీదే బంగారు భవిష్యత్తు నిర్మాణం అవుతుంది.'

'అబ్బబ్బ! ఎప్పటికప్పుడు నీ లెక్చర్లు వినలేక చస్తున్నాను.'

కోపంగా విసుక్కున్నాడు మధుమూర్తి. ఈమధ్య మూర్తికి కోపం చిరాకూ— అతిగా వస్తున్నాయి— 'వాళ్ళ జీవితాలు బాగుపడిపోవాలన్న కోరిక నీకేగాని, నాకు లేదూ? ఆ మాత్రం విషయం నాకు తెలియదూ? ఇంటికివస్తే ఏవో గొడవలతో శాంతిలేకుండా చేస్తున్నారు. ఎలాగో అలా ఇల్లుకాస్త ప్రశాంతంగా వుంటేచాలని కేకలెయ్యటం గానీ ..'

'ఇల్లు ప్రశాంతంగా వుండాలంటే కేకలెయ్యాల్సింది పిల్లల్ని కాదు.' సాధ్యమైనంత కటువుగానే అంది కమల. మూర్తికి కోపం ఎక్కువౌతున్నకొద్దీ కమలలో మృదుత్వం బాగా సన్నగిలుతోంది— 'చెప్పాల్సినవాళ్ళకి చెప్పటం చేతకానప్పుడు ఆబాధ భరించండి ఈయింట్లో ప్రశాంతత వుండదు. ఇక ఇలాగే వుంటుంది.'

'అవును ఇలాగేవుంటుంది.' నీరసంగా కూర్చుండిపోయాడు మూర్తి.

కమలనిమాత్రం తనేం అనగలడు? ఎలా అనగలడు? మొగుడిమీద కోపం వచ్చినా— అత్తమీదకోపం వచ్చినా— చివరికి పనిమనిషిమీద కోపంవచ్చినా — పిల్లల్ని బాదుకునే తల్లుల్ని ఎరిగివున్న మూర్తి కమలనెలా విమర్శించగలడు? తన విజ్ఞానాన్నంతా రంగరించి బిడ్డల్ని పెంచుకుంటోన్న తల్లిని ఎలా తప్పుపట్టగలడు?

ఈ ఇంట్లో అనర్థాలకన్నిటికీ కారణం తనే. కమల సంవత్సరం తిరగకుండానే గ్రహించి బయటపెట్టిందా నిజం.

ఈ సంసారాన్నిలా భరించక తప్పదు.

● ● ●

ఇరవైనాలుగ్గంటలూ కోడలు పోరుతోనే వుంటుంది. దాని

మాటలుకాస్తా బుర్రకెక్కి ఏ ఘడియలో కొడుకు మారిపోతాడోనని కొడుకు వైఖరిని ఓ కంట కనిపెడుతోనే వుంటుంది శేషమ్మ

'ఈ మధ్య మూర్తి చాలా ముభావంగా వుంటున్నాడు సుమీ!' అంది ముసలాయనతో కూడా.

ఆ రోజు కొడుకు ఆఫీసునుండి వచ్చాక 'ఒసే అమ్మడూ! నువ్విలారా! రావుడూ! నువ్వు కూడా రారా! కాస్సేపు నా దగ్గర కూర్చోండి.' అంటూ లాలనగా పిల్చాడు ముసలాయన.

కమల విస్తుబోయింది.

పిల్లలుకూడా ఆశ్చర్యంగానే తాతగారి దగ్గిరికి చేరారు.

'ఇలా కూర్చోండర్రా. కథ చెపుతాను ఊకొట్టండి. ఒరే! దాన్ని తోసెయ్యకు' అంటూ యిద్దర్నీసర్ది కూర్చోబెట్టాడు— 'అనగనగా ఒక రాజుగారున్నారు...' కథ కూడా మొదలు పెట్టాడు.

పిల్లలు చక్కగా బుద్ధిగా కూర్చున్నారు. ఏడు చేపల కథ విని చప్పట్లు కొట్టారు.

ఆనందంతో కమల కళ్ళు చెమర్చినంత పనైంది ఆ రాత్రి ప్రేమని తాతగారు దగ్గిరికి పిల్చి మరీ పక్కలో పడుకోబెట్టుకున్నాడు.

క్రమంగా ఆయన ప్రవర్తనలోని విశేషాన్ని కనిపెట్టిన కమల చాలా ఆశ్చర్యపడింది. కొడుకు యింట్లో వున్నప్పుడు పిల్లలపట్ల చూపించే శ్రద్ధ - కొడుకు లేనప్పుడు బాగా లోపిస్తుంది. కోపాలూ చికాకులూ- యథా ప్రకారంగానే వుంటాయి. పిల్లలు తాతయ్యని నమ్మాలో మానాలో తెలీని పరిస్థితిలో సతమతమౌతున్నారు

'ఛ! ఏం మనుషులో! కన్నబిడ్డ మెప్పుకోసం తల్లిదండ్రులూ - తల్లిదండ్రుల మెచ్చుకోలు కోసం కన్నకొడుకూ - మనస్సుల్లో లేని అభిమానాలు నటించటం ... అవసరమేనా?' అనుకొంది కమల

ప్రేమ పగలు దగ్గిరికి చేరనించుకున్నా వినుక్కునే తాతగారు దాన్ని రాత్రుళ్ళు పిల్చి మరీ దగ్గర పడుకోబెట్టుకోవటం చాలా నాళ్ళుగా సాగుతోనేవున్నా కమల ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు.

కానీ ఓరోజు తల్లిపక్కలోనే నిద్రపోయిన ప్రేమ అర్ధరాత్రి లేచి— 'తాతయ్యదగ్గిర వెచ్చగావుటుందే! అక్కడే పడుకుంటానే,' అంటు ఏడవటం మొదలెట్టింది. ఏడుపుతో గొను విప్పేసుకొంది. తాతయ్య దగ్గిరికే పోతానని మొరాయించి కూర్చుంది.

ప్రేమ పరిస్థితిఏమిటో కమల వూహించగల్గింది. దాన్ని అంటుకుండా ముట్టుకుండా విడిగా పడుకోబెడితే నిద్రపోలేనిస్థితికివచ్చింది తాతయ్య దగ్గరగా పడుకోబెట్టు కోవటంవల్ల

దానికేదో సుఖం దొరుకుతోంది రోజూ.

దాన్నివల్ల ముసలాయనకుకూడా ఏదైనా సుఖానుభూతి కల్గుతోందేమో! లేకపోతే దాన్ని అంత ఆప్యాయంగా పక్కపక్కలో జేర్చుకోవటం ఏమిటి?

కమల చాలా సిగ్గుపడిపోయింది తన బుద్ధితక్కువకి పిల్లలపనక విషయం తను చాలానిర్లక్ష్యం చేసింది.

పిల్లల్ని పెద్దవాళ్ళ దగ్గర పడుకోబెట్టుకోకూడదు పిల్లల్ని పిల్లల్ని కలిపికూడా పడుకోబెట్ట కూడదు. వాళ్ళశరీరాల్లో నిద్రాణమై అపరిపక్వంగావున్న వాంఛలు వికారంగా రేకెత్తుతాయి. వాటికి పసితనంలోనే లొంగిపోయిన పిల్లలు బ్రతుకంతా బుగ్గిచేసుకుంటారు.

'అలాగేలే, రేపు తాతయ్యదగ్గరే పడుకుందువులే.' అంటూ బుజ్జగించి ఎలాగో నిద్రపుచ్చింది ప్రేమని ఆరాత్రి

• • •

భోజనాలుచేసి తీరిగ్గా కూర్చున్న వేళ—మిట్టమధ్యాహ్నం దిగబడ్డారు అతిథులు ముగ్గురు—తిథినియమములు లేక వచ్చువారే అతిథులుమరి. చిత్రం ఏమిటంటే వాళ్ళనిచూసి శేషమ్మకూడా గమ్మని గుర్తుతెచ్చుకోలేక కాస్త సందిగ్ధంలో పడింది.

'నేను వదినా మంగమ్మ' అనిడ మా వియ్యపురాలేగా? ఇదేమో మా పెద్దమ్మాయి. మొన్నే అత్తారింటినుంచి వచ్చింది. నెలతప్పిందని... పెద్దాసుపత్రిలో ఓసారి పరీక్ష చేయిస్తే బావుంటుందన్నారనీ .. బొత్తిగా తిండి యిమడట్లేదు. అదీగాక... ఈనెల్లో సముద్రస్నానాలుచేస్తే ముక్తి వస్తుందంటారు... మావియ్యపురాలు కొంచెం స్టీలుసామానదీ కొనాలనుకుంటోంది. అన్నిపనులూ కలిసివస్తాయి — మిమ్మల్నందర్నీ ఓసారి చూసినట్లూ వుంటుందనీ ... ...

'అయ్యో! ఎంతమాట! పదేళ్లుపైగానే అయిందినిన్నుచూసి ... అమాత్రం అభిమానం వుండబట్టి గుమ్మంలోకి వచ్చావు. లేకపోతే నీకేంఖర్మ మాయిల్లు తొక్కటానికి? రా మంగమ్మొదినా! కూర్చోండి. ఓసే కమలా! పొయ్యి అంటించు"

• *ఒకావిడ : "ఈ టెర్లిన్ చీర కట్టుకుంటే పది పన్నెండేళ్ళు చిన్న దానిలాగా కనిపిస్తానంటారు మా ఆయన."*

పొరిగింటావిడ : "అలాగా. మీ కిప్పుడెన్నేళ్లేమిటి ?"

"ముప్ఫయ్."

"టెర్లిన్ చీరలో కాదు, మామూలుగా ?"

అంటూ వుత్సాహంతో కేక పెట్టింది శేషమ్మ.

కమల పుస్తకం మూసి లేచింది.

'మీ కోడలు చదువుకొంటుంది'. ఆ అడదగటంలో ఆపిల్ల సినిమాకు వింటుందా? అన్న అర్ధం ధ్వనించింది.

'చదువుకొంటుంది గానీ పిస రంత గర్వం లేదనుమీ! ఎంత చెప్తే అంత. అత్తయ్యా అత్తయ్యా అంటు నేను చెప్పిందే ఒక్క పని కూడా స్వతంత్రించి చెయ్యదు. పెళ్ళయి ఇన్నేళ్ళయిందా? మొగుడికి కూడా తన చేతిమీదుగా అన్నం పెట్టుకోదు.

'అత్తయ్యా! మీరు వెళ్ళి మీ అబ్బాయికి అన్నం పెట్టండి' అంటుంది. వాడు మాత్రం? చదువుకున్న పెళ్ళాం దొరికిందని మిడిసి పడి పోతాడనుకున్నావా? అబ్బే! నేను ఎంత చెపితే అంత...'

'అదృష్టవంతురాలివమ్మా! ఏనాడో పెట్టివుట్టావు.' అంటు నిట్టూర్చింది మంగమ్మ - అత్తగారి మాట వెటనే లేచి కిక్కురుమన కుండా వంటచేస్తోన్న కమలని చూస్తే వాళ్ళందరికీ కాస్త అసూయ కలిగింది—

'మా కోడలైతే ... ఏం చెప్పమంటావ్? కడుపుచించుకుంటే కాళ్ళమీదనే పడుతుంది... ...ఒక మంచి లేదు... మన్నన లేదు...'

ఇష్టాగోష్ఠి హెచ్చు స్థాయిలో సాగిపోతోంది. పావుగంటులా గడిచి పోయిందా గంట.

నిజానికి కమల పెత్తనం అయితే వంటాగింటా చెయ్యదు. హొటల్ నుంచి కారియర్లు తెప్పించి - బిల్లు మంగమ్మగారి చేతికిస్తుంది. "హొటలు కుర్రాడు విన్నిగారూ! వాణ్ణి తొందరగా వంపించెయ్యండి" అంటుంది కానీ... శేషమ్మ...?

భోజనాలు అయ్యాయి.

ఒక్క కునుకు తీయటం అయింది.

'మూగమనసులు బావుందిట?' అంది మంగమ్మ.

'బాగానేవుంది. నేను రెండు సార్లు చూశాను.

'తేనెమనసులు ఇంకా బావుందమ్మోయ్. అంతా లవ్వూ - ప్రేమాను చూసి తీరాలి' అంది శేషమ్మ—

అందరూ గబగబా స్నానాలు చేసి పెట్టెల్లో కొత్తచీరలు కట్టుకుని బయల్దేరే హడావుడిలో పడ్డారు.

'అమ్మా! నేనూ వెళ్తానే!' అన్నాడు రామం.

'ఒద్దమ్మా! మనం ఇంకోసారి వెళ్దాం. నాన్నగారూ నువ్వూ - నేనూ - చెల్లీ - తమ్ముడూ - అందరం కలిసి సరదాగా వెళ్దాం. ఎవరువస్తే వాళ్ళతో వెళ్ళానసటం బావుంటుందా?' అంది కమల.

(సశేషం)

సినిమా

శ్రీ కాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ

ఆంధ్రరాష్ట్రం అవతరించక ముందు, ఒక ఐరోపా దేశంలో భారత రాయబారి పదవి నిర్వహించిన ఒక మళయాళ చారిత్రక పరిశోధకుడు ఆంధ్రులకు ఎన్నడూ స్వయం రాజ్యం లేదని 'పబ్లిక్'గా ఒక ప్రకటన చేశారు.

ఆయనే నేడు బ్రతికివుంటే, శ్రీ శంభూ ఫిలిమ్సువారి 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ'ను చూడనోచుకొంటే క్రీస్తుశకం 1958 నుంచే కాదు, క్రీస్తుపూర్వం మూడవ, రెండవ శతాబ్దంనుంచే ఆంధ్ర మహాసామ్రాజ్యం వున్నదని గ్రహించి వుండేవారు.

తెలుగు రాజకీయ పుట్టుకకు, రాజనీతి పుట్టుకకు సంబంధించిన కథలు తెలుగు తెరను ఇంతకు ముందు అలంకరించ లేదు. అపూర్వమైన ఆ యత్నాన్ని చేయ సాహసించారు నిర్మాత శ్రీ దగ్గుపాటి లక్ష్మీనారాయణ చౌదరి. తెలుగు సినిమా పరిమితుల పట్ల సానుభూతి వహిస్తే శంభూఫిలిమ్సు వారి నిర్మాణాన్ని ప్రశంసించని వారుండరు.

తెలుగుజాతి ఎలా ప్రభవించిందో తెలిపే ఇతిహాసం నుంచి శ్రీ పి. గణి నాగేంద్రరావు సినిమా కథ అల్లారు డి. చౌదరి స్క్రీన్ ప్లే సమకూర్చారు.

ఆంధ్ర మహావిష్ణుపురాణ గాథలో ముఖ్యపురుషులు ముగ్గురు.

ప్రస్తుత చిత్రంలో ఆ ముఖ్య పాత్రలైన వల్లభదేవుడు, సుచంద్రుడు, నిశుంభుడు. లక్ష్య నిర్వచనం ఎంతో బాగుంది.

సుచంద్రుడు రాజశాసనంకంటే దైవశాసనం గొప్పదని యోచించిన జ్ఞాని. తన క్రింది మండలాధిపులు ఐక్యత లేక పరస్పరం కీచులాడుకొంటూ వుంటే నాగజాతి రాజు, అప్పటికి ఏకవీరుడు ఆ మండలాలను స్వాహా చేసుకొంటూ వచ్చాడు. మండలాధిపులు కర్తవ్యం తెలుసుకొని దైవాజ్ఞ క్రిందనే ఏకం కాగలరని యెంచి తన రాజ్యాన్ని శ్రీకాకుళ చెన్నకేశవునికే అర్పించారు.

ఆ చెన్నకేశవుని అపరావతారమా? అజ్ఞారూపమా? అన్నట్లు ఆ సుచంద్రుని కుమారుడు వల్లభదేవుడు నిశుంభుని మదమణచ

నానికి ఉద్యమించాడు. ఆయనకాక, తానే ఏకవీరుడని నిరూపించ దల చాడు.

వల్లభదేవుని సంస్కార నిరూపణ మెచ్చదగింది. నిశుంభుని కుమార్తె అని తెలియక, సుజాతను ప్రేమి స్తాడు. తెలిసినమీదట గాంధర్వ వివాహానికి అంగీకరించడు. తండ్రికే అప్పగించి, కాళ్ళు కడిగి కన్యా దానం చెయ్యమంటాడు. అలాగే నిశుంభుని మంత్రి మహేంద్రదత్తు ఎత్తులను చిత్తు చెయ్యడంలోను ఎత్తుగడ, వివేకం, వ్యూహం చూపుతాడు. నిశుంభుని వధించడం కాక సంస్కరించడమే ధర్మమని తలంచుతాడు. అనుకొన్నది అక్ష రాలా ఆచరిస్తాడు. నాగరికుడని నిరూపించుకొంటాడు.

నిశుంభుడు ఎంతటి ఆటవిక ప్రవృత్తులు కలవాడైనా ధర్మమార్గం అనుసరించినవాడు. కోటలోకి వచ్చిన పరమ శత్రువు వల్లభదేవుని, కోట అవలివరకు క్షేమంగా పంపి, 'కోట వెలుపల ధైర్యం వుంటే అతణ్ణి పట్టుకోండి' అని అంటాడు. అతడే ఏకవీరుడని గ్రహించిన మీదట కీర్తిపతనకు సందేహించడు. చల్లగా అల్లుని చేసుకొంటాడుకూడా.

ఈ మూడు పాత్రల నిర్మాణం చిత్రానికి ప్రాణం. టూకీగా కథఅది.

కొన్ని సన్నివేశాలలో ఆ యా పాత్రధారులు సంభాషణలను మరింత స్పష్టంగా, సందర్భాను సారం బలంగా, భావాన్ని దట్టించి పలికి వుంటే చిత్రం యింకా రక్తి కట్టేది. అలాగే చిత్రీకరణ కూడా మరింత వేగంతో సాగితే చిత్రానికి యింకా శక్తి వచ్చేది.

రెండు మూడు పాటలలో భావనా పటిమ బాగా ద్యోతక మైనది.

వరూధిని - ప్రవరాఖ్య నృత్యం, మన్మథవేదన నృత్యం, పూదామ రే ఖాస్త్రంగా మహేశు సాగించిన జయాలు, ముగింపులో విష్ణుకీర్తి చిత్ర ప్రమాణాన్ని ఇనుమడింప జేసినవి.

శాస్త్ర ఫక్కీలో సంప్రదాయు సిద్ధంగా సాగిన సంగీతం శ్రవణా నందకరం.

బౌద్ధ, జైన మతాలు బాగా వ్యాపించి వున్న కాలమది. బౌద్ధ కాలపు రేఖా చిత్రాలు చాలా భాగం సెట్‌లకు వినియోగించారు. అయితే కోటలు మొదలైనవి కొంత అధునికంగా వున్నాయి.

ఛాయాగ్రహణం సాధారణ స్థాయిలో వున్నది.

పై శాఖలకు సారధ్యం వహిం చింది పెండ్యాల నాగేశ్వరరావు, తోట వెంకటేశ్వరరావు, యు. రాజ గోపాల్, చిత్ర దర్శకుడు వి. కె. శేఖర్. కథ సంభాషణలు, పాటలు పింగళి నాగేంద్రరావు. స్క్రీన్‌ప్లే: డి. చౌదరి.

నటనలో రామారావు, తన



బాబూ మూవీస్‌వారి "కన్నెమనసులు" చిత్రంలో
సంధ్యారాణి, కృష్ణ

సహజ ప్రజ్ఞను, జమున తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించగా ఎస్. వి. రంగారావు హాస్య కరుణ రౌద్రములను మేళవించ కలిగారు. దుష్టమూర్తిగా కళ్ళల్లో నిలచే నటనను ముదిగొండ లింగమూర్తి ప్రదర్శించారు. రేలంగి పసాద్, గిరిజ హాస్య గన పోషణభారం సమగ్రంగానే వహించారు. విజయలక్ష్మి నృత్యాలు ఆహ్లాదకరం

• • •

గౌరీ ప్రొడక్షన్స్‌వారి 'విష్ణులీల'లో రామారావు, జయలలిత ముఖ్య పాత్రధారలు సంభాషణలు : పాలగుమ్మి పద్మరాజు.

సుందరాకాండ

శ్రీరామా పిక్చర్స్‌వారి సుందరాకాండ (సీతాపహరణం నుంచి పట్టాభిషేకం వరకు) చిత్రంలో కాంతారావు శోభన్‌బాబు, రంగారావు, రాజనాల, రామకృష్ణ, ధూళిపాళ, జమున, రాజశ్రీ, గీతాంజలి నటిస్తారు. సంభాషణలు : పాలగుమ్మి పద్మరాజు, గీతాలు: ఆరుద్ర, శ్రీశ్రీ, సి నారాయణరెడ్డి కొసరాజు, సంగీతం : మల్లేశ్వరరావు, ఛాయాగ్రహణం : రాజారాం, దర్శక నిర్మాత : బోళ్ళ సుబ్బారావు. జులైలో సెట్స్‌కు వెళ్ళవచ్చు.

మూడు జంటలతో "చిలకా - గోరింక"

"చిలకా - గోరింక" - చక్కటి పేరు. ఇంత చక్కటి పేరుతో తయారయిన ఆత్మా ఆర్ట్సు వారి "చిలకా - గోరింక"లో సామాన్యుని మనసును ఆకట్టుకొనే ఆకర్షణలు ఎన్నో వున్నాయి.

ప్రేమకు, వయసుకు సంబంధం లేదు. అనురాగానికి, అర్హతలకు పొత్తు అనవసరం. ఆత్మీయత, అంతస్థు ఒకదానితో ఒకటి సమన్వయం కానవసరం లేదు... ఈ సూత్రాలను నిరూపించటానికి, అజ్ఞాతంగా మనస్సులో వుండి పోయిన మమతలకు నిర్దుష్టమైన ఒక రూపకల్పన చేయటానికి శ్రీ ప్రత్యగాత్మ, తన స్వంత చిత్రం 'చిలకా - గోరింక'లో విశేష మైన కృషిచేశారు.

ఈ చిత్రంలో మనకు మూడు జంటలు కనిపిస్తాయి. వయస్సుల్లోనే గాక, భావ వికాసంలో కూడా ఎన్నో వ్యత్యాసాలున్నాయి.

ప్రేమకు, వయస్సుకు సంబంధం లేదని నిరూపిస్తారు, తొలి జంట ఎస్. వి. రంగారావు, అంజలీదేవి. జీవితాన్ని చూచి, తరచి, కాచి వడ పోసినప్పటికీ, అరవై సంవత్సరాల జీవనంలో ఆయనకు అర్ధాంగి మీద గాని, జీవితం మీదగాని మమకారం రవంతయినా తరగదు.

ఈ జంటను గంభీరమైనసముద్రం గాను, వీరిలో వుదయించే భావా లను సముద్రపు హోరుతోను పోల్చారు దర్శకులు ప్రత్యగాత్మ.

రెండవ జంట సెలయేరు: కమ్మని గాలులను వీస్తూ, హృదయాన్ని పరిమళింపచేసే తత్వం దీనిది. అప్పు డప్పుడే జీవితంలో అడుగుపెడుతూ, తమకు తెలియకుండా తమ మన స్సులో మల్లెలను వికసింప చేసు కొంటూ వుండే యీ జంటలోని ఇద్దరు కృష్ణంరాజు, కృష్ణకుమారి. కృష్ణంరాజును - ఈ కొత్త నాయ కుణ్ణి - ఈ చిత్రతోనే వెండితెరకు పరిచయం చేస్తున్నారు, దర్శకులు ప్రత్యగాత్మ.

గంభీరమైన సముద్రాలు, లలిత మైన సెలయేళ్ళతోబాటు హుషా రెక్కించే పిల్ల కాలవలు కూడా వుంటాయి. పిల్లకాలువతో పోలిన యీ జంటకు పద్మనాభం, కుమారి రమాప్రభ రూపకల్పన చేస్తు న్నారు. కుమారి రమాప్రభను కూడా హాస్యపాత్రలో వెండి తెరకు పరి చయం చేస్తున్నారు, ప్రత్యగాత్మ.

ఈ మూడు జంటలు గాక, ఇందులో మరో ముఖ్యమైన పాత్రకు నటి వాసంతి జీవం పోస్తోంది. ఈ అమ్మాయి విదేశా లకు వెళుతుంది, చిత్రం సమాప్తంలో.

తెలుగులో రచయితగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన పినిశెట్టిని ఇందులో ఎంతో చిత్రమైన భూమి

కళలో పరిచయం చేస్తున్నారు. అలాగే రంగస్థల నటిగా పేరు పొందిన శ్రీమతి తిలకం యీ చిత్రంలో వుదాత్తమైన ఒక గృహిణి పాత్రకు రూపకల్పన చేస్తుంది.

కథల్లో కొత్తదనం లేదంటూన్న మనకు "చిలక - గోరింక" ఒక కొత్త అనుభూతి కలిగిస్తుంది.

దర్శకుడుగా, ప్రేక్షకుల మనస్తత్వవేత్తగా ప్రత్యగాత్మ చేస్తున్న యీ నూతన ప్రయోగాన్ని కళాభిమానులు సాదరంగా స్వీకరించడంలో సందేహం లేదు.

సంగీత ప్రధాన చిత్రం "సంగీతలక్ష్మి"

నవ్యత్వం తొణికిసలాడే ఈ సాంఘిక చిత్రంలో రాధ (జమున) వేణు (రామారావు) మధ్య కళ పరమార్థం తెచ్చే స్పర్థ చక్కగా నిరూపితమైనది.

రాధ మన సంప్రదాయ కళను కళగానే ఆరాధించాలని — ధనార్జన కోసం కళాకారులు తమ కళను చులకన చేయరాదనే తత్వం కలది.

వేణు ఆశయం అదొక తరహాది. మన ప్రాచీన సంస్కృతి పరిణతి పొందటానికిగాను విశాల దృక్పథం చూపి పాశ్చాత్య సంస్కృతిలోని విశిష్టత స్వీకరించాలని ఆ మేలి కలయిక నుంచి ఒక మహత్తరమైన



భారత్ ఫిలింస్ వారి
"భక్తపోతన"లో శోభన్ బాబు

కళను వుద్భవింప జేయవచ్చుననేది అతని తత్వం. వేణు విదేశ పర్యటనానంతరం వచ్చే ఆ సిద్ధాంత సంఘర్షణ "సంగీతలక్ష్మి" చిత్రానికి ఒక ముఖ్య ప్రాణం.

కళ కళ కొరకే కాదు - ప్రజల కొరకు అన్న తన భర్త ధ్యేయాన్ని చివరకి అంగీకరించి - మరో అడుగు ముందుకు వేసి - దేశంకోసం తన

గాన కళను అంకితం చేస్తుంది రాధ. ప్రజలను తన గానంతో వుత్తేజ పరుస్తుంది వేణు సహధర్మచారిణి

శ్రీప్రగతిని తయారవుతున్న సీతా రామాంజనేయ పిక్చర్స్ వారి సంగీత ప్రధాన చిత్రం 'సంగీతలక్ష్మి' షూటింగులు మే 3వ తేదీనుండి 6వ తేదీ వరకూ న్యూటోన్ స్టుడియోలో వరుసగా రెండు సెట్లలో జరిగాయి. ఆ షూటింగ్ కార్య క్రమంలో ఎస్. వి. రంగారావు, జమున, నిర్మల మొదలైనవారు పాల్గొన్నారు.

7వ తేదీన కోవలంలో ఔట్ డోర్ షూటింగు జరిపారు. అందులో ఆత్రేయ రచించిన దేశభక్తి గేయం

"నేను పుట్టిన మట్టి యిదీ ..."
నేలమీది స్వర్గమిదీ -
పాలపొంగు నేల యిదీ
భరతభూమినాదీ నాదీ...నాదీ' -


అనే పాటను కథానాయకుడు వేణుపై చిత్రీకరించారు. విదేశాలలో అనేక సంవత్సరాలు పర్యటించిన తర్వాత తన మాతృభూమిపై మొట్ట మొదటి సారిగా అడుగుపెట్టినపుడు కలిగే అనుభూతి - వుద్వేగం ప్రశంస నీయంగా చిత్రీకరించారు దర్శకులు గిడుతూరి సూర్యం ఆ దేరోజు సాయంత్రం వాహినీ స్టూడియోలో హవాయి దీవుల ప్రజలమధ్య హీరోతో ముఖ్యమైన ఘట్టాలను చిత్రీకరించ టం కూడా జరిగింది. ఈ చిత్రంలో హవాయి ప్రజల విశేషాలు చూపిం చటం ఒక ఆకర్షణ.

మే 12-13-14 తేదీలలో వాహినీ స్టూడియోలో హాస్యరస సన్నివేశాలు రమణారెడ్డి, సూర్యకాంతం రాజ బాబు, ప్రసాద్, యల్. విజయలక్ష్మి, నాగభూషణం లపై చిత్రీకరించేరు. అంతేకాకుండా రాక్ అండ్ రోల్, ట్విస్టు, స్పానిష్ నృత్యాలను ఎల్. విజయలక్ష్మి - నాగభూషణం - పై హాస్యనటులతో చిత్రీకరించనున్నారు

ఈ సంచిక వెలువడేసరికి నాయ కుని సముద్రయానం ఔట్ డోర్ షూటింగ్, గయోపాఖ్యానం నాటక సన్నివేశం చిత్రీకరణ జరిగివుంటుంది. జమున కృష్ణపాత్రలోనూ, ఎన్. టి. రామారావు అర్జునుడి పాత్రలోనూ, రమణారెడ్డి గయుని పాత్రలోనూ కనిపించనున్నారు జూన్ 3-12 తేది ల మధ్యన నాయికా నాయకుల మధ్య ప్రథమ సంగీత పోటీలు - వేతాళ సన్నివేశం, హీరోకూ గూండాలకూ మధ్య జరిగే పోరాటు ఘట్టాలు చిత్రీకరించనున్నారు. అంతటితో చిత్రనిర్మాణం పూర్తవు తుంది.

సంగీత ప్రధానమూ - నవరస భరితమూ అయిన "సంగీతలక్ష్మి" సాంఘిక చిత్రానికి మాస్కోలోని మాస్ ఫిల్మ్ స్టూడియోలో శిక్షణ పొందిన గిడుతూరి సూర్యం దర్శ కత్వం కొత్త కళాకాంతుల నిస్తున్నది

సంగీత దర్శకులు శ్రీ రాజేశ్వర రావు "సంగీతలక్ష్మి"లో తెలుగుతనం వుట్టిపడే ఆంధ్ర జానపద సంగీతం



సీతారామాంజనేయ పిక్చర్స్‌వారి "సంగీత లక్ష్మి"లో
రామారావు, బేబీ శాంత, జమున

మొదలు - పాశ్చాత్య సంగీతంలో వున్న స్వారస్యాన్ని మథించి కొంగ్రొత్త బాణీలను సృష్టించ యత్నించారు.

చిత్ర నిర్మాణంలో నిమగ్నమై వున్న సాంకేతికవర్గ - కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : గిడుతూరి సూర్యం, ఛాయ : ఎన్, గ్య, కళ : రాజేంద్ర కుమార్, సంగీతం : ఎస్. రాజేశ్వర రావు, మాటలు : ఆత్రేయ, పాటలు: ఆత్రేయ శ్రీశ్రీ దాశరథి, సి. నారాయణరెడ్డి, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, నేపథ్యగాయకులు : ఘంటసాల, ఎస్. మూర్తి, దుస్తులు : గాంధి, స్టిల్సు: రాధాకృష్ణమూర్తి, నృత్యం : కె. యస్. రెడ్డి, సహాయ దర్శకులు: జి. వి. ప్రభాకర్, ఎ. బి జగన్మోహన్.

నటీనటవర్గ వివరణ : ఎన్. టి. రామారావు, జమున, యస్వీ రంగారావు, నిర్మల, ఎల్. విజయలక్ష్మి, నాగభూషణం, రమణారెడ్డి, సూర్యకాంతం, రాజబాబు, దుర్గప్రసాద్, పెరుమాళ్ళు, యమ్. సత్యం, పి. నరసింగరావు, బి. నారాయణరావు, కె. వి. రెడ్డి, బాణం

ప్రాథమిక దశ చిత్రాలు

గృహలక్ష్మి

దర్శక నిర్మాత పి. రామకృష్ణ సమర్పించే హాస్యరస ప్రధాన చిత్రానికి 'గృహలక్ష్మి' అని నామకరణం చేశారు. నాగేశ్వరరావు, భానుమతి, ఎస్. వి. రంగారావు, సూర్యకాంతం ప్రధాన పాత్రధారులు. సంభాషణలను డి. వి. నరసరాజు సమకూర్చారు సంగీత దర్శకులు : రాజేశ్వరరావు, నిర్మాణ సంస్థ : భరణీ పిక్చర్స్.




"చిలకా - గోరింక"లో తెలుగుపాట పాడుతున్న హిందీ తార నూతన్

"పిన్ని"

తమిళంలో విజయవంతంగా ప్రదర్శింపబడిన "సిత్తి" (పిన్ని) అనే సాంఘిక చిత్రం ఆధారంగా శ్రీకాంత్ ప్రొడక్షన్స్ అనే క్రొత్త సంస్థ నిర్మించే ఈ చిత్రంలో శోభన్ బాబు, రేలంగి చలం, అల్లు రామలింగయ్య, దేవిక, కాంచన ప్రధాన పాత్రధారులు. సంభాషణలు : సదాశివబ్రహ్మం, సంగీతం : టి. వి. రాజు దర్శకుడు : బి. ఏ. సుబ్బారావు.

కాంభోజ రాజుకథ

అనంతలక్ష్మి ప్రొడక్షన్స్ వారి 'కాంభోజరాజు కథ' చిత్రంలో శోభన్‌బాబు, బాలయ్య, గుమ్మడి, రమణారెడ్డి, చలం, బాలకృష్ణ, రాజ్‌బాబు, ప్రసాద్, సారథి, అంజలీదేవి, రాజశ్రీ, విజయలక్ష్మి, సూర్యకాంతం, సూర్యకళ, తిలకం, మీనాదేవి, సబితాదేవి, ఎమ్. ఎన్. లక్ష్మి మున్నగువారు నటిస్తారు. సంభాషణలు : పిచ్చేశ్వరరావు, సంగీతం : టి. వి. రాజు, కెమెరా : ఎస్. వెంకటరత్నం, కళ : రాజేంద్ర కుమార్, నిర్మాతలు : డి. భాస్కరరావు, కొసరాజు, భానుప్రసాద్. నిర్వహణ : చెంచురామయ్య, దర్శకత్వం : తిలక్ విజయాగార్డెన్స్‌లో కొసరాజు రచించిన 4 పద్యాలు రికార్డుచేశారు. వాటిని ఘంటసాల, సుశీల, మాధవపెద్ది గానం చేశారు.



ఆత్మా ఆర్ట్సువారి "చిలకా - గోరింకా" చిత్రంలో
నూతన నటుడు కృష్ణంరాజు, కృష్ణకుమారి

విశ్వామిత్ర

శ్రీ రాజశేఖర ఫిలిమ్స్ వారి "విశ్వామిత్ర" చిత్రంలో ఎస్. వి. రంగారావు ప్రధాననటుడు. కథ: కె. ఎస్. ఎన్. శాస్త్రి. సంభాషణలు: పింగళి నాగేంద్రరావు. దర్శకత్వం: కమలాకర కామేశ్వరరావు. జూన్‌లో రికార్డింగ్ ఆరంభం కాగలదు.

భర్తవు

ప్రవీణా ఆర్ట్సు పిక్చర్స్ వారు "భర్తవు" అనే మలయాళ చిత్రం ఆధారంగా తెలుగులో ఒక చిత్రం తీయబోతున్నారు. గుమ్మడి, అంజలి, కాంచన, చలం మొదలైన వారు నటించగల ఈ చిత్రానికి వేదాంతం రాఘవయ్య దర్శకుడు. రచన: పినిశెట్టి. జూన్ ఆరంభంలో షూటింగ్ ప్రారంభమౌతోంది.

ఖడ్గ తిక్కన

జి. రామినీడు దర్శకత్వంలో సారథి స్టుడియోలో నిర్మిత మవుతున్న శ్రీ కమల్ ఫిలిమ్స్ వారి "ఖడ్గతిక్కన" చిత్రంలో నాగేశ్వర రావు, జగ్గయ్య, ఎస్. వి. రంగారావు, గుమ్మడి, రమణారెడ్డి, జమున, జి. వరలక్ష్మి నటించగలరు. రచన : ఆరుద్ర, కళ : గోఖలే, కెమెరా : సి. నాగేశ్వరరావు. స్వరకల్పన : పూర్ణచంద్రరావు, నిర్మాత: పి. జాన్.

గొల్లభామ

శేఖర్ ఫిలిమ్స్‌వారి "గొల్లభామ" చిత్రానికి, 1946 శోభనాచలవారి "గొల్లభామ"ను డైరెక్ట్ చేసిన సి. పుల్లయ్యగారే దర్శకులు. కె. సోమశేఖర్, రాధాకృష్ణ నిర్మించే ఈ చిత్రానికి రామారావు, దేవిక, రేలంగి, గిరిజ, ముక్కామల, మిక్కిలినేని నిర్ణయమైనారు. రచన : జూనియర్ సముద్రాల, పాటలు : సి. నారాయణరెడ్డి, సంగీతం : టి. వి. రాజు, ఛాయాగ్రహణం : రవికాంత్ కళ : కె. నాగేశ్వరరావు

● ● ●

"నానల్" అనే తమిళ చిత్రం ఆధారంగా తెలుగులో పి. సుబ్బారావు ఒక చిత్రంతీయబోతున్నారు. ఒకే సెట్టు మీద 4 వారాల లోగానే ఈ చిత్రం పూర్తి చేయబడుతుంది. గుమ్మడి, చలం, పద్మనాభం, రామకృష్ణ, ప్రభాకరరెడ్డి, ఉదయకుమార్ త్యాగరాజు, మాలి, అంజలీదేవి, గీతాంజలి పాల్గొంటారు ఈ చిత్రంలో సి. నారాయణరెడ్డి రాసిన 6 పాటలు ఉంటాయి వాటిని ఘంటసాల, సుశీల గానం చేశారు. సంభాషణలు-మహారథి, కెమెరా - ఎస్. ఎస్. లాల్, సంగీతం - విజయా కృష్ణమూర్తి, స్టుడియో - అరుణాచల, దర్శకత్వం - ఎస్. డి. లాల్.


చిట్టెమ్మ - చిన్నమ్మ

గోకుల్ ఆర్ట్ థియేటర్స్ బ్యానర్‌లో దోనేపూడి కృష్ణమూర్తి నిర్మించే "చిట్టెమ్మ - చిన్నమ్మ" చిత్రంలో కాంతారావు, చలం, రేలంగి, రాజశ్రీ, సూర్యకాంతం, రాధాకుమారి మున్నగు వారు నటిస్తారు. కథ : జి. వి. జి. సంభాషణలు : బొల్లిముంత శివరామకృష్ణ సంగీతం : టి. వి. రాజు, గీతాలు : సి. నారాయణరెడ్డి. ఛాయాగ్రహణం: రామ్‌చంద్, దర్శకత్వం : ఎస్. డి. లాల్.

రాజశ్రీ ద్విపాత్రాభినయం ఈ చిత్రంలో ఒక ప్రత్యేకత.

"కన్నె మనసులు" విశేషాలు

బాబూ మూవీస్ వారి "కన్నె మనసులు"లో చివరి పాటను విజయ గార్డెన్స్‌లో మే ఆరంభంలో



రాజా — కృష్ణంరాజు

ఉరకలు వేసే వయస్సు. స్వచ్ఛమైన మనసు. ఆరాధించే హృదయం. ఇవి రాజాకు పెట్టని సొమ్ములు. అతని జీవితంలోకి, కలలోకి ఉష 'హంస వలె, నెమలి వలె' నడిచి వచ్చింది. ఉషలోని ప్రతి కదలిక అతనికి కావ్య వస్తువే. ఉషను తన దానిగా చేసుకొనే క్షణం వచ్చేటప్పటికి ఉష మాయమైంది.

ఉషతో నిండిన గుండె, ఉషకై వెదికే కళ్ళు, ఉషనే ఊహించే మనస్సు—వీటికి అర్థం లేకుండా పోయింది. నరకానికి సమీపమైన అతని జీవితం స్వర్గం అవుతుందని కూడా అతనికి తెలియదు. తూలి మళ్ళీ సెలయేరుకు గండిపడితే ఏమౌతుంది?

ఆత్మ ఆర్ట్సు "చిలకా - గోరింకా"లో ఈ శృంగార, విషాద పాత్ర చరిత్రను నూతన నటుడు కృష్ణంరాజు నిర్వహించారు.

పద్మశ్రీ చిత్రంలో నాగేశ్వరరావు, సావిత్రి

పద్మశ్రీవారి సాంఘిక చిత్రంలో నాగేశ్వరరావు, సావిత్రి, జగ్గయ్య, ముఖ్యభూమికలు ధరించనున్నారు. జూలైలో సెట్స్‌కు వెళ్ళగల ఈ చిత్రం మైత్రీ శిఖరాగ్రమును చూపుతుంది. దర్శకుడు: వి. పుల్లయ్య, నిర్మాత: వి. వెంకటేశ్వర్లు, స్టుడియో: శ్రీ సారధి.

జానపదంలో మామ మైకం

ఇందిరా రమణా పిక్చర్స్‌వారి తొలి జానపద చిత్రంలో మే రెండవ వారంలో ఒక పాటను రికార్డు చేశారు. 'మామా! మైకమా?' అని ఈ పాటను శ్రీశ్రీ వ్రాయగా కోదండపాణి స్వరకల్పన చెయ్యగా పి. సుశీల పాడారు. రాజశ్రీపై ఆ పాటను చిత్రీకరిస్తారు. మైకంమామ రమణారెడ్డి.

ఈ కాస్ట్యూమ్ థ్రిల్లర్‌లో మొత్తం తొమ్మిది పాటలు వుంటాయి వీటిలో మూడు రికార్డులు కావలసి వున్నాయి. ఐనింటి చిత్రీకరణ ఇంతవరకే పూర్తి అయినది. తొమ్మిది ఎడిటెడ్ రీళ్లు సిద్ధమైనవి. స్త్రీ వేషంలో శోభన్‌బాబు అల్లరి ఈ చిత్రానికి ఆకర్షణ. యూనిట్ వివరమిది: తారాగణం: సుమ్మకి, జి. వరలక్ష్మి, శోభన్‌బాబు, రాజశ్రీ, రామకృష్ణ, రత్న, వాణిశ్రీ, రాజబాబు, లంక సత్యం, రమణారెడ్డి, ముక్కామల, సత్యనారాయణ, బాలకృష్ణ.


సాంకేతికవర్గం: దర్శకత్వం, ఎడిటింగ్: జి. విశ్వనాథం, సంభాషణలు: జి. కె. మూర్తి, ఛాయ: కన్నన్, కళ: నాగరాజన్, నిర్మాత: టి. సి. సుబ్బన్న



కొత్త నాట్యతార జయశ్రీ
"భక్తపోతన"లో
నృత్య భంగిమ

మేలో షూటింగ్ జరిగిన చిత్రాలు

మే మాసంలో ఎక్కువగా షూటింగ్ జరిగిన చిత్రం 'సంగీత లక్ష్మి', సురేష్ వారి 'శ్రీకృష్ణ తులాభారం' కూడా శరవేగంతో తయారవుతున్నది. విజయలక్ష్మి వారి 'గూఢచారి' వాహినివారి 'రంగులరాట్నం', బాబూ మూవీస్ 'కన్నె మనసులు' మేలో బాగా సింగారించుకొన్నవి. హైదరాబాద్ మూవీస్‌వారి 'అర్ధరాత్రి' కూడా చకచకా తయారవుతున్నది.



'ఆత్మా ఆర్ట్సు వారి చిలకా-గోరింకా' చిత్రంలో
పద్మనాభం, రమణారెడ్డి

శ్రీ కేదారేశ్వరీవారి తొలి తెలుగు చిత్రం

శ్రీ కేదారేశ్వరీవారి తొలి చిత్రానికి విజయా గార్డెన్స్‌లో రికార్డింగ్ జరిగింది కాంతా రావు, సత్యనారాయణ, రమణమూర్తి, రాజ్‌బాబు, రాజశ్రీ, విజయలక్ష్మి, వాణిశ్రీ మున్నగువారు నటించే ఈ చిత్రానికి రచయిత వీటూరి. సంగీత దర్శకుడు. కోదండపాణి, ఛాయాగ్రహకుడు: జానకిరామన్, కళ. బి. ఎన్. కృష్ణ శ్రీమతి కృష్ణవేణి నాయుడు నిర్మించే ఈ చిత్రానికి దర్శకుడు అమంచర్ల శేషగిరిరావు.

ఢిల్లీ అవార్డులూ ఆంధ్రులూ

ఈ సంవత్సరపు రాష్ట్రపతి అవార్డులు ఒకవిధంగా ఆంధ్రులకుమిక్కిలి ఆనంద దాయకం.

బంగారు నంది అవార్డు అందుకొన్న 'అంతస్థులు' రాష్ట్రపతి రజిత పతకంకూడా అందుకొన్నది. 'వల్నాటి యుద్ధం' ఢిల్లీ యోగ్యతా పత్రానికి (మండల ప్రాతిపదిక) నోచుకున్నది. స్క్రీన్ ప్లే, దర్శకత్వం, ఎడిటింగ్ లలో నూతనాధ్యాయం ప్రారంభించిన 'మనుషులు - మమతలు' కూడా ఢిల్లి రెండవ యోగ్యతాపత్రం పొందింది.

తెలుగు భాషకు రావలసిన మూడు అవార్డులూ వచ్చాయి

కాని, తమిళ భాషకు రావలసిన మూడు అవార్డులలో రెండు మాత్రమే లభించినవి. మూడవ దానికి అర్హమైన చిత్రమే లేదన్నారు. ఆ రెండు చిత్రాలలోనూ నాయికలు తెలుగువారే.

'కారెట్ ట్రాప్' అనే హాలివుడ్ చిత్రం పోకడలు కల 'కుళందెయుమ్ దైవం' (పిల్లలు దైవసమానం) రజిత పతకం పొందింది నాయిక జమున 'తిరువత్తి అదయాళ్' (శివలీల) యోగ్యతాపత్రం సంపాదించింది. ఇందులో నా... పార్వతి, సావిత్రి.

అటు హిందీ రంగానికి పోయినా తెలుగువారి ఖ్యాతి నిలిచింది.

'గైడ్' హిందీ చిత్రానికి హిందీ మండలంలో యోగ్యతాపత్రం సంపాదించింది. అందులో నాయిక విజయవాడ తార వహీదారెహ్మాన్.

మళ్ళీ ఇటు కన్నడానికి వస్తే రజిత పతకం పొందిన 'హరిశ్చంద్ర' నిర్మాత కె. వి రెడ్డి

ఇది ఇలా వుండగా 'అంతస్థులు' ఒక విధంగా చరిత్ర సృష్టించింది బంగారు నంది అవార్డు, రాష్ట్ర... రజతపతకం, ఫిలింఫేర్ అ... సంపాదించింది. ఈ మూడి... గెలుచుకున్న తొలి తెలుగు... ఇదే దీని నిర్మాత రాజేంద్రప్ర... దర్శకుడు : వి. మధుసూదన...

జూబిలి బి. ఎన్. రెడ్డి

మద్రాసు ఫిలిం ఫాన్స్... వారు మే ఎనిమిదవ తేదీన శ్రీ బి. ఎన్. రెడ్డి, శ్రీ కడారు నాగభూషణం గార్లకు పతకములిచ్చి సత్కరించారు. సినిమారంగంలో సి... జూబిలీ చేసుకొన్నందుకు ఈ సన్మానం జరిగింది. సంస్థ వారు శ్రీ బి. ఎన్. రెడ్డి చలనచిత్ర పరిశ్రమకు కంటె కళకు చేసిన సేవను ఉగ్గడించారు.

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Press
Congress Office Road, Governorpet, Vijayawada